www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 62 | సోమవారం | 21 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



రోడ్లే ఇళ్లు

- గూడులేని వారిని లెక్కించే సర్వే
- త్వరలో నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- మొదలైన టెండర్ ప్రక్రియ
- సంవత్సరానికి మించి ఒకే ప్రాంతంలో ఉంటున్న వారి వివరాల సేకరణకు ఆదేశాలు

మన తెలంగాణ/ హైదరాబాద్: నిలువ నీడ లేక రహదారులపైన జీవితాలను గడుపుతున్న వారిని గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ''జిఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టమ్) హోమ్‌లెస్'' సర్వే చేపట్టనుంది. ప్రైవేటు లేదా స్వచ్ఛంద సంస్థలకు సర్వే బాధ్యతలను అప్పగించనున్నారు. దీనికి సంబంధించిన టెండర్ ప్రక్రియను మొదలు పెట్టారు. ఈ సర్వేను మూడు విభాగాలుగా విభజించి, మూడు నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేస్తున్న నేపథ్యంలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని, సర్వేతో పాటు షెల్టర్ల ఏర్పాటుకు తగిన వసతులు, సౌకర్యాలను కూడా అంచనా వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఇది వరకే హోమ్‌లెస్ సర్వేను చేపట్టినా క్షేత్రస్థాయిలో జిఐఎస్ ఆధారిత సర్వేను చేపట్టేందుకు

తరువాయి 6లో

కొన్ని చోట్లే

వర్షాలు రాష్ట్రమంతటా పడలేదు

వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకే పరిమితం

మన తెలంగాణ/ హైదరాబాద్: ఉపరితల ఆవర్తనంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వారం రోజుల క్రితం వాతావరణ విభాగం ప్రకటించడంతో రైతుల ఆశలు చిగురించాయి. పంటలు దక్కుతాయని ఆనందపడ్డారు. అయితే వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో రెండు రోజుల పాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. మిగతా జిల్లాల్లో వర్షాలు మొహం చాటేశాయి. ఐదు రోజుల క్రితం అల్పపీడనంతో వర్షాలు వస్తాయని చెప్పినప్పటికీ చిరు జల్లులే కురిశాయి. శనివారం నాడు ఉత్తర తెలంగాణ జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వాతావరణ విభాగం ప్రకటించిన విధంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురవకపోవడం రైతాంగాన్ని నిరాశకు గురి చేసింది. నిజామాబాద్ జిల్లా రెంజల్, వరంగల్ జిల్లా నల్లబెల్లిలో ఈ సీజన్లో గరిష్ఠంగా 19 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అదే విధంగా నవీపేట, వెంకటాపూర్‌లో 18 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వచ్చే నాలుగైదు రోజుల్లో రాష్ట్రంలోని పలు

తరువాయి 6లో



జల మంజీరం

తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దులోని మంజీరా నది వరద నీటితో నిండుగా పారుతోంది.



లక్నవర్షం

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నిండి మత్తడిపడిన భూపాలపల్లి జిల్లా లక్నవరం సరస్సు

3లో

చుక్కల లోకం దిగిరండి

- స్టార్ హోటళ్లలో బసలు మానుకోండి
- ప్రభుత్వరంగ సంస్థల వాహనాలను సొంతానికి వినియోగించవద్దు
- మంత్రివర్గ సభ్యులకు ప్రధాని ఆదేశం

10లో



మసాజ్ సెంటర్లపై దాడులు

- 13 కేంద్రాల్లో థాయిలాండ్ తరహా సెక్స్ వ్యాపారం,
- 30 మంది యువతులు, 25 మంది యువకుల అరెస్టు



మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో: మాదాపూర్‌లో మసాజ్ సెంటర్ల మాటున వ్యభిచారం జోరుగా సాగుతోంది. సైబరాబాద్ పోలీసులు ఆదివారం అర్ధరాత్రి 13 మసాజ్ సెంటర్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 30 మంది యువతులు, 25 మంది యువకులు పట్టుబడ్డారు. వీరిలో 14 మంది థాయ్‌లాండ్‌కు చెందిన యువతులు ఉన్నారు. 12 మసాజ్ సెంటర్లను సీజ్ చేశారు. పట్టుబడిన వారిలో ప్రముఖుల పిల్లలు ఉన్నట్లు సమాచారం. గత కొంతకాలంగా మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన స్పాలు, మసాజ్ సెంటర్లలో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం జరుగుతోంది. ఏకంగా థాయ్‌లాండ్ వ్యభిచారాన్నే మరిపించే విధంగా నడుస్తున్నది. ఈ అసాంఘిక కార్యకలాపాల వ్యవహారం సైబరాబాద్ పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య దృష్టికి రావడంతో సీరియస్ అయిన ఆయన స్పెషల్ టీమ్ పోలీసులను నియమించి ఏకకాలంలో 13 మసాజ్ సెంటర్లపై దాడులు చేసి 14 మంది థాయ్‌లాండ్ యువతులను, 11 మంది ఈశాన్య రాష్ట్రాలకు చెందిన యువతులు, ఐదుగురు ఆంధ్రాకు చెందిన వారితో పాటు స్పా సెంటర్ల నిర్వాహకులను, విటులను అరెస్టు చేశారు. విటుల్లో

తరువాయి 6లో

గురుకుల వైభవం

- యాదాద్రి భువనగిరి జిల్లా సర్వేల్ గురుకులాన్ని మోడల్ రెసిడెన్షియల్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రి కడియం



మన తెలంగాణ/ సంస్థాన్‌నారాయణపురం: మోడల్ రెసిడెన్షియల్‌గా సర్వేల్ గురుకుల పాఠశాలను తీర్చిదిద్దుతామని ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం సర్వేల్ గురుకుల పాఠశాలలో విద్యుత్ శాఖమంత్రి జి. జగదీశ్‌రెడ్డితో కలిసి రూ.18.61 కోట్లతో నిర్మించ తలపెట్టిన భవన నిర్మాణ సముదాయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కడియం మాట్లాడుతూ సర్వేల్ గురుకుల పాఠశాల అన్ని విశ్వవిద్యాలయాలకు స్ఫూర్తి అని తెలిపారు. 1971లో మద్ది నారాయణరెడ్డి 44 ఎకరాల భూమిని దానం చేయడం వల్ల అప్పటి ముఖ్యమంత్రి పివి నర్సింహారావు మొట్టమొదటగా ఈ గురుకుల పాఠశాలను నెలకొల్పారని, గుర్తుచేశారు. ఈ పాఠశాలలో చదివిన వారు ఎంతో మంది ఉన్నత శిఖరాలకు ఎదిగి ఇతర దేశాలలో గూడా సర్వేల్ పేరును మారు మోగిస్తున్నారని తెలిపారు. గతంలో ఈ పాఠశాలకు వచ్చినప్పుడు దీని పరిస్థితి చూసి చాలా బాధేసిందని, పేరు ప్రఖ్యాతలు గాంచిన ఈ పాఠశాలను దేశంలోనే ఆదర్శంగా నిలపాలనే ఉద్దేశంతో ఇన్ని కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి కెసిఆర్ తపన అని ఆయన చెప్పారు. ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశంతో సిఎం కెజి టు పిజి ఉచిత విద్యకు రూపకల్పన చేశారన్నారు. ప్రతి విద్యార్థిపైన ప్రభుత్వం రూ.60 వేలు ఖర్చు పెడుతుందని తెలిపారు. తెలంగాణ రాకముందు రాష్ట్రంలో 315 గురుకుల విద్యాలయాలు ఉండేవని, రాష్ట్రం ఏర్పడ్డాక అదనంగా 520 గురుకులాలను ఏర్పాటు చేశామని, ఇప్పుడు మొత్తం 840 గురుకులాలు పని చేస్తున్నాయన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తెలంగాణకు

తరువాయి 6లో

వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో జెఇఇ పరీక్షలు

10

- జాయింట్ అడ్మిషన్ బోర్డు నిర్ణయం

ధావన్ విధ్వంసం

12

- భారత్ విజయం



రైజ్‌మిల్లులు అవుతాయి

- రైస్ మిల్లులకు పూర్వవైభవం వస్తుంది
- మిర్యాలగూడ మండలం అవంతీపురం ఆర్యవైశ్య సభలో మంత్రి జగదీశ్‌రెడ్డి




మన తెలంగాణ/ మిర్యాలగూడ రూరల్: రైస్ మిల్లులు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటాయని, దీంతో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పబడి నిరుద్యోగులైన యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర విద్యుత్, ఎస్‌సి అభివృద్ధి శాఖమంత్రి జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండల పరిధిలోని అవంతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన ఆర్య వైశ్య వనభోజన మహోత్సవానికి జగదీశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నల్లగొండ జిల్లాలో వ్యవసాయం దెబ్బతినడం వల్ల దాని ప్రభావం వ్యాపారంపై పడుతుందన్నారు. కోటి ఎకరాలకు నీరిచ్చే బృహత్తర కార్యక్రమాన్ని సిఎం కెసిఆర్ త్వరలోనే పూర్తి చేస్తారని చెప్పారు. అప్పుడు వ్యవసాయరంగం మూడు పువ్వులు, ఆరుకాయలుగా విరాజిల్లుతుందని, రైస్ మిల్లులు పూర్వవైభవాన్ని సంతరించుకుంటాయన్నారు. దీంతో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పబడి నిరుద్యోగులకు ఉద్యోగ

తరువాయి 6లో

కుంచెపోటు





హెల్త్‌రన్ ఘనాఘన్

మన తెలంగాణ/ సిటీబ్యూరో: ఎయిర్‌టెల్, రన్నర్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్ ఆదివారం ఉదయం నెక్లెస్ రోడ్డులో సందడి సాగింది. ఉదయం 5 గంటలకు నగర పోలీసు కమిషనర్ మహేందర్‌రెడ్డి ఫుల్ మారథాన్ (42 కి. మీ)ను ప్రారంభించగా, ఆరు గంటలకు హాఫ్ మారథాన్ (21కి.మీ) ను బల్దియా కమిషనర్ జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేలాది మంది ఔత్సాహికులు పీపుల్స్ ప్లాజా నుంచి ఖైరతాబాద్ ఫ్లై ఓవర్, రాజ్‌భవన్ రోడ్, రాజీవ్ సర్కిల్, పంజాగుట్ట, బంజారాహిల్స్,

తరువాయి 6లో

కాల్పించుకోలేదు

- ఎవరు కాల్చారో పోలీసులే తేల్చాలి
- రూ.40 కోట్ల అప్పుల్లో ఉన్నా
- కిరాయి కాల్పులకు రూ.50 లక్షలు ఎలా ఇవ్వగలను : ఓ న్యూస్ చానెల్‌తో విక్రమ్‌గౌడ్

మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో: 'నేను కావాలని కాల్పించుకోలేదు.. నాపై కాల్పులు జరిపింది ఎవరో పోలీసులే తేల్చాలి' అని మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన ఓ న్యూస్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కాల్పులు జరిపించుకునే దౌర్భాగ్యం తనకు పట్టలేదని, అప్పుల్లో ఉన్న తాను రూ.50 లక్షలు ఇచ్చి ఎలా కాల్పులు జరిపించుకుంటానని

తరువాయి 6లో

లారీ లోడు చోరీ

- రూ.4 కోట్ల సిగరెట్ల కంటైనర్ అపహరణ
- డ్రైవర్‌ను కొట్టి వాహనంతో పరారీ, కొంత దూరం వెళ్లిన తరువాత సరుకు ఖాళీ చేసి తీసుకుపోయిన దుండగులు
- హైదరాబాద్ ఒఆర్‌ఆర్ సమీపంలో ఘటన



మన తెలంగాణ/ హయత్‌నగర్ : డ్రైవర్‌ను కొట్టి సిగరెట్ లోడుతో ఉన్న కంటైనర్‌ను ఎత్తుకెళ్ళిన ఘటన రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి నగరంలోని ముషీరాబాద్‌లో ఉన్న హైదరాబాద్ డెక్కన్ సిగరెట్ ఫ్యాక్టరీ నుండి రెండు కంటైనర్లు సిగరెట్ లోడుతో ఒకటి మేడ్చల్ జిల్లా ఐడిపిఎల్‌కు, మరొకటి ఆంధ్రపదేశ్‌లోని తిరుపతికి బయలు దేరాయి. తిరుపతికి బయలు దేరిన కంటైనర్‌ను (కెఎ 02 ఎడి 1220) 30 మంది దుండగులు వెంబడించారు. ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలో ఉన్న పెద్ద అంబర్ పెట్‌కు దగ్గర్లో కంటైనర్ ఆపి డ్రైవర్ అఖిలేష్ యాదవ్‌ను కొట్టి ఆ వాహనాన్ని యాదాద్రి జిల్లా మల్కాపురం గ్రామంలో ఓ నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్ళి

తరువాయి 6లో

విడాకులపై విదేశీ కోర్టుల తీర్పు చెల్లదు



ముంబయి : భారతీయ స్థానికత గల దంపతుల వైవాహిక వ్యాజ్యాల విచారణాధికారం విదేశీ న్యాయస్థానాలకు లేదని బొంబాయి హైకోర్టు తీర్పు చెప్పింది. భారతీయ స్థానికత ఉండి, హిందూ వివాహ చట్టం పరిధిలోకి వచ్చే దంపతులు విదేశాలలో ఉన్నప్పటికీ విడాకుల కోసం అక్కడి కోర్టులను ఆశ్రయించడానికి వీల్లేదు. హిందూ వివాహ చట్టం పరిధిలోకి వచ్చే విధంగా వివాహాలు జరిగి ఉంటే విడాకుల అంశం విదేశీ న్యాయస్థానాల పరిధిలోకి రాదు. ఈ అంశాన్ని న్యాయమూర్తులు ఎఎస్ ఓకా, అనూజా ప్రభుదేశాయ్‌తో కూడిన ధర్మాసనం ఓ కేసు విచారణ సందర్భంగా స్పష్టం చేసింది. దుబాయిలో నివసిస్తున్న ఓ వ్యక్తి విడాకుల అభ్యర్థనకు స్పందించి దుబాయి కోర్టు విడాకులు మంజూరు చేయడం చెల్లనేరదని బొంబాయి హైకోర్టు తమ తీర్పులో తెలిపింది. విడాకులు పొందిన వ్యక్తి భార్య వేసిన పిటిషన్‌పై విచారణ తరువాత న్యాయస్థానం రూలింగ్ వెలువడింది. దుబాయిలో ఉంటున్న భర్త విడాకులు తీసుకున్నాడని, తనకు, తన ఇద్దరు పిల్లలకు ఆయన నుంచి జీవనభృతి ఇప్పించాలని ఆమె తొలుత ముంబైలోని కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే దుబాయి కోర్టు విడాకులు మంజూరు చేసి ఉన్నందున , వేరే దేశంలో వ్యాజ్యం సాగినందున తాము ఏమీ చేయలేమని ఆ బాధితురాలి అభ్యర్థనను కుటుంబ న్యాయస్థానం కొట్టివేసింది.

అంచనా మించిన 'మల్లన్న' టెండర్లు

మన తెలంగాణ/హైదరాబాద్: మల్లన్నసాగర్ ప్రాజెక్టు టెండర్లు అంచనా వ్యయాన్ని మించిపోయాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే కాంట్రాక్టు ఏజెన్సీలు అధిక ధరకు పనులను దక్కించుకున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లు, మధ్యలో నీటి ప్రవాహానికి వీలుగా కన్వేయర్ సిస్టం నిర్మాణానికి ఇటీవలే టెండర్లు పిలిచారు. ఇందులో 50 టిఎంసిల అధిక సామర్థ్యంతో నిర్మించే మల్లన్నసాగర్‌ను నాలుగు రీచ్‌లుగా విడదీసి, టెండర్లు పిలిచారు. శనివారం ప్రైస్‌బిడ్లు తెరవగా మల్లన్నసాగర్‌లో టెండర్ల ఎక్సెస్ కారణంగా రూ.236 కోట్ల భారం పడింది. ఇందులో రూ.1822 కోట్ల అంచనాతో రీచ్ 1కు టెండర్లు పిలవగా, 3.9 శాతం అధికంగా టెండర్ వేసి ఆప్కాన్ అనే సంస్థ ఎల్1గా నిలిచింది. రీచ్ 2లో రూ.1499 కోట్ల అంచనాతో టెండర్ పిలిస్తే ఎల్ అండ్ టి కంపెనీ 3.15 శాతం ఎక్సెస్‌తో ఎల్1గా నిలిచింది. రూ.2,046 కోట్ల అంచనాతో మూడో రీచ్‌కు టెండర్లు పిలిస్తే, 3.5 శాతం అధిక ధరకు రాఘవ కన్స్‌ట్రక్షన్ దక్కించుకుంది. రూ.1436 కోట్ల అంచనాతో నాలుగో రీచ్‌కు టెండర్లు పిలిస్తే 3.2 శాతం అధిక ధరకు హెచ్ఇఎస్ ఇన్‌ఫ్రా కోట్ చేసి, ఎల్1గా నిలిచింది. నాలుగు రీచ్‌లలో అధిక ధరలు కోట్ చేయడం మూలంగారూ.236 కోట్లు అదనపు భారం పడనుంది. ఇదేవిధంగా కొండపోచమ్మ సాగర్‌ను రెండు రీచ్‌లుగా విడదీసి టెండర్లు పిలిచారు. మొదటి రీచ్‌ను రూ.900 కోట్ల అంచనాతో టెండర్ పిలిస్తే 1.7 శాతం లెస్‌కు కోట్ చేసి కెఎన్ఆర్ కన్స్‌ట్రక్షన్స్ సంస్థ దక్కించుకుంది. రెండో రీచ్‌ను రూ.709 కోట్ల అంచనాతో టెండర్లు ఆహ్వానిస్తే 1.8 శాతం లెస్‌కు హెచ్ఇఎస్ దక్కించుకుంది. ఇదేవిధంగా మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు నీటిని తరలించేందుకు వీలుగా మెయిన్ కెనాల్, సర్జ్‌పూల్, పంప్‌హౌజ్, ఇతరత్రా కన్వేయర్ సిస్టం నిర్మాణం కోసం ప్యాకేజి 13, ప్యాకేజీ 14లతో టెండర్లు పిలిచారు. రూ.566.11 కోట్ల అంచనాతో ప్యాకేజి 13 టెండర్లు పిలవగా, 1.25 శాతం లెస్‌తో సత్య ఇన్‌ఫ్రా ఎల్1 గా నిలిచింది.

100 ఏళ్ల చరిత్ర

రెడ్డి హాస్టల్‌కు స్థలం కేటాయించడం హర్షణీయం : హోంమంత్రి నాయిని



మనతెలంగాణ/హైదరాబాద్/ రాజేంద్ర నగర్ : నగరంలోని రాజా బహదూర్ వెంకట్ రాంరెడ్డి హాస్టల్‌లో ఉండి చదువుకున్న విద్యార్థులు దేశ ప్రధానమంత్రి స్థాయికి ఎదిగారని,ఆ ఖ్యాతిని మరింత పెంచే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నర్సింహా రెడ్డి స్పష్టం చేశారు. రెడ్డిల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని వర్గాలకు సముచితస్థానం తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తుందనడానికి రాజేంద్రనగర్‌లో రెడ్డి హాస్టల్‌కు ముఖ్యమంత్రి స్థలం కేటాయించడం హర్షనీయమని ఆయన వెల్లడించారు. ఈ నెల 22వ తేదీన రాజేంద్రనగర్ బుద్వేల్ సమీపంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్న రెడ్డి హస్టల్‌కు కేటాయించిన స్థలాన్ని హోంమంత్రి నాయిని , రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి , ఎంపిలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, శాసన సభ్యులు చింతల రాంచంద్ర రెడ్డి, తీగల కృష్ణరెడ్డి తోపాటు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావులతో కలసి సందర్శించారు. 22వ తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా రెడ్డి హాస్టల్ నిర్మాణానికి చేయనున్న శంకుస్థాపన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ రాజా బహదూర్ వెంకట్ రాంరెడ్డి హాస్టల్ ప్రారంభించి 100 ఏళ్లు పూర్తి అయిందని గుర్తు చేశారు. హాస్టల్ ప్రారంభించిన నాటి నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులే కాకుండా ఇతర కులాలకు చెందిన విద్యార్థులకు కూడా 30 శాతం అవకాశాలు కల్పించారని చెప్పారు. దేశానికి ప్రధానమంత్రి అయిన పివి. నర్సింహారావు కూడా రెడ్డి హాస్టల్‌లో ఉండి చదువుకున్న వ్యక్తే అన్నారు. ఎందరో అత్యున్నత స్థాయిలో ఉన్న అధికారులు, జడ్జిలు, రాజకీయ నాయకులు రెడ్డి హాస్టల్ విద్యార్థులు కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇంతటి ఖ్యాతి ఉన్న రెడ్డి హాస్టల్ భవనానికి కొత్తగా మరో 10 ఎకరాల స్థలాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని, హాస్టల్ నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా మంత్రి పట్నం మహేందర్ రెడ్డి కెసిఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. రెడ్డిల సంక్షేమానికి హాస్టల్ భవానానికి రెడ్డి సామాజిక వర్గానికి సహృదయంతో విలువైన, విశాల స్థలం కేటాయించారని తెలిపారు. 22న ముఖ్యమంత్రి చేతుల మీదుగా జరిగే రెడ్డిహాస్టల్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

నిజాం వ్యతిరేక పోరాట స్థలాలకు బిజెపి



మన తెలంగాణ/హైదరాబాద్ : నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం జరిపి చరిత్రలో నిలిచిపోయిన గ్రామాలు, ప్రాంతాలను సందర్శించాలని బిజెపి నిర్ణయించింది. సెప్టెంబర్ 17న విమోచనాదినాన్ని ఘనంగా నిర్వహించాలన్న నిర్ణయంలో భాగంగా పార్టీ నేతలంతా రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించనున్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, జాతీయ ప్రధాన కార్యదర్శి పి. మురళీధర్‌రావు, బిజెఎల్‌పి నేత జి. కిషన్‌రెడ్డి, జాతీయ నాయకులు ఎన్. ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శులు జి. ప్రేమేందర్‌రెడ్డి, చింతా సాంబమూర్తి తదితరులు హాజరయ్యారు. ఇటీవల రాష్ట్ర పర్యటన సందర్భంగా గుండ్రాంపల్లిని అమిత్‌షా సందర్శించారు. ఆ తరహాలోనే నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి చరిత్రలో నిలిచిపోయిన గ్రామాలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్సరాజ్ అహీర్, కేంద్ర మంత్రి దత్తాత్రేయ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు రాంమాధవ్, మురళీధర్ రావులతో పాటు పలువురు నేతలు సెప్టెంబర్ 1 నుంచి 9 వ తేదీ వరకు సందర్శిస్తారని, నాటి పోరాటాల స్మరించుకోవడంతో పాటు అమరులకు నివాళులర్పిం చను న్నారని పార్టీ ప్రధాన కార్యదర్శి జి. ప్రేమేందర్ రెడ్డి సమావేశానంతరం మీడియాకు చెప్పారు. ఎంఐఎంకు భయపడే ముఖ్యమంత్రి కెసిఆర్ విమోచనా దినాన్ని అధికారికంగా నిర్వహించేందుకు జంకుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి అధికారంలోకి రాగానే విమోచనా దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. మజ్లిస్ మెప్పు కోసం వెంపర్లాడుతున్న కెసిఆర్ తెలంగాణ ప్రజల మనోభావాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటి స్వాతంత్ర్యపోరాట యోధులను గుర్తించడంలో టిఆర్ఎస్ ప్రభుత్వం వెనక్కు తగ్గడం శోచనీయమన్నారు.ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకునేంత వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని, లేకపోతే తాము అధికారంలోకి రాగానే అధికారికంగా నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో బహిరంగ నిర్వహిస్తామని, ఈ సభకు కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ ను ఆహ్వానించామన్నారు.

105 ఏళ్ల కిందటే రుతు విరామ సెలవు

తిరువనంతపురం : కేరళలో శతాబ్ధం క్రితమే బాలికలకు విద్యాసంస్థలలో రుతుస్రావ సెలవు ఉండేది. పీరియడ్ సమయంలో బాలికలు పాఠశాలలకు రావల్సిన అవసరం లేకుండా తగు సౌకర్యం కల్పించారు. 105 సంవత్సరాల నాటి ఈ బాలికా న్యాయం గురించి చారిత్రక ఆధారాలు లభించాయి. ఈ అంశాలను ప్రముఖ చరిత్రకారులు పి.భాస్కరనున్ని రాసిన 19వ శతాబ్ధంలో కేరళ అనే పుస్తకంలో పొందుపర్చా రు. యుక్తవయస్సుకు వచ్చిన బాలికలకు పీరియడ్ లీవ్ ఇవ్వాలనే అంశంపై చర్చ జరుగుతున్న దశలో కేరళలో అప్పటి ఈ సెలవు కోణం వెలుగులోకి వచ్చింది. అప్పట్లో కొచ్చిన్ రాజ్యంగా వెలిసిన నేటి ఎర్నాకులం జిల్లాలోని త్రిపునితురా బాలికల పాఠశాలలో చదివే విద్యార్థినులకు 105 సంవత్సరాల క్రితం 1912వ సంవత్సరంలోనే ఈ సౌలభ్యం ఉండేదని తేల్చారు.


రామ మందిరం నిర్మాణానికి చట్టం

● అప్పగిస్తే రెండు నెలల్లో పూర్తి చేస్తాం ● భజరంగ్‌దళ్ శక్తి సమ్మేళన్‌లో విహెచ్‌పి ప్రధాన కార్యదర్శి తొగాడియా



మన తెలంగాణ/హైదరాబాద్ : గుజరాత్‌లో సోమ్‌నాథ్ మందిర నిర్మాణం కోసం నాటి హోం మంత్రి సర్ధార్ వల్లభభాయ్ పటేల్ తెచ్చిన చట్టం మాదిరిగా ఆయోధ్యలో రామ మందిర నిర్మాణానికి పార్లమెంట్‌లో చట్టం తీసుకు రావాలని విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి)అంతర్జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ భాయ్ తొగాడియా డిమాండ్ చేశారు. 100 కోట్ల మంది హిందూ ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ అంశం కోర్టులో తేలేది కాదని, ఇప్పటికే దీనిపై 25 సంవత్సరాలుగా విచారణ సాగుతోందని, మరో 50 సంవత్సరాలైనా కేసు ముగియదన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన భజరంగ్‌దళ్ శక్తి సమ్మేళన్ సభలో ప్రవీణ్ తొగాడియా ప్రసంగించారు. రామ మందిర నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, నిర్మాణ పనులను ప్రారంభించిన రెండు మాసాల్లో భవ్య మందిరాన్ని నిర్మిస్తామన్నారు. తాము చేస్తున్న పోరాటం మందిరం కోసం రాముడు జన్మించిన పవిత్ర స్థలం కోసమని ఆయన స్పష్టత ఇచ్చారు.గోరక్ష విషయంలో చేతులుడి చూస్తున్న ప్రభుత్వం భజరంగ్‌దళ్ కార్యకర్తలను, హిందువులను కించ పరిచే విధంగా మాట్లాడటం పట్ల ఆయన మండి పడ్డారు. చట్టాన్ని అమలు చేయడంలో పాలకులు, అధికారులు విఫలమవడం వల్లే హిందువులు నడుం కట్టి అమలు చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. కొంత మంది నేతలు, పార్టీలు హిందువులను తిడితేనే గుర్తింపు వస్తుందన్న భావనతో వ్యవహరిస్తున్నారన్నారు. కశ్మీర్‌లో సైన్యం, పోలీసులకు స్వేచ్ఛ ఇవ్వాలని, రాళ్ళ దాడికి పాల్పడే ఉగ్రవాదులను అణచి వేసేందుకు బాంబులు వేసేందుకు, కాల్పులు జరిపేందుకు అనుమతివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కశ్మీర్‌లోని హిందువులకు రక్షణ కల్పించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని, వారికి అన్ని విధాల సహకరించాలన్నారు. రహదారులు, ఎయిర్‌పోర్టులు లాంటివి దేశంలో శరవేగంగా విస్తరిస్తున్నప్పటికీ దేశంలోని 19 కోట్ల యువత పస్తులుంటున్నారని, వారందరికీ ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం హిందూ ఫైనాన్సియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నేటి యువతరం అనారోగ్యానికి గురవుతున్నారని, 40 సంవత్సరాలకే ఇబ్బందులకు గురవుతున్నారని, వీటి నుంచి విముక్తి కోసం పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమివ్వాలని, నాణ్యమైన విద్యను అందించాలని, పౌష్టికాహారాన్ని సమకూర్చాలన్నారు. భజరంగ్ దళ్ జాతీయ కన్వీనర్ మనోజ్‌వర్మ మాట్లాడుతూ, ధర్మ పరిరక్షణ గో సంరక్షణ తదితర అంశాలలో ఇబ్బందులు ఎదురవుతున్నా ధర్మం కోసం పని చేయాలని పిలుపు నిచ్చారు. ఇరాన్, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాలు భారతీయ సంస్కృతిని విస్మరించడం వల్లే ఉగ్రవాదంతో తల్లడిల్లుతున్నాయని, సింగపూర్, మలేషియా తదితర దేశాలు హిందూ ధర్మాన్ని ఆచరించడం వల్లే సుభిక్షంగా ఉన్నాయన్నారు.


శశిధర్ ఫిర్యాదు దుర్మార్గపు చర్య



మన తెలంగాణ/హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకునేం దుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ నేతలపై ప్రజలే తిరుగబడాలని టిఆర్ఎస్ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మా ణ పనులపై కాంగ్రెస్ నేత మర్రి శశిధర్ రెడ్డి కేంద్ర పర్యావరణ కార్యదర్శి అజయ్ నారాయణ్‌కు ఫిర్యాదు చేయడం దుర్మార్గ చర్య అని వ్యాఖ్యానించారు. టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణాలపై పొరుగు రాష్ట్రాల నుంచి రావాల్సిన ఫిర్యాదులు, అభ్యంతరాలు మన రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతల నుంచి రావడం అన్యాయమన్నారు. కుట్ర పూరిత మనస్తత్వంతో మర్రి శశిధర్ రెడ్డి ఫిర్యాదు చేశారని, ప్రజలు లేని చోట ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు మర్రి తన ఫిర్యాదులో పొందపర్చినట్లు వివరించారు. ఏం తెలియకుండానే మర్రి శశిధర్ రెడ్డి అజ్ఞానంతో మాట్లాడుతున్నారన్నారు. ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ నేతలు కోర్టులలో పిటిషన్లు వేసి అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ తాటాకు చప్పుళ్లకు తాము బెదరమని, ఉక్కు సంకల్పంతో ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. కోటి ఎకరాలకు నీరు అందించే లక్ష్యంలో భాగంగా ప్రాజెక్టులకు రీ డిజైనింగ్ జరుగుతోందన్నారు. 2018 నాటికి ప్రాజెక్ట్ నిర్మాణ పనులను 80 శాతం వరకు పూర్తి చేయాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఎడారిలాగే ఉండాలనే దుర్బుద్ధితోనే కాంగ్రెస్ ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.

ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా

కాళేశ్వరంపై రైతు ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్



మన తెలంగాణ/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆగస్టు 22 (రేపటి) నుంచి తలపెట్టిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా వేయాలని తెలంగాణ రైతు ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. పర్యావరణ ప్రభావ మదింపు నివేదిక స్థానికులకు అందుబాటులో లేకపోవడం, స్థానిక బాషలో అందుబాటులో పెట్టని కారణంగా, ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని రైతు జెఎసి నేతలు పశ్య పద్మ, భూతం వీరయ్య, విజయపాల్‌రెడ్డి, పి.జంగారెడ్డి, రాజయ్య డిమాండ్ చేశారు. రైతు జెఎసి నేతలు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ పర్యావరణ ప్రభావ మధింపు నివేదికలను స్పష్టంగా అందుబాటులో పెట్టలేదని, ఆ నివేదికలు చదివితేనే ప్రజలు తమకు జరిగే లాభనష్టాలపై ఓ అభిప్రాయానికి వస్తాయరన్నారు. 15 ప్రాంతాల్లో 22వ తేదీ నుంచి నిర్వహిస్తున్నా, విధివిధానాలు సరిగ్గా పాటించలేదని విమర్శించారు. పెద్ద ప్రాజెక్టు కాబట్టి, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కూడా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. విస్తృతస్థాయిలో ప్రచారం చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వం విపక్ష నేతలపై తీవ్ర నిర్బంధం విధిస్తున్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ తూతూ మంత్రంగా చేసే అవకాశం ఉందని అనుమానం వెలిబుచ్చారు. ఇప్పటికే ప్రాజెక్టు నిర్వాసితుల మీద లాఠీ చార్జి, గ్రామాల్లో నిర్బంధాలు, స్వేచ్ఛగా సమావేశాలు ఏర్పాటు చేసి, చర్చించే అవకాశం విపక్షాలుకు కనపించ డం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా, పర్యావరణ అనుమతుల ప్రక్రియ మొదలు కాకముందే ప్రాజెక్టు పనులు మొదలు పెట్టడం సరికాదని అభిప్రాయపడ్డారు. 6,896 మంది కుటుంబాలు కాళేశ్వరం ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితుల వుతుంటే, ఆయా కుటుంబాల వివరాలు, వారికి ఎటువంటి సహాయం, పునరావాసం కల్పించారో బయటపెట్టాలని పశ్య పద్మ డిమాండ్ చేశారు.

పంటల బీమా పరిహారంపై మీనమేషాలు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఫసల్ బీమానే కాదు... అంతకు ముందు అమలు చేసిన పంటల బీమాల పరిహారం సొమ్ము రైతులకు అందడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఒక్క రూపాయి కూడా బీమా ద్వారా లాభం చేకూరులేదంటే బీమా కంపెనీల పట్ల ప్రభుత్వాల వైఖరి ఎలా ఉందో అర్థమౌతోంది. రైతుల ఆదాయాన్ని ఐదేళ్లలో రెట్టింపు చేస్తామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం వారికి ఇవ్వాల్సిన బీమా పరిహారం విషయంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది. ఒత్తిడి తీసుకురావాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. పంట నష్టపోయిన రైతులకు మూడేళ్లుగా పరిహారం అందడం లేదు. 2014–15కు సంబంధించి రూ. 63.52 కోట్లు 69,335 మంది రైతులకు పరిహారంగా చెల్లించాల్సి ఉంది. అవి ఇప్పటికి విడుదలకు నోచుకోలేదు. 2015–16లో 8 లక్షల మంది పంట బీమా చేసుకున్నారు. ఇందుల్లో 3.31 లక్షలమంది రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. అయితే 2015 వానకాలం(ఖరీఫ్)లో సాగైన పంటల విస్తీర్ణం కన్నా అధిక విస్తీర్ణానికి బీమా చేయించారనే కారణాన్ని చూపుతూ పరిహారం ఇవ్వడానికి జాతీయ వ్యవసాయ బీమా కంపెనీ (ఎన్ఎఐసి)నిరాకరించింది. ఈ విషయానిA్న కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లింది. సాగు విస్తీర్ణానికి, బీమా విస్తీర్ణానికి తేడాలు ఉన్నాయనే కారణంతో 3.31 లక్షల మంది రైతుల అందాల్సిన రూ. 395.64 కోట్లు ఎన్ఎఐసి నిలిపివేసింది. ఈ విషయమై రాష్ట్ర వ్యవసాయశాఖ లేఖలు రాసినప్పటికీ అవి అనుకున్న దిశగా ఫలితాలు ఇవ్వడం లేదు. పంట రుణాలు తీసుకున్న సమయంలో నమోదు చేసిన పంటల వివరాలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు పొంతన లేకపోవడంతో సమస్య చోటుచేసుకుంది. ఇక తక్కువ ప్రీమియం, నష్టం జరిగిన వెంటనే క్లయిమ్ చేసుకునే వెసులుబాటు అంటూ గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకం లో కూడా రైతులకు సరైన సమయంలో పరిహారం అందడం లేదులేదు.

దళారీకి చెక్... రైతుకే మద్దతు ధర

మన తెలంగాణ/హైదరాబాద్ : దళారీ వ్యవస్థకు చెక్ పెట్టి మద్దతు ధరను నిజమైన రైతుకే అందించేందుకు మార్కెటింగ్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకు ఇటీవల వ్యవసాయ శాఖ చేపట్టిన రైతు సమగ్ర సర్వే వివరాలను వినియోగించుకోవాలని మార్కెటింగ్ శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ప్రభుత్వం మద్దతు ధరకు పంట ఉత్పత్తుల కొనుగోళ్లు చేపట్టిన ప్రతిసారీ నిజమైన రైతులకు లబ్దిచేకూరుతుందా అంటే లేదనే చెప్పాలి. దళారులు ముందుగానే పంట ఉత్పత్తులను రైతుల దగ్గర కొనుగోలు చేసి, ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరకు అమ్ముకుని వ్యాపారులు లబ్దిపొందేవారు. దీంతో రైతు కోసం ఉద్దేశించిన మద్దతు ధర కూడా దళారులకే చేరి, ఇక్కడ కూడా అన్నదాత నష్టపోతున్నాడు. ఈ ఏడాదిమన తెలంగాణలో ఇప్పటి వరకు 43.91 లక్షల ఎకరాలలో సాగైనట్లు వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. అధిక విస్తీర్ణంలో సాగవుతున్న పత్తి పంట కొనుగోలులో రైతు సమగ్ర సర్వేలో వచ్చిన వివరాల ఆధారంగా అందులోని రైతుకు మద్దతు ధర కల్పించాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. ఈ సర్వేలో ఇప్పటికే రైతులు తమ ఆధార్, ఖాతా వివరాలు కూడా సమర్పించారు. వీటి ఆధారంగా పంట కొనుగోలు చేసిన వెంటనే సొమ్ము రైతు ఖాతాలో వేయనున్నారు. పత్తి దిగుబడి అధికంగా వస్తుందని మార్కెటింగ్ శాఖ అంచనా వేస్తోంది. మార్కెట్‌లకు వచ్చే పత్తి పంటకు మద్దతు ధర కల్పించే విషయమై వ్యవసాయ శాఖ ఇచ్చిన పత్తి రైతుల వివరాలను మార్కెటింగ్ శాఖ డాటాబేస్‌లో చేర్చనున్నారు. దీని ఆధారంగా మద్దతు ధరను అమలు చేస్తారు.



కెసిఆర్ రైతుల పాలిట దేవుడు : పోచారం

మన తెలంగాణ/హైదరాబాద్: రైతుల ఆదాయాన్ని పెంచి, ఆత్మహత్యల నివారణకు, వ్యవసాయ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన సిఎం కెసిఆర్ పనితీరుకు వ్యవసాయ నాయకత్వఅవార్డు రావడమే నిదర్శనమని మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కెసిఆర్‌కు అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. కెసిఆర్ రైతుల పాలిట దేవుడని కొనియాడారు. రాబోయే బడ్జెట్ సమావేశంలో ప్రత్యేకంగా వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు. టిఆర్ఎస్ పనితీరు చూసి కాంగ్రెస్, ప్రతిపక్షాల భయపడుతున్నాయని, తమ అడ్రస్ గల్లంతు అవుతుందనే ఉద్దేశంతో అనేక అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో ఎంఎల్‌సి ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి పోచారం మాట్లాడారు. సిఎం కెసిఆర్‌కు అగ్రికల్చర్ లీడర్ షిప్ అవార్డు రావడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో యావత్ దేశానికి వ్యవసాయ రంగంలో తెలంగాణనే ఆదర్శంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమైక్యరాష్ట్రంలో ఏ సిఎంకు దక్కని గౌరవం కేవలం 36 నెలల పాలనలోనే కెసిఆర్‌కు అవార్డు దక్కడం తెలంగాణ ప్రజలకు గర్వకారణమన్నారు.

దత్తాత్రేయకు కార్మికుల సన్మానం

మన తెలంగాణ/హైదరాబాద్ : సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఐక్య పోరాట సమితి నాయకులు కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయను ఆదివారం హైదరాబాద్‌లో సన్మానించారు. సింగరేణిలో 15వేల మంది కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం పెంచినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, బోనస్, జాతీయ సెలవులు, పనిదినాలు, పని గంటలు అమలు పర్చాలని, మహిళా కార్మికులకు ప్రసూతి సెలవులు ఇప్పించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. దత్తాత్రేయను కలిసిన వారిలో ఐక్య పోరాట సమితి నాయకులు పులి రాజారెడ్డి, పెద్దపల్లి గట్టయ్య, సత్యనారాయణ, శంకర్, యాకుబ్ అలీ తదితరులు ఉన్నారు.

రాంకీ భూములపై విచారణ : సిపిఎం

మన తెలంగాణ/ హైదరాబాద్ : నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఎలిమినేడు, గుండంపల్లి, సుంకెనపల్లిలో రాంకీ సంస్థ కొనుగోలు చేసిన భూముల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాంకీ సంస్థ బినామీ రిజిస్ట్రేషన్లు, చట్ట ఉల్లంఘనలపై కేసులు నమోదు చేసి యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు తమ్మినేని సిఎం కెసిఆర్‌కు శనివారం ఒక లేఖ రాశారు. సంస్థ భూముల కొనుగోళ్ళు, రిజిస్ట్రేషన్లలో తీవ్ర అవకతవకలకు పాల్పడిందని, పట్టాదారులతో సంబంధం లేకుండా దొంగ ఫోటోలు పెట్టి బినామీ పేర్లతో వందల ఎకరాల భూములు రిజిస్ట్రేషన్లు చేయించుకుందని ఆయన లేఖలో వివరించారు. రాంకీ కొనుగోలు చేసిన భూముల రికార్డులన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, బినామీ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి ఈ భూముల హక్కులన్నీ వాస్తవ పట్టాదారులకు బదలాయించాలన్నారు. రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న ఎకరాకు రు.9.50 లక్షల విలువను రైతులకు అందజేయాలన్నారు. ఈ వ్యవహారం పూర్తయ్యేవరకూ ఆ భూములన్నీ రైతులకే చెందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎలిమినేడు, గుండంపల్లి, సుంకెనపల్లి గ్రామాల భూముల సర్వేను వెంటనే పూర్తిచేయాలని కోరారు.

ధర్నా చౌక్ పరిరక్షణకు నేడు జంతర్ మంతర్ వద్ద ధర్నా



మన తెలంగాణ/న్యూఢిల్లీ: ఇందిరా పార్క్ ధర్నా చౌక్ పరిరక్షణ ఉద్యమం దేశ రాజధాని ఢిల్లీకి చేరుకుంది. ధర్నాచౌక్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జంతర్ మంతర్ సోమవారం ఉదయం 11గంటల నుండి సాయంత్రం వరకు ధర్నా నిర్వహించనున్నారు. ధర్నాలో దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన అగ్రనేతలు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ పరిరక్షణ సమితి కన్వీనర్ చాడ వెంకటరెడ్డి సోమవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.... హైదరాబాద్ లో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ ఎత్తివేయడాన్ని నిరసిస్తూ అన్ని రాజకీయ పార్టీలతో కలసి సోమవారం జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ప్రజాస్వామ్య గొంతుకను నొక్కుతున్న తెలంగాణ ప్రభుత్వ వ్యవహార శైలిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని నిర్ణయించామని అందుకే జంతర్ మంతర్ లో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజల హక్కులను అణిచివేస్తూ.... ఆర్టికల్ 19ని ఉల్లంఘిస్తున్న వ్యవహారాన్ని కేంద్ర హోం మంత్రి దృష్టికి, ఇతర మంత్రుల దృష్టికి తీసుకు వచ్చి ఒక మెమోరాండం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. జెఎసి ఛైర్మన్ కోదండరాం స్ఫూర్తి యాత్రను టిఆర్ఎస్ కార్యకర్తలు, ప్రభుత్వం అడ్డుకున్న విషయాన్ని, అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్న విషయాలను కేంద్ర హోం మంత్రి దృష్టికి తీసుకు వెళతామని చెపారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణను వెల్లడిస్తామని ప్రకటించారు. అనంతరం ఇందిరా చౌక్ పరిరక్షణ కమిటీ కోకన్వీనర్పి.ఎల్. విశ్వేశ్వర రావు మాట్లాడుతూ అన్ని రకాల ఆందోళనలకు, ధర్నాలకు, నిరసనలకు ఇరవై సంవత్సరాలుగా ఇందిరా పార్క్ వేదిక అయిందని, తెలంగాణ ఉద్యమం సందర్భంగా టిఆర్ఎస్ కూడా అక్కడే ధర్నా నిర్ణయించిందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకుంటే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ముగ్గురు కశ్మీరీ యువకుల అరెస్టు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: జాతీయ గీతాన్ని అవమానపర్చిన ముగ్గురు కశ్మీర్‌కు చెందిన ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులను రాజేంద్రనగర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాశ్మీర్‌కు చెందిన ఉమర్ ఫయాజ్, మహ్మద్ సాబేర్, ముదబీర్ షబ్బీర్‌లు చేవేళ్లలోని ఓ ప్రవేటు కళాశాలలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్నారు. అత్తాపూర్‌లోని ఓ సినిమా థియేటర్‌లో సినిమా చూసేందుకు వచ్చారు. సినిమా ప్రారంభ సమయంలో జాతీయ గీతాన్ని ప్రదర్శించారు. దానికి గౌరవ సూచికంగా అందరు నిల్చోగా ఈ ముగ్గురు యువకులు కుర్చీలోనే కూర్చుని జాతీయ గీతాన్ని అవమాన పర్చారని పలువురి ఫిర్యాదు మేరకు పోలీసులు వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఆర్‌టిసి బస్సులపై అసభ్య పోస్టర్లా?



మన తెలంగాణ/ హైదరాబాద్: ఆర్‌టిసి బస్సులపై సినిమాల అడ్వర్టైజ్‌మెంట్లు చాలా ఘోరంగా ఉంటున్నాయని, యువత ఇప్పటికే సినిమాలు చూసి చెడిపోతున్నదని భావిస్తుంటే అసభ్య పోస్టర్లతో ఇంకా ఏమి చెప్పదలుచుకుంటున్నారని కాంగ్రెస్ మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌టిసి డబ్బుల కోసం ఎంతకైనా తెగిస్తుందా అని ఆయన ప్రశ్నించారు. ఆర్‌టిసి బస్సులపై 'అర్జునరెడ్డి సినిమా పోస్టర్' యువతను పూర్తిగా చెడగొట్టే విధంగా ఉందన్నారు. ఇలాంటి అశ్లీల పోస్టర్ల ప్రచారాలను అడ్డుకోవాలని ఆయన యువతను కోరారు. అడ్వర్టైజ్‌మెంట్ల కోసం ఎలాంటి దిగజారుడు పద్ధతులకైనా తెగిస్తుందా? ఇదేనా బంగారు తెలంగాణ అంటే అని ఆయన ప్రశ్నించారు. ఆర్‌టిసి ఆదాయ వనరులను పెంపొందించుకునేందుకు ప్రయత్నాలు చేయడంలో తప్పులేదని, అయితే ఇలాంటి అసభ్యకరమైన అడ్వర్టైజ్‌మెంట్లు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.



రెండు మూడు రోజులుగా ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదలు పోటెత్తుతున్నాయి. ఆదివారంనాడు వరద తాకిడి మరింత పెరగడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని బొగత జలపాతం వద్ద కనిపించిన సుందర దృశ్యమిదీ..

మంజీరకు జలకళ

- నిండిన వాగులు, చెరువులు, కుంటలు
- భయాందోళనలో పలు గ్రామాల ప్రజలు

మన తెలంగాణ/భోదన్/బోధన్ రూరల్: తెలంగాణ—మహారాష్ట్ర సరిహద్దులోని మంజీరా నది వరద నీటితో నిండుగా పారుతుంది. రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షంతో వాగులు నిండుగా పారుతున్నాయి. చెరువులోకి నీరు ఉధృతంగా వచ్చి చేరుతుంది. బోధన్ పరిసర శివారు ప్రాంతాలలోని పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఎక్కడ చూసినా నీటితో ఉధృతంగా కాలువల ద్వారా నీరు పారుతుంది. దీంతో మండలంలోని నాగన్‌పల్లివాగు, బండార్‌పల్లి, పెగడపల్లి, లంగ్డాపూర్, పసుపు వాగులు నిండుగా పారుతున్నాయి. మంజీర నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మంజీర నది ప్రక్కన ఉన్న గ్రామాలు మం దార్నా, హున్సా, సాలూర, తగ్గెల్లి, సిద్దాపూర్, ఖండ్‌గావ్, బికినెల్లి, హంగార్గ గ్రామాలు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వర్షకాలం ప్రారంభం నుంచి ఇలాంటి వర్షం రాలేదని తెలిపారు. దీంతో మంజీర పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు ముందుగానే అప్రమత్తం చేశారు.

వర్షానికి కూలిన పలు నివాసాలు..

రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వరుస్తున్న వర్షంతో జాడిజమాల్‌పూర్, హున్సా, కొప్పర్గ గ్రామాలలో నివాసపు పెంకుటిల్లు కులాయి. గ్రామాలలో వర్షపు నీటితో చిత్తడిగా మారాయి. డ్రైనేజీలలోని మురికినీరు రోడ్లుపై పారుతుంది. ఈ గ్రామంలో సరిగ్గా రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపునీరు ఇండ్లలోకి చేరుతుండడంతో గ్రామస్తులు అందోళన చెందుతున్నారు. గ్రామంలో డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని పలుమార్లు అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. వర్షాకాలం ఆరంభమై రెండు నెలల తర్వాత వర్షం జోరందుకుంది. అల్పపీడన ద్రోణి ప్రభావంతో భారీ వర్షం కురిసింది. రైతులు, ప్రజ లు వర్షం కోసం ఎదుచూస్తున్న విష యం విధితమే. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ తాగునీటి వరప్రధాయిని అయిన బెల్లాల్ చెరువులో నీటిమట్టం పెరిగిపోయి అలుగుపై నుంచి నీరు పొర్లుతుండటంతో యువకులు, విద్యార్థులు కేరింతల మధ్య జలకాలుడుతూ కనిపించారు. పట్టణంలోని శర్బతికెనాల్ రోడ్డు, సరస్వతినగర్, వెంకటేశ్వర కాలనీలతో పాటు శివారు కాలనీలలో వర్ష పు నీటితో రోడ్లు జలమయమయ్యాయి. సాత్‌పూల్ వద్ద నీటి ప్రవాహానికి ఆటంకం కలగడంతో వెంకటేశ్వర కాలనీతో పాటు హనుమాన్ టెకిడీ ప్రాంతంలో ఇళ్ల మధ్యలోకి నీరు వచ్చి చేరింది. బోధన్‌ని రెంజల్ మండలంలో 194.8 ఎం.ఎం వర్షపాతం నమోదయ్యింది. ఎడపల్లిలో 87.6, బోధన్ 148.6, కోటగిరి 168.6 వర్షపాతం కురిసింది.

ప్రాజెక్టుల్లోకి వరద వస్తోంది!

మన తెలంగాణ/హైదరాబాద్: భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. శ్రీరాంసాగర్‌కు స్థానిక వర్షాలతో నీటి రాకడ పెరిగింది. ఆదివారం సాయంత్రానికి కడెం ప్రాజెక్టుకు 9000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 637 క్యూసెక్కుల నీరు బయటకు వదులుతున్నారు. 7.60 టిఎంసిల నిల్వ సామర్థ్యం ఉన్న కడెం ప్రాజెక్టులో ప్రస్తుతం 6.72 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఆదివారం ఉదయం 40 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, అది క్రమంగా తగ్గిపోయింది. శ్రీరాంసాగర్‌కు 5116 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 90.31 టిఎంసిల సామర్థ్యం ఉన్న శ్రీరాంసాగర్‌లో ప్రస్తుతం 9.66 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. ఇంకా 81 టిఎంసిల నీరు వస్తేనే శ్రీరాంసాగర్ గేట్లెత్తుతారు. ఇదేవిధంగా ఎల్లంపల్లికి ప్రస్తుతం 1330 క్యూసెక్కుల నీరు వస్తుండగా, 418 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. 20 టిఎంసిల సామర్థ్యం ఉన్న ఎల్లంపల్లిలో 11.33 టిఎంసిల నీరు ఉంది. నిజాంసాగర్‌కు 1899 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. 17.80 టిఎంసిల సామర్థ్యం ఉన్న నిజాంసాగర్‌లో కేవలం 1.75 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. సింగూరుకు 290 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, జైక్వాడ్‌కు 9238 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

మత్తడి పోస్తున్న లక్నవరం

మన తెలంగాణ/ గోవిందరావుపేట: కాకతీయుల వరప్రదాయిని, గోవిందరావుపేట మండల ప్రజల కల్పతరువు లక్నవరం సరస్సు మత్తడిపడింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు సరస్సులోకి వరదనీరు చేరుతోంది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాలతో బొగ్గులవాగు వరద పోటెత్తింది. మూడు రోజులుగా వస్తున్న వరదతో శనివారం రాత్రే లక్నవరం సరస్సు పూర్తి గరిష్టనీటిమట్టానికి చేరుకుంది. శుక్రువారం రాత్రి వరకు 26 అడుగుల నీరున్న లక్నవరం సరస్సు శనివారం రాత్రి వరకు 33.6 అడుగుల గరిష్ట నీటి మట్టానికి చేరుకొంది. ఇప్పటికే అడుగు వరకు మత్తడిపోస్తున్న లక్నవరం సరస్సులోకి ఇంకా వరద నీరు వచ్చి చేరుతోంది. గుండ్లవాగు ప్రాజెక్టు కూడా మత్తడిపడి వరద కిందకి పరవళ్లు తొక్కుతుండడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఈ సారి పంటలకు ఢోకా ఉండదని అంటున్నారు.



పలు చోట్ల మునిగిన పంటలు



పొంగిపొర్లుతున్న కుంటాల జలపాతం

మన తెలంగాణ/నేరడిగొండ: నేరడిగొండ మండలంలో శనివారం సాయంత్రం నుండి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ గా వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. కురిసిన వర్షానికి కుప్టి వద్ద కడెం వాగు ఉప్పొంగి ప్రవహించింది. కుంటాల జలపాతం ఉరకలెత్తుతోంది. ఆదివారం నాడు వెంకటాపూర్ వద్ద కడెం వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాగు తీరాన ఉన్న వ్యవసాయ భూముల్లో భారీగా నీరు చేరింది. గాజిలి,గాంధారి, గ్రామాల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్ల టానికి కడెం వాగుతో ఉప్పొంగడంతో ఇబ్బందిగా మారింది. వాంకిడి వాగు ఉప్పొంగి ప్రవహించడంతో సేవాదాస్‌నగర్ గ్రామప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. కడెం, వాంకిడి వాగు ప్రవహించడంతో వందలాది ఎకరాలల్లో భూమి కోతకుగురై పంట నష్టం జరిగింది. కడం పరివాహక ప్రాంతాలకు నీరు చేరి తీరని నష్టం జరిగింది. కుమారి, కుప్టి, గాజిలి, గాంధారి, వాగ్దారి, వెంకటపూర్, మాదాపూర్, కుంటాల రైతుల పంట భూముల్లో నీరు చేరింది. కడెం వాగు తీరాన ఉన్న గ్రామాల్లో భారీగా పంటలు నష్టం జరిందని రైతులు వాపో యారు. గత రెండు రోజుల నుండి కురిసిన భారీ వర్షాలకు రైతు లకు బారీ నష్టం జరిగిందని అవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండండి

అధికారులకు మంత్రి హరీశ్ ఆదేశం



మన తెలంగాణ/హైదరాబాద్: భారీ వర్షాలు కు రుస్తున్న నేపథ్యంలో ఇరిగేషన్ శాఖలో ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సాగునీటి శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. మేజర్, మీడియం ప్రాజెక్టులతో పాటు చెరువుల స్థితిగతులను ఎప్పటికప్పుడు మంత్రి తెలుసుకుంటున్నా రు. ఆన్‌లైన్లో, వాట్సాప్ ద్వారా పరిస్థితిని సమీక్షిస్తూ సంబంధిత అధికారులకు సూచనలు ఇస్తున్నారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఇరిగేషన్ శాఖ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి అన్నారు. జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నందున చెరువులు తెగిపోయే అవకాశం ఉందని ఆయా జిల్లాల సిఇలు, ఎస్ఇలను అప్రమత్తం చేశారు. ఇంజనీర్లంతా హెడ్‌క్వార్టర్లలోనే ఉండి, గంట, గంటకూ వర్షపాతం వివరాలు న మోదు చేయాలని ఆదేశించారు. చెరువులు, తూ ములు తెగిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సిమెంటు సంచులు, ఇసుక బస్తాలు నిల్వ ఉంచుకోవాలని అన్ని ఇరిగేషన్ సబ్ డివిజన్లను మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల వల్ల ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగా గుర్తించాలని సూచించారు. రెవెన్యూ యంత్రాంగంతో సమన్వయంతో పనిచేసి చెరువులను కాపాడాలని, స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని మం త్రి సూచించారు. గోదావరి బేసిన్‌లో మొత్తం 20,814 చెరువులు ఉండగా ఇందులో 1574 చెరువులు ఇప్పటికే నిండి అలుగు పారుతున్నాయి. మరో 3795 చెరువుల్లో 75 శాతానికి పైగా నీరు చేరింది. 3067 చెరువుల్లో 50 శాతానికి పైగా నీరొచ్చింది. ఇదేవిధంగా కృష్ణా బేసిన్‌లో 23,366 చెరువులు ఉండగా, ఇందులో 165 చెరువులు మాత్రమే అలుగు పారాయి. 457 చెరువుల్లో 75 శాతానికి పైగా నీరు రాగా, 1224 చెరువుల్లో 50 శాతానికి పైగా నీరొచ్చింది.

సమ్మె నోటీసుతో కదలిక

ఇఎస్ఐ, పిఎఫ్ సమస్యల పరిష్కారానికి అధికారుల చర్యలు

మన తెలంగాణ/హైదరాబాద్: కార్మిక సంఘాల రెండు రోజుల సమ్మె నోటీసుతో మున్సిపల్ శాఖ అప్రమత్తమైంది. వేతన బకాయిలు, ఇఎస్ఐ, పిఎఫ్ అమలు, తదితర సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు సన్నద్ధమయ్యారు. కార్మిక సంఘాల ప్రధాన డిమాండ్లను మున్సిపాలిటీ స్థాయిలోనే గుర్తించి వాటిని పరిష్కరించాలని మున్సిపల్ శాఖ నిర్ణయించింది. వేతనాల పెంపు, కార్మికుల క్రమబద్ధీకరణ లాంటి అంశాలను ప్రభుత్వానికే వదిలేసిన ఉన్నతాధికారులు రాష్ట్ర, స్థానిక మున్సిపాలిటీల స్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలపై మాత్రం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఈ మేరకు మున్సిపాల్ శాఖ స్థానిక సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. వివిధ డిమాండ్లతో మున్సిపల్ కార్మిక సంఘాల ఐక్య కూటమి ఈ నెల 29, 30న సమ్మె చేపడుతున్నట్టు మున్సిపాలిటీలకు సమ్మె నోటీలను అందజేసిన విషయం తెలిసందే. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు వేతనాల పెంపు, సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, కార్మికుల క్రమబద్ధీకరణ, అన్ని మున్సిపాలిటీల్లో పిఎఫ్, ఇఎస్ఐ అమలు, బకాయి వేతనాల చెల్లింపులు, 2015 లో సమ్మె కాలంలో నాలుగు నెలల కార్మికుల వేతనాల చెల్లింపులు, కార్మికులకు భద్రతా చర్యలు తదితర ప్రధాన డిమాండ్లతో కార్మిక సంఘాలు రెండు రోజుల పాటు సమ్మెకు సన్నద్ధం అవుతోంది.


ఇదే విషయాన్ని రాష్ట్ర, స్థానిక మున్సిపల్ అధికారుల దృష్టికి కూడా తీసుకొచ్చారు. ఈ విషయమై గతంలో కూడా అనేక వినతులు, స్థానికంగా నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టింది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ఇక రెండు రోజుల పాటు సమ్మె చేపట్టాలని నిర్ణయించింది. అయితే కార్మిక సంఘాల ఐక్య కూటమి ప్రధాన డిమాండ్లలో కొన్ని తమ పరిధిలో లేవని, ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. తమ పరిధిలో ఉన్న కొన్ని డిమాండ్లను పరిష్కరించేందుకు మున్సిపల్ శాఖ చర్యలు చేపట్టింది. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు క్రమంగా వేతనాలు చెల్లించడం లేదని గత కొంత కాలంగా ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదులు అందుతున్నాయి. అలాగే కార్మికుల వేతనాలలో ఇఎస్ఐ, పిఎఫ్ వాటా వసూలు చేస్తున్నప్పటికీ ఆ మొత్తాన్ని ఇఎస్ఐ,పిఎఫ్ సంస్థలకు చెల్లించడం లేదు. ఇప్పటికైనా అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలు ఇఎస్ఐ,పిఎఫ్ వాటాలను ఎప్పటికప్పుడు చెల్లించాలని, చెల్లించినట్లు ధ్రువీకరణ పత్రాన్ని సదరు కార్మికులకు వెంటనే ఇవ్వాలని ఆదేశించింది. దీని అమలు జరిగేలా స్థానిక మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కూడా స్పష్టం చేసింది. మున్సిపల్ మార్గదర్శకాల మేరకు కార్మికుల భద్రత చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. భద్రత విషయంలో 2016లోనే కరీంనగర్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో పలు అంశాలపై అధికారులు చ ర్చించారు. దీనికి సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలను కూ డా విడుదల చేశారు. వీటిని అమలు చేయాలని స్థానిక అధికారులను ఆదేశించింది.

దళితులకు రక్షణ కరువైంది

మన తెలంగాణ/హైదరాబాద్/నల్లకుంట: కేంద్రంలో నరేంద్రమోడీ, రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వ హయాంలో దళితులపై దాడులు జరుగు తున్నాయని సిపిఐ మాజీ ఎమ్మెల్యే గూండా మల్లేష్ మండిపడ్డారు. దేశంలో దళితులకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ జనతా ఫ్రంట్ (టిజెఎఫ్) ఆధ్వర్యంలో ''దళితుల, మైనార్టీలపై దాడులు బహుజనులు రాజకీయ అధికారసాధనపై'' రౌండ్‌టేబుల్ సమావేశం తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న దాడులను వామపక్ష పార్టీలు ఐక్యంగా పాలకుల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో సిఎం కెసిఆర్ సర్కారు దళితులపై ఉద్దేశపూర్వకంగానే దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో దళితలపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురిచేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

మన తెలంగాణ
www.manatelangana.news
4
హైదరాబాద్
సోమవారం
21, ఆగస్టు 2017

తెలంగాణ ఆధునిక కవిత



ద్వానా శాస్త్రి
98492 93376

తెలంగాణలో ఆధునిక కవిత అనగానే సురవరం ప్రతాపరెడ్డి సంకలనం ''గోల్కొండ కవుల సంచిక'' గుర్తుకు వస్తుంది. గోల్కొండ పత్రికలో ముడుంబై వెంకట రాఘవాచార్య ఒక వ్యాసం రాస్తూ ''నిజాం రాష్ట్రంలో ''ఆంధ్ర కవులు పూజ్యులు'' అన్నారు. ఇది సురవరం వారికి సూది పోటు అనిపించింది. అంతే, నడుం బిగించాడు. కవుల్ని, కవితల్ని సేకరించారు. 1934లో 354 మంది కవులతో గోల్కొండ కవుల సంచిక ప్రచురించారు. ఇందులో 1100 పద్యాలకు పైగా ఉన్నాయి.


ఒద్దిరాజు సీతారామచంద్ర రావు, రాఘవ రంగారావులు ఒద్దిరాజు సోదర కవులుగా ప్రసిద్ధులు. వీరిది వరంగల్ జిల్లా 'ఇనుగుర్తి'. వీరు పండితులు, కవులు, నాటక నవలా రచయితలు – ఆయుర్వేద వైద్యులు కూడా! రుద్రమ దేవి (నవల), భక్తి సార చరిత్ర (నాటకం), నౌకాభంగం (కావ్యం) వంటి రచనలు చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులుగా పని చేసిన పల్లా దుర్గయ్య రాసిన ''గంగిరెద్దు'' అధిక్షేప కావ్య ప్రాచుర్యం పొందింది. వీరి సిద్ధాంత వ్యాసం ''ప్రబంధ వాఙ్మయ వికాసం'' ఉత్తమ పరిశోధనకు నిదర్శనం. వానమామలై వరదాచార్యులు ''పోతన చరిత్రము'' అనే మహాకావ్యం రాశారు. అందుకే ఆయనను ''అభినవ పోతన'' అంటారు. 'విప్రలబ్ధ' గేయ కావ్యంతోపాటు 'కూలిపోతున్న కొమ్మ' అనే వచన కవిత్వం కూడా రాశారు. వీరి అన్నగారు జగన్నాథాచార్యులు ''రైతు రామాయణం'' రాశారు.

'కవి రత్న'' నీలాజంగయ్య రామ శతకం, కాంతి చక్రం, బుచ్చి లింగపద్యాలు, పాటల మూట'' ఆలగీతాల జోలి '' వంటి పద్య, గేయ రచనలు చేశారు. వేముగంటి నరసింహాచార్యులు తిక్కన (కావ్యం), మంజీర నాదాలు, కవితా కాహళి, ఆంధ్ర విష్ణు మొదలైన రచనలు చేసిన పండిత కవి. పద్యప్రియులు. మరి కొన్ని పద్య కావ్యాలు: అనుముల కృష్ణమూర్తి – సరస్వతీ సాక్షాత్కారం; పొట్లపల్లి సీతారామారావు – ఆత్మ నివేదన; ముకురాల రామారెడ్డి – దేవర కొండ దుర్గం; 'కోవెల సుప్రసన్న – దుఃఖ యోగిని; కోవెల సంపత్కుమార – అంతర్మథనం (శతకం);ఉత్పల సత్యనారాయణ – శ్రీకృష్ణ చంద్రోదయం , (సాహిత్య అకాడమీ బహుమతి పొందినది); సామల సదాశివ – కావ్య సుధ, సాంబ శివ శతకం నీరీక్షణము మొ॥ ; కపిల వాయిలింగమూర్తి బహుముఖ ప్రతిభాశాలి. కవి, విమర్శకులు, పండితులు, గ్రంథ పరిష్కర్తలు, నాటక రచయితలు. పండరినాథ విఠల శతకం, దుర్గా శతకం, శ్రీమత్ప్రతాప గిరిఖండం, సాలగ్రామ శాస్త్రం, చూతపురీ విలాసం, గద్వాల హనుమద్వచనాలు వంటి వెన్నో రచించిన విద్వన్మణి కపిలవాయి. కూరెళ్ల విఠలాచార్య అనగానే ''విఠలేశ్వర శతకం'' గుర్తుకు వస్తుంది. ''సాహితీ కుటీరం'' కూరెళ్ల వారి విలక్షణ పద్య ఖండిక ''గో విలాపం'', రాళ్లబండి కవితా ప్రసాద్ అవధాని. వీరి ''సప్తగిరిధామ! కలియుగ సార్వభౌమ'' అనే పద్య కావ్యం ప్రసిద్ధి కెక్కింది. పలకరిస్తే పద్యం, పద్యరత్నాల బండి రాళ్ల బండి అనటం నిజమే. తెలుగు విశ్వ విద్యాలయం ఉప కులపతిగా పనిచేసిన అనుమాండ్ల భూమయ్య 'వేయి నదుల వెలుగు'', 'వెలుగు నగల హంస', అగ్నివృక్షము', 'జ్వలిత కౌసల్య' వంటి పద్య కావ్యాలతో విలక్షణ, విశిష్ట కవిగా పేరొందారు.తెలంగాణలో ఆధునిక కవిత్వం అనగానే యుగకర్తగా మార్గదర్శిగా కాళోజీ నారాయణ రావును పేర్కొనాలి. 1914 సెప్టెంబర్ 9న జన్మించిన కాళోజీ అసలు పేరు రఘువీర్. వరంగల్‌లో స్థిరపడ్డారు. ''వైతాళిక సమితి'' వ్యవస్థాపకులలో ఒకరుగా, స్వాతంత్ర్య సమర యోధుడిగా, పౌర హక్కుల ఉద్యమశీలిగా, ప్రజా కవిగా మన్ననలు అందుకున్నారు. తను రాసిన కవిత్వమంతా కలిపి ''నా గొడవ'' గా ప్రచురించారు.

''నా గొడవనునది నఖరాలు లేనట్టిది / నాజూకుది కానట్టిది / నా గొడవనునది అక్షరాల జీవనది'' అన్నారు.

కాళోజీ ప్రజల మనిషి. ప్రజల గొడవే తన గొడవ. సామాన్యమైన భాషలో కవిత్వం రాసి అసామాన్యుడనిపించుకున్నారు. నా భాష – నా యాస – నా నేల – నా శ్వాస'' అని నినదించారు. శ్రీశ్రీ కాళోజీని ''నిఖిలాంధ్రకవి'' అన్నాడు. ''తెలియక ప్రేమ, తెలిసి ద్వేషము'', ''ఎన్నిక కథ'', ''రెండు గింజలు వంటి కథలు రాశారు. ''జీవన గీత'' ఖలీల్ జిబ్రాన్‌కి తెనుగు సేత. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులయ్యారు. కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్‌తో సత్కరించింది. కాళోజీ కవిత్వ పంక్తుల్లో ముఖ్యమైనవి కొన్ని.

కాళోజీ తర్వాత – ''నా తెలంగాణ కోటి రత్నాల వీణ'' అని గొంతెత్తి పలికిన కవి దాశరథి కృష్ణమాచార్యులు 1927లో ఖమ్మం జిల్లా – మానుకోట తాలూకాలోని గూడూరు గ్రామంలో జన్మించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవిగా, ''కళా ప్రపూర్ణ'' గా ''అభ్యుదయ ఉద్యమ నాయకుడు'' గా తెలంగాణ రచయితల సంఘానికి అధ్యక్షుడిగా సుస్థిర స్థానం సంపాదించారు. నిజాం నిరంకుశ పాలనకి ఎదురొడ్డి జైలు పాలయ్యారు. అగ్నిధార, రుద్రవీణ, దాశరథి శతకం, ఆలోచనాలోచనాలు, గాలిబ్ గీతాలు, కవితా పుష్పకం, యాత్రా స్మృతి (జీవిత చరిత్ర) వంటి రచనలతో ఆధునిక కవిత్వానికి పుష్టి కలిగించారు. ''తిమిరంతో సమరం'' వచన కవితా సంపుటికి సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.



కాళోజీ



దాశరథి



సినారె

''నా వచనం బహువచనం / నా వాదం సామ్యవాదం కవిత్వం నా మాతృభాష / ఇతివృత్తం మానవత్వం'' అని చాటి చెప్పిన నిరంతర కవి, మానవతా వాది, సినీకవి, వక్త, ఉత్తమ అధ్యాపకుడు – పరిపాలకుడు, జ్ఞానపీఠ్ బహుమతి గ్రహీత – సినారె. అంటే సింగిరెడ్డి నారాయణ రెడ్డి. 29.7.1931 కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకా హనుమాజీపేటలో జన్మించి రాజ్యసభ సభ్యుడయ్యారు. ''ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు – ప్రయోగములు'' అనే సినారె సిద్ధాంత గ్రంథం నేటికీ శిరోధార్యం. భారత ప్రభుత్వం ''పద్మభూషణ్'' తో గౌరవించింది. వీరి మంటలూ మానవుడు కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వస్తే, ''విశ్వంభర'' అనే తాత్విక దీర్ఘ కావ్యేతిహాసానికి జ్ఞానపీఠం లభించింది. తెలంగాణలో తొలి జ్ఞానపీఠ్ పురస్కారం పొందింది సి. నారాయణ రెడ్డి. వీరి ''కర్పూర వసంత రాయలు'' గొప్ప గేయ కావ్యం. కొన్ని ముఖ్యమైన సినారె రచనలు. మధ్య తరగతి మందహాసం – నాగార్జున సాగరం – మట్టి – మనిషీ – ఆకాశం, ప్రపంచ పదులు, ప్రయోగాత్మక రచన), శిఖరాలూ లోయలు (అనుసృజన); పగలే వెన్నెల (సినీ గీతావళి) మొదలైనవి. ఉర్దూ గజల్ ప్రక్రియను స్వతంత్ర తెలుగు ప్రక్రియగా రూపొందించి ''తెలుగ గజళ్లు'' గా ప్రకటించారు. కొందరు కాళోజీ, దాశరథి, సినారెలను తెలంగాణ ఆధునిక కవిత్రయం అంటారు.

''కొండలు పగలేసినం – బండలను పిండినం /మా నెత్తురు కంకరగా – ప్రాజెక్టులు కట్టినం /శ్రమ ఎవడిదిరో – సిరి ఎవడిదిరో'' ''ఓ నా ప్రియమైన మాతృదేశమా... వంటి విప్లవ కవిత్వం రాసి చైతన్యం తీసుకువచ్చిన చెరబండరాజు అసలు పేరు బద్దం భాస్కర్ రెడ్డి. దిక్సూచి, గమ్యం వంటి కావ్యాలతో పేరొందిన ఈ కవి రాసిన ''వందేమాతరం'' కవిత సంచలనం కలిగించింది. ఈయన దిగంబర కవిగా ప్రసిద్ధులు. ''ఓటమి'', ''తిరుగుబాటు'' కవితా సంపుటి వెలువరించిన జ్వాలా ముఖి – వీర రాఘవాచార్యులు దిగంబర కవిగా విప్లవ కవిగా నిలిచాడు. ''తంగేడు పూలు''కవితా సంపుటితో ప్రారంభించి నిత్య నూతన కవిగా ''కాలాన్ని నిద్రపోనివ్వను'' తో సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన గోపి, చిత్ర దీపాలు, చుట్ట కుదురు, ఎండపొడ వంటి కావ్యాలు అందించి, ''జల గీతం'' అద్భుతమైన దీర్ఘ కావ్యం రాశాడు. ఇది ఇంచుమించుగా భారతీయ భాషలన్నింటిలోకి అనువదించబడింది. వేమనపై పరిశోధన చేశాడు. ''నానీలు'' సృష్టించి 'నా నీల నాన్న' అనిపించుకున్నాడు.

తెలంగాణలో ఆధునిక కవిత్వాన్ని పండించిన ప్రముఖ కవులలో కొందరు. పేర్వారం జగన్నాథం – వృషభ పురాణం; వరవరరావు – సముద్రం, భవిష్యత్తు చిత్రపటం; సిధారెడ్డి – భూమి స్వప్నం, ఒక బాధ గాదు; దర్భశయనం శ్రీనివాసా చార్య –జీవన వీచిక , ఆట, నాగేటి చాళ్లు, నేల గంధం; సుద్దాల అశోక తేజ – నెమలి కన్నోడ, శ్రమ కావ్యం; అలిశెట్టి ప్రభాకర్ –అక్షర నక్షత్రం మీద; జూకంటి జగన్నాథం – పాతాళ గరిగే , బొడ్డు తాడు, గంగడోలు, తల్లి కొంగు; నాళేశ్వరం శంకరం – దూది మేడ; ఆశారాజు – నేపథ్యం, ఒక తడి గీతం, గల్లీ, పాగల్ షాయిర్, ఒగరు , ఇప్పుడు; జూలూరి గౌరీ శంకర్ – పాదముద్రలు; జింబో – హాజరి హై, లోపలి వర్షం; సుంకిరెడ్డి నారాయణ రెడ్డి – దాలి, కందుకూరి శ్రీరాములు – కవ్వం, సందర్భం, వయోలిన్ రాగమో – వసంత మేఘమో; వి.ఆర్.విద్యార్థి – అలలు, ఘర్మ సముద్రం, ఖండాంతర; షాజహానా – నఖాబ్; దేవ రాజు మహారాజు – గుడిసె గుండె, గాయపడ్డ ఉదయం; ప్రజా గాయకులుగా తెలంగాణలో చైతన్యం కలిగించిన కవులు ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో వీళ్లదే అగ్రస్థానం. గుమ్మడి విఠల్ 'గద్దర్' గా మారి ప్రభంజనం సృష్టించాడు. ''ఓరోరి అమీనోడా – ఓరోరి సర్కరోడ'', ''సిరిమల్లె సెట్టు కింద లచ్చుమమ్మో లచ్చమమ్మ'' వంటివి, బండి యాదగిరి ''నైజాం సర్కరోడ నాజీల మించినోడ'' అంటూ నిప్పులు కురిపించినాడు. ఏకునాదం మోత, రేల పూతలు, అలసెంద్ర వంక వంటి పాటలతో దేశి కవి గోరటి వెంకన్న. ''ఈ ఊరు మనదిరా – ఈ వాడ మనదిరా అని ప్రజా కవి గూడ అంజయ్య, ''మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు'' అన్న పాటతోపాటు మరికొన్ని మంచి పాటలతో అందెశ్రీ వెలుగొందుతున్నారు.

బుక్కపట్టణం రామచంద్ర కవి, నేరెళ్ల వెంకటాచార్యులు, బాలబ్రహ్మాచారి, చంద్రమౌళి శాస్త్రి మొదలయిన వారు అవధాన విద్యలో ఆరితేరినారు. సిరిసిన హళ్ కృష్ణమాచార్యులకు ''నిజాం రాష్ట్ర అద్యతనాంధ్ర శతావధాని'' అని పేరు. దోర్బల ప్రభాకర శర్మ, రాళ్లబండి కవితా ప్రసాద్, గౌరీ భట్ల రామకృష్ణ శర్మ, జి.ఎం. రామశర్మ, అందె వెంకట రాజం, అష్టకాల నృసింహ రామశర్మ మొదలయిన వారు అవధాలు చేస్తూ పద్య పరిమళాన్ని సుసంపన్నం చేస్తున్నారు. సుప్రసన్న , సంపత్కుమార, పేర్వారం జగన్నాథం, వే. నరసింహారెడ్డి కలిసి చేతనావర్త కవులుగా పేరుగాంచారు.

తెలంగాణ ఉద్యమ కవిత్వం ఒక కొత్త యుగంగా నిలుస్తుంది. పాట తెలంగాణ కవిత్వానికి ఊపిరి. తెలంగాణ చరిత్రను సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, గుమ్మన్నగారి బాల శ్రీనివాస మూర్తి, కె.శ్రీనివాస్, ద్వానా మొదలయిన వారు వెలుగులోకి తెచ్చారు. రవ్వా శ్రీహరి, నలిమెల భాస్కర్ తెలంగాణ పదకోశం నిర్మించారు. తెలంగాణ వచన కవులు తెరపైకి వచ్చారు. కవయిత్రులు, విమర్శకులు, స్వేచ్ఛగా సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు. కథా, నవలా సాహిత్యంలో కూడా తెలంగాణ భాషకు పట్టంకడుతున్నారు. మొత్తం మీద ఆధునిక తెలంగాణ సాహిత్యం పోరాట దశ నుంచి అస్తిత్వ దిశగా పయనిస్తుంది.


చేదురుబావి

ఇయ్యాళ
ఇంటికో నల్ల
గేరికో వాటర్ ట్యాంకైనా కన్నీళ్లే
చిన్నప్పుడు
వూరిలో చేదురుబావి ఉంటే
చేతిలో చెలిమె ఉన్నట్లే!

సూర్యుడి కిరణాల్లా
బావి సుట్టు మోట్లు
రాత్రిని పగలుని

ఇప్పుడుకుక్కర్ పది
కూతలు మొత్తుకున్నా
పచ్చులు పచ్చులు పప్పు
నోట్ల పోసుకుంటే సేదు సేదు!

గోరుకొయ్యలు పొడువక ముందే
చేతాళ్లతో ఊరు జంగిడి అయ్యేది
వదినే మరదండ్ల కుశాలు
కొత్త కోడండ్ల ముచ్చట్లకు
గాలి చెవులు ఆనిచ్చి వినేది



నిద్ర పోనియ్యని
గిరుకల మోత
నిండా బిందెలతో
సుట్టూ కాముడాడినట్లే!

బావి మీద చేతాడేసినప్పుడల్లా
బకీటకడ్డంగా సూర్యుడు
చేది వొడ్డు నేయాలని
ఎన్ని మల్కలు తండ్లాడినో
ఆశపడ్డప్పుడల్లా కప్పలు తాబేళ్లు
నీళ్లలో సూర్యుడిదే గెలుపు!

పొద్దింకల బాలింతల్ని నీళ్లకెళ్లదీసి
పసుపు కుంకుమలతో పూజిస్తే
పెద్ద పోషమ్మలా నవ్వే!
గిలాసెడు నీళ్లకే
పప్పు ఉగ్గుగ్గు అయ్యేది

రాతి దరుల గూళ్ళల్లో
ఊర పిచ్చుకలు నవ్వుకునేవి!


చేదురుబావి ఊట
వొడువని బతుకమ్మ పాట
చేదురుబావి మాట
సామూహిక రచ్చబండ

టెంకాయ నీళ్లసోంటి
బావిని చంపి
మూడంతస్తుల బంగ్లాలు వెలిసే
చేదురుబావి యాదికొచ్చినప్పుడల్లా
పోగొట్టుకున్న
అమ్మనే యాదికొస్తది

వనపట్ల సుబ్బయ్య
9492765358

రాగాలు – భావాలు

(అభ్యుదయ భావగీతాలు)
రచన : డా॥ వి.వీరాచారి
పుటలు : 60, వెల రూ.50/–
ప్రతులకు : వి.సత్యవతి
#2–1–132/1, మాధవనగర్ కాలనీ,
రోడ్డు నెం.3, గోపాలపూర్ రోడ్
హన్మకొండ – 506009.




చురక (వ్యాసాలు)

రచన : తిర్మల్
పుటలు : 88, వెల రూ.50/–
ప్రతులకు : రచయిత
#16–3–179, పి.ఎన్.ఆర్
డూప్లెక్స్ కాలనీ,
పోస్టు : గొల్లగూడెం,
ఖమ్మం జిల్లా, పిన్ : 507002.



భారత స్వాతంత్ర్యోద్యమంలో

ముస్లిం మహిళలు
రచన : సయ్యద్ నశీర్ అహమ్మద్,
పుటలు : 296, వెల రూ.160,
ప్రతులకు : తెలుగు
ఇస్లామిక్ పబ్లికేషన్స్,
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్ – 500002.




భారత స్వాతంత్ర్యోద్యమంలో

ముస్లింలు
రచన : సయ్యద్ నశీర్ అహమ్మద్,
పుటలు : 72, వెల రూ.40,
ప్రతులకు : తెలుగు
ఇస్లామిక్ పబ్లికేషన్స్,
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్ – 500002.



భారత స్వాతంత్ర్య సంగ్రామం

ముస్లిం యోధులు
రచన : సయ్యద్ నశీర్ అహమ్మద్,
పుటలు : 135, వెల రూ.200,
ప్రతులకు : తెలుగు
ఇస్లామిక్ పబ్లికేషన్స్,
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్ – 500002.



బి.ఎస్.రాములుకు స్వయంప్రభ సాహితీ అవార్డు

సామాజిక వేత్త, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బి.సి. కమిషన్ చైర్మన్ బి.ఎస్. రాములుకు ఈ నెల 26న పల్లేరు స్వయంప్రభ స్మారక సాహితీ పురస్కారం – 2017 ఇస్తున్నారు. వరంగల్లు జిల్లా పరకాలలో జరిగే ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికార భాషా కమిషన్ అధ్యక్షులు దేవులపల్లి ప్రభాకర రావు అవార్డును అందజేస్తారు. స్ఫూర్తి దాయక అవార్డును జి. గిరిజా మనోహర బాబు స్వీకరిస్తారు. వరంగల్ పార్లమెంటు సభ్యులు పసునూరి దయాకర్, స్థానిక శాసన సభ్యులు చల్లా ధర్మారెడ్డి, ఆచార్య బన్నఅయిలయ్య, డా॥ పి.ఎల్లయ్య, కె.వి.యల్. డా॥ పత్తిపాక మోహన్ తదితరులు పాల్గొంటారు. ఈ సభలో ఏరుకొండ శశిరేఖ రాసిన 'పల్లె పిలుస్తుంది' కథా సంపుటి, ఆర్ట్ గ్యాలరీలను ఆవిష్కరిస్తారు.

నేడే 'తీపి గుర్తులు' ఆవిష్కరణ

ఈ రోజు కళా సుబ్బారావు కళావేదిక, త్యాగరాజ గానసభ చిక్కడపల్లి హైదరాబాద్‌లో సాయంత్రం 5.30ను గం.లకు వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, త్యాగరాజ గాన సభ సంయుక్త నిర్వహణలో 'హాస్యబ్రహ్మ' శంకర నారాయణ రాసిన 'తీపి గుర్తులు' ను ఈనాడు జర్నలిజం స్కూల్ ప్రిన్సిపాల్ ఎమ్.నాగేశ్వర రావు గ్రంథావిష్కరణ చేస్తారు. డా॥ ద్వానా శాస్త్రి అధ్యక్షత వహించే ఈ సభలో కళా జనార్ధన మూర్తి, వోలేటి పార్వతీశం అతిథులుగా పాల్గొంటారు. గ్రంథ సమీక్ష డా॥ పల్లేరు వీరస్వామి చేస్తారు. నిర్వహకులు వంశీ రామరాజు, డా॥ తెన్నేటి సుధాదేవి; సభా ప్రారంభానికి ముందు వై.ఎస్. రామకృష్ణ సంగీత విభావరి జరుగుతుంది.

నోముల కథా పురస్కారాలు

ఇప్పటి వరకు ముద్రణ కాని కథలను నోముల కథా పురస్కారం కోసం ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 30 వరకు నోముల సత్యనారాయణ, రవీంద్ర నగర్, నల్లగొండ, చిరునామాకు డి.టి.పి. చేయించి పంపాలి. వివరాలకు 9866298023 సెల్‌లో సంప్రదించవచ్చు.

కవితా సంపుటులకు ఆహ్వానం

2015, 2016 సం॥లలో ప్రచురితాలైన కవితా సంపుటాలు 3 ప్రతుల చొప్పున ఎడ్ల గురువారెడ్డి స్మారక సాహిత్య పురస్కారం కొరకు వెన్నెల సాహితీ సంగమం సిద్దిపేట ఆహ్వానిస్తున్నది. ఈ నెల చివరి వరకు కొండి మల్లారెడ్డి, ఇం. నెం. 19–61/5/ సి, విద్యానగర్, రోడ్ నెం. 3, కుషాల్ నగర్, సిద్దిపేట – 502103,

కథలకు ఆహ్వానం

ఈ నెల 30 వరకు కథలను గోలి వెంకట రామయ్య స్మారక పురస్కారం కోసం (సెల్. నెం. 9866171648) కోరుతున్నారు. పంపవలసిన చిరునామా ఎడిటర్, నెలవంక నెమలీక సాహిత్య మాసపత్రిక, 15–140, పి అండ్ టి కాలనీ, కోదండ రామాలయం వీధి, దిల్‌షుఖ్ నగర్, హైదరాబాద్

జయ ప్రకాష్‌కు రంగాచార్య అవార్డు

తెలుగు భాషా చైతన్య సమితి, ద్వానా సాహితీ కుటీరం సంయుక్తంగా దాశరథి రంగాచార్య స్మారక సాహితీ పురస్కారాన్ని వి. జయప్రకాష్‌కు ఇస్తున్నారు. ఈ నెల 24న సా॥గం 6.లకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో నందిని సిధారెడ్డి ద్వారా పురస్కారం అందిస్తారు. ద్వానా శాస్త్రి, బైస దేవదాసు, కందుకూరి శ్రీరాములు తదితరులు పాల్గొంటారు.

చరిత్రకు దర్పణం 'చిల్లర దేవుళ్లు'



అమ్జద్

ప్రముఖ కమ్యూనిస్టు నేత చంద్ర రాజేశ్వర రావు గారు డాక్టర్ దాశరథి రంగాచార్యగారిని ''ఆంధ్ర గోర్కీ'' గా పేర్కొన్నారు. తెలంగాణలోని వరంగల్ జిల్లా లోని చినగూడూరులో సనాతన సంప్రదాయ కుటుంబంలో ఆగస్టు 24, 1928న జన్మించారు.

రంగాచార్య గారు చిన్నప్పటి నుంచే వామ పక్షం వైపుకు మొగ్గి ఉన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటం ఆయుధాలను చేత బూనడం వలన వారు పోలీసు యాక్షన్ తర్వాత బయటికి వచ్చారు.


1951లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి 1957లో అనువాదకులుగా సికింద్రాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో చేరారు. రంగాచార్య మొత్తం 9 నవలలు రాశారు. ''చిల్లర దేవుళ్లు'' , మోదుగు పూలు'' , ''మాయ జలతారు'', ''జనపదం'', ''రానున్నది ఏది నిజం'', ''మానవత'' , ''శరతల్పం'', ''పావని'' , ''అమృతంగమయ''.

తెలంగాణ గురించి రాయబడిన దాశరథి రంగాచార్య గారి తొలి నవల ''చిల్లర దేవుళ్లు''. దీన్ని ఐదు వారాలలో పూర్తి చేశారు. ఇది 1969లో వెలువరించబడింది. వారి మొదటి నవలే సాహితీ రంగంలో ఓ మైలు రాయి. ప్రగతి వార పత్రికలో 13 వారాలు (21.03.1969 – 13.06.1969) సీరియల్‌గా వచ్చింది.

1971 లో ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ అవార్డు పొందింది. ఆకాశవాణి కేంద్రం హైదరాబాద్, 1971లో జులై 19న నాటకంగా ప్రసారం చేసింది. మార్చ్ 11, 1977న సినిమాగా విడుదలైంది కాకతీయ పిక్చర్స్ వారి ద్వారా. హిందీలోకి ''ఘాట్ కీ దేవత'' శీర్షికతో ప్రొఫెసర్ భీంసేన్ నిర్మల్ అనువదించారు. 'లోక్ రాజ్' హిందీ పక్ష పత్రిక దాన్ని సీరియల్‌గా వేసుకుంది. ఇంగ్లీష్‌లో 'లెస్సర్ డైటీస్' పేరుతో చక్రవర్తుల శేషాచార్యులు అనువదించారు.

చిల్లర దేవుళ్లు నవల నేపథ్యం మనకు స్వాతంత్ర్యం రాకపూర్వం హైదరాబాద్ నవాబు పరిపాలన కాలంలోని తెలంగాణ ప్రజల ఆర్థిక, సామాజిక జీవితానికి, దొరల విలాస, నిరంకుశత్వానికి అద్దం పట్టింది. దొర అధికారానికి, కరణం కుట్రకు భయపడి బ్రతుకుతుంటారు ఆ ఊరి జనం. ఆనాటి కరణం మనస్తత్వాలు గల గ్రామాధికారులు ఈ రోజులలో కూడా లేకపోలేదు.

దొంగలు దొంగలు ఊర్లు పంచుకొన్నట్లు దేశ్‌ముఖ్ రామారెడ్డి మరియు కరణం గారు ఒకరిని ఒకరు బ్లాక్ మేల్ చేసుకుంటూ చివరికి ఓ ఒప్పందానికొస్తారు. చింత కాయలు దొంగతనం చేసిన వాడిని (పీరి గాడు) చంపినందుకు రెడ్డి గారికీ, లంబాడీల ప్రాణాలు తీసిన కరణం మధ్య ఒప్పందం కుదిరింది. ఊరి రాజకీయం ఇలా ఉంటుంది మరి! ఆ ఊరి దొర రామారెడ్డి గారి ముద్దుల కూతురు మంజరిని సంగీత మాస్టారు సారంగ పాణితో పెండ్లి చేయించమని కోరుతాడు కరణం. ఇది జరగని విషయం అని తెలిసి ఉండి, మరో సందర్భంలో దొర గత్యంతరం లేక సంగీత మాస్టారును కరణం గారి అమ్మాయిని వివాహామాడమని వేడుకొంటాడు. అప్పుడు అతని సమాధానం, 'పెళ్లి జీవితానికి సంబంధించింది. ప్రేమ శరీరానికి సంబంధించింది కాదు. ప్రేమకు రూపానికి సంబంధం లేదు. ఒక్కొక్కరి దగ్గర ఒక్కక్క రకమైన ఆకర్షణ ఉంటుంది. అందమైన భార్యల్ని వదలి అనాకారులైన వారి వెంబడి తమ సర్వస్వం అర్పించే వారుంటారు.. ప్రేమ వైయక్తికమైంది. సంఘంతోనూ, రాజకీయాలతోనూ దానికి సంబంధం లేదు. ఎవరిని ఆకర్షిస్తారో చెప్పలేం. మనకు ఎంత అధికారం ఉన్నప్పటికీ సూర్యుడు లేనప్పుడు తామరలను వికసింపజేయలేం. చకోరం వెన్నెల కోసం నిరీక్షిస్తూ ఉంటుంది. కాని అన్యం భక్షించదు. ప్రేమ కోసం రాజ్యాలను త్యజించినవారున్నారు ' అని తాయరును పెండ్లి చేసుకోడానికి నిరాకరిస్తూ కరణం గారి ఆస్తి అవసరం లేదంటాడు. విషం తింటే లక్ష రూపాయలిస్తామంటే తింటామా?' అని చెప్తాడు సంగీత మాస్టారు పాణి.



(ఆగస్టు 24 డా॥ దాశరథి రంగాచార్య జయంతి)

మరో పాత్ర వనజ. ఆడ బాపన. ఆమె అందాన్ని వాడుకునే వారు, ఆమె అందంగా ఉండేది. ఆట బొమ్మలా అందరికీ ఆట వస్తువు అయింది. దొర ఇంటికి వచ్చి అతిథులందరికీ సర్వం సమర్పించింది. మామిడి పళ్ల పల్లెంలోపెట్టినట్లు అందించేది తనను అందరికీ. రసం తాగి తొక్క పారేసినట్లు పారేశారెందరో. మగవారంటే ఆడదాన్ని పళ్లరసం లాగానో, పాయసం లాగానో, సారాయిలాగానో తాగేవారనుకున్నది.

ఉత్తమ సాహిత్యానికి వారసులు రంగాచార్యులు గారు. ధన మదాంధులకు నీతులు చెప్పరాదు. వంతపాడాలి. ధనం, అధికారం ఉన్నవాడు తాను తలచేది, చెప్పేది, చేసేది సరియైనదనుకుంటాడు. అది సరికాదని చెప్పేవాన్ని పిచ్చివాడనుకోవడమో, వాడిమీద పగ తీర్చుకోవడమో చేస్తారన్న నగ్న సత్యాన్ని చెప్పారు. చిల్లర దేవుళ్ల నవల అయిదు ముద్రణలకు నోచుకుంది. అందులోని అన్నిముఖ్యమైన పాత్రలు సజీవాలే! సారంగపాణి సంగీత మాస్టారు. రెడ్డిగారి దగ్గరకి బ్రిటీష్ ఆంధ్ర నుండి కడుపు చేతిలో పెట్టుకొని వచ్చాడు. తనోసారి ఆలోచిస్తాడు – ''రాజ్యమంతా తురకల్ని చేస్తాడేమో నిజాం నవాబు. పోల్చి చూస్తే ఇంగ్లీషు వాళ్లే దేవతల్లా కనిపిస్తున్నారు.'' అని ... అలాగే వనజ, ఆడబాపన కూడా గుర్తుకొస్తుంది అతడికి. శృంగార దేవతగా; మనిషి ఆలోచనలకు పరిధులు లేవు అనే సందర్భమది.

కరణం వెంకట్రావు వర్సెస్ దొర రామారెడ్డి. వారిద్దరికీ ఎప్పుడూ పడేది కాదు. ఆ ఊరిలోకి స్వామీజీ వస్తారు. స్వామీజీ తాయారుతో శృంగార రస కేళిలో నిమగ్నుడై వుండగా కరణం గారు ఆ సీనులో ఉండగా చూసి పిచ్చెక్కిపోతారు. కరణం గారి కర్మకు సరియైన పదం చూపారు దాశరథి రంగాచార్య గారు. చేసిన పాపం ఊరికేపోదంటారు మరి. దుష్కృత్యాలు చేయించ డానికే సంపద, అధికారం అని తేల్చి చెబుతాడు నవలలో రచయిత.

దేవుల పల్లి రామానుజరావు గారు చిల్లర దేవుళ్ల నవల ప్రథమ ముద్రణకు తొలి పలుకులో రాస్తూ ''నాకు ఎలాంటి సందు దొరకనివ్వలేదు, రెండు వాక్యాలు రాద్దామని ప్రయత్నించగా!'' అని పేర్కొన్నారు. రంగాచార్య గారు సికింద్రాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా 1988లో పదవీ విరమణ చేశారు. తన జీవితాన్ని మానవత కోసం పోరాడిన తెలంగాణ బిడ్డ దాశరథి రంగాచార్యగారు. వారు జూన్ 8, 2015న కీర్తిశేషులయ్యారు.

యాపశెట్టు

'కంఠం'లనే కాదు
ఒళ్ళంత శేదు పులుముకొని
ఆయిధం పట్టని దేవతై
ఇంటిముందు నెర్దది యాపశెట్టు
దాని మనుసు యిశాలం అది త్యాగాల తరువు
ఎన్నో జీవులకు ఆదెరువు
పిట్టకు గూడైతది తేనెకు పట్టైతది
సల్లని నీడకు పాణంబోత్తది
పండ్లపుల్లై పాశినోరు సాపుజేసి పరిమళాలైతది
కఫరోగాలు నయంజేసి ధన్వంతరైతది
యాపపూత ఉగాది రోజున
పచ్చడి పటువల తానంజేసి ఇంటిళ్ళిపాదికి
'ఇస్కీ మంద్దె' చీర్స్... కొద్దది
సంటిపోరనికి సల్లదాదులై బొబ్బలెక్కుతే..
రోట్లె ఆకు నూరి పసరుబట్టితే
నాలుగొద్దులకే తోలు నునుపుదేలుతది
యాపశెక్కను కొత్తకుండల ఊరేసి తాపిత్తె
ఒంట్లె వేడిచ్చుకపొయ్యి గడ్డలు గల్లంతైతయి
యాపశిగురు ఎండపొడకు
నక్లీసు ఆకోలె మెరిసి తనువునెంతో మురిపిత్తది
ఎండినపుల్లలు యిత్తారాకుల విందారగిత్తది
యాపమండ బోనానికి వొలువై
శివసత్తై శివాలూగుతది
యాపనూనె, యాపాకుదూపం
క్రిమికీటకాల తరిమి రోగాల దూరంజేత్తయి
ఇగ యాపపండ్లు పలుగుతె
చీమజాతికి పండుగ దావతే
గింజల దంచి పిండిజేసి దుక్కిల జల్లితె
తెగులు తేలిపోయి పొలం జవైతది
యాపబంక తోటి బతుకు నోటు అతికి
బరోసాకల్పిత్తది
పోశమ్మ గుళ్ళె పసుపు కుంకుమ రాసుకొని
ఎయ్యిగండ్ల బోనమై ఎలిగి
ముడుపుల కాత్తది.. తొట్లెను కంటది
దర్గాలల్ల జెండానెత్తుకొని దట్టీలు కప్పుకొని
గంధం జల్లుకుంటది
ఊదుపొగజూపి మలీదముద్దల పంచిబెడ్తది
చర్చీల ముందు నక్షత్ర దీపాలు తొడుక్కొని
క్రిస్మస్ చెట్టైతది శాంతాక్లాజ్ తాతైతది
గొడ్డలెత్తి నర్కబోతె రంపంబెట్టి కొయ్యబోతె
వద్దు బిడ్డాని వరంబడ్తది
నరికి ఆగమైతె కరిగి కన్నీరుబెడ్తది
మళ్ళీ పుట్టి మట్టి ఋణం తీర్సుకుంటది
ఊరు సల్లంగుండాలని దీవెనబెడ్తది
బతుకడమే దాని కులం
బతికించడమే దాని మతం.

వడ్లకొండ దయాకర్, 9440427968





మన తెలంగాణ

5

హైదరాబాద్

సోమవారం

21, ఆగస్టు, 2017

www.manatelangana.news

ఇజ్జత్ పెంచిన ఇక్కత్

ఫ్యాషన్ ప్రపంచం ఇవాళ పాత కొత్తల మేలు కలయికగా రూపొందుతోంది. పోచంపల్లి డిజైన్‌గా పాపులర్ అయిన ఇక్కత్ వైపు దేశమంతా చూస్తోంది. తెలంగాణ గడ్డ చేనేతకు పెట్టింది పేరు. వ్యవసాయం తర్వాతి స్థానం చేనేతదే. అయితే చేనేత గిట్టుబాటు కాకపోవడంతో చాలామంది ఉపాధికోసం ఇతర పనులు చూసుకుని వలస బాటపట్టారు. కుటుంబానికి ఒకరో ఇద్దరో మిగిలారు. ఈ నేథ్యంలో నాబార్డు సాయంతో JWORDS NGO (జీసస్ వెల్ఫేర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ) సంస్థ గ్రామీణ మహిళలకు జీవనోపాధి కల్పన, శిక్షణ పథకాల్లో భాగంగా ఇక్కత్ నేతలో శిక్షణ కార్యక్రమం చేపట్టింది. చేనేతలో ప్రత్యేకమైన శైలి ఇక్కత్. ఈ అద్దకం నేతలో నైపుణ్యాలను మెరుగుపర్చి జీవనోపాధి అవకాశాలు పెంచడానికి నాబార్డు తొలిసారిగా తెలంగాణాలోని నల్గొండ జిల్లాలో ఈకార్యక్రమాన్ని చేపట్టింది. ఇక్కత్ డిజైనింగ్, నేతకు ఇవాళ ఫ్యాషన్ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. దాంతో మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. సంప్రదాయ వస్త్రాల నేతలో నల్లగొండ జిల్లా నేతకారులకు చక్కని సామర్థ్యం, నైపుణ్యం ఉన్నాయి.

ఇక్కత్ శైలి

నిజానికి ఇక్కత్ శైలి కొత్తదేమీ కాదు. తరతరాలుగా సంప్రదాయంగా వస్తున్నదే. ఇక్కత్ వస్త్రాల నేత అత్యంత కళాత్మకం. దీనిలో రెండు ముఖ్య అంశాలుంటాయి.1, రంగు దారాల తయారీ 2, బొమ్మలు లేదా డిజైన్ అద్దకం. దారాల మీదే డిజైన్ వేసి, ఆ తర్వాత మగ్గం మీద నెయ్యడం దీనిలో ప్రత్యేకత. అందుచేత ఇందులో ఆర్టూ, క్రాఫ్టూ రెండూ ఉన్నాయి. అందువల్లనే దీనికి మార్కెట్లో అద్భుత డిమాండ్ ఉంది. సామాన్యుల నుండి, ఫ్యాషన్ డిజైనర్ల వరకు అందరూ ఆదరిస్తున్న ఇక్కత్ నేతలో కొత్తపుంతల్ని చేనేత కారుల్లో చాలామంది మహిళలు సైతం గుర్తించలేదు. ఆదాయం తెచ్చిపెట్టడంలో ఇక్కత్ వస్త్రాలకు గల అవకాశాన్నిJWORDS సంస్థ గుర్తించింది.





శిక్షణ... స్వయం సహాయక గ్రూపులకు చెందిన 90మంది మహిళలకు JWORDS స్వచ్ఛంద సంస్థ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసింది. నల్గొండ జిల్లాలో నెమ్మాని, మంద్ర, వెల్లంకి గ్రామాలకు చెందిన 90మంది మహిళలు 15 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఇప్పటికే ఉత్పత్తి యూనిట్లు ప్రారంభించారు. ఇక్కత్ డిజైనింగ్ నేత దుస్తులకు మార్కెట్లో గిరాకీ ఉంది. స్థానిక అవసరాలకూ ఎగుమతులకూ కూడా మంచి అవకాశం ఉంది. ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని మహిళలకు నాబార్డు సాయంతో నైపుణ్య శిక్షణ ఇచ్చారు. అయితే ముడిసరుకు, మార్కెటింగ్ కు సంబంధించి స్థానికంగా ఉండే అవకాశాలనే ప్రధానంగా తీసుకోవడం వల్ల మహిళల ఆదాయం పెరిగి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి.

నైపుణ్యాలు... మార్కెటింగ్

కేవలం నైపుణ్యాలు పెంచడమే కాకుండా రుణ సదుపాయం పొందడం, మార్కెటింగ్ మొదలైన అంశాల్లో కూడా కౌన్సెలింగ్ ఇచ్చింది. దీనివల్ల శిక్షణ పొందిన మహిళలకు మంచి లబ్ధి చేకూరుతుంది.

శిక్షణ ఎలా పొందారు...?

తెలంగాణలో సహజంగానే చేనేత కుటీర పరిశ్రమగా ఉంది. నేతలోని వివిధ దశల్లో కుటుంబ సభ్యులంతా పనిచేస్తారు. చేనేత గిట్టుబాటు కాకపోవడంతో యువతరం వేరే రంగాల వైపు వెళ్తోంది. అయితే కుటుంబంలో నేత మీద ఆధారపడిన వారికి ఆకలి బాధలు తప్పడంలేదు. వారికి ఇక్కత్ సరైన ప్రత్యామ్నాయంగా నిరూపించుకుంటుంది. (WARP, WEFTWINDING AND TIE & DIE)ముందుగానే దారాలమీద డిజైన్ వెయ్యడం, మగ్గం మీద దారాలు ఏర్పాటు, అద్దకం మొదలైన అనేక అంశాల్లో మహిళలు శిక్షణ పొందారు. ఇవన్నీ తమ ఇంట్లోనే కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకోవచ్చు. దీనివల్ల వారికి రోజుకు 400 రూపాయల నుండి 6వందల రూపాయల దాకా ఆదాయం సమకూరుతుంది.

శిక్షణలో ముఖ్యాంశాలు

- కొత్త డిజైన్ల రూపకల్పన, ఉత్పత్తి.
- పని తేలిక చెయ్యడం.
- మార్కెట్ కు అనుగుణంగా డిజైన్, క్వాలిటీ పెంచడం, మహిళలకు మంచి ఆదాయం సమకూర్చడం.

సృజనాత్మకతకు పదును

ఎల్‌ఇడిపి మహిళల జీవనోపాధి మెరుగు పర్చడానికి నాబార్డు ఉద్దేశించిన కార్యక్రమం. మహిళలకు ఇక్కత్ పై ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఆదాయం పెంచడం, చేనేత క్లష్టర్ల ఏర్పాటు ఈ పథకం ప్రధాన ఉద్దేశం. మహిళల సృజనాత్మకతకు మరింత పదునుపెడుతూ డిజైన్ల అభివృద్ధి ఆన్ లైన్, ఆఫ్ లైన్ విధానాల ద్వారా మార్కెటింగ్ చెయ్యడం వల్ల మార్కెట్ నెట్ వర్క్ పెరుగుతుంది.

మెరుగైన శిక్షణ వల్ల మేలు



ఇక్కత్ డిజైనింగ్ వల్ల మా నేతకు మార్కెట్ పెరిగింది. ఒకపుడు నెలకు రూ.4వేలు కూడా మిగలని మేము నేడు నాబార్డు ఇచ్చిన శిక్షణ వల్ల రూ14వేలకు పైగా సంపాదించుకుంటున్నాం. చీరలకు అంచుల డిజైనింగ్, డిజైనుకు అనుగుణంగా నూలుతయారీ, రంగుల వాడకం వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చారు. మర మగ్గాలు, చేతి మగ్గాల మీదా నేతలో శిక్షణ వల్ల మా ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది.

– గంజి ఉమ, వెల్లంకి

కొత్త డిజైన్లకు శ్రీకారం



పోచంపల్లి ఇక్కత్ డిజైన్ గ్రామీణ నేతమ్మలకు జీవనోపాధి కల్పించడంతో పాటు వారి చేతిలో కొత్త ఒరవడి సంతరించుకుంటోంది. టెక్నాలజీ సాయంతో చేనేతను మరింత అభివృద్ధి చేసేలా చేయడం మా లక్ష్యం. ముఖ్యంగా మహిళలు ఈ రంగంలో మరింతగా అభివృద్ధి చెందేలా చూస్తున్నాం. వారికి కంప్యూటర్ ద్వారా కొత్త కొత్త డిజైన్లను చూపించి వారిని మరింత చైతన్యవంతులను చేస్తున్నాం.

– డి.దయామృత, నాబార్డు నల్గొండ జిల్లా అధికారి

మహిళలకు స్వయం సమృద్ధి

''నేతక్కల స్వయం సమృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో శిక్షణా సమయం 15 రోజులు. 18 నుండి 50 సంవత్సరాల మధ్య వయసులోని, గ్రామీణ స్వయం సహాయక గ్రూపులకు చెందిన మహిళలను ఎంపిక చేశాం. వీరిలో ఎక్కువమంది చేనేత కారుల కుటుంబానికి చెందిన వారే. వీరు ముందునుంచీ కూడా కొత్త విద్య నేర్చుకోవడంలో ఆసక్తి కనపరిచారు. 90మందిని ఫ్యాబ్రిక్ డిజైన్ శిక్షణకు ఎంపిక చేశాం. నాబార్డు జిల్లా అధికారి దయామృత చొరవ, సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతమైన పేద చేనేత కార్మిక మహిళలకు ఉపాధి అవకాశాలు పెరిగాయి.'' అంటున్నారు JWORDS స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గోపీనాథ్.

మార్కెట్ మంత్రం...

- సమకాలీన, పర్యావరణ హితమైన వస్త్రాల తయారీ వల్ల మార్కెట్ బేస్ పెరుగుతుంది.
- సహకార పద్ధతి ద్వారా సాంకేతిక సామర్థ్యం పెంచడం, వస్త్రాల నాణ్యత మెరుగుపర్చడం,
- టర్నోవర్ పెంచడం వంటి లక్ష్యాలు సాధించడం వల్ల వినియోగదారుల అభిరుచికి, ఆర్డరుకు తగిన విధంగా వారు కోరిన ప్రొడక్టును మరింత మెరుగ్గా తయారు చెయ్యగలరు. మొత్తంగా వినియోగదారులకు అదనపు సేవలు అందించగలరు. గ్రామీణ ఉద్పాదకత పెరుగుతుంది. గ్రామీణ మహిళలు, ఉత్పత్తి, మార్కెటింగ్ క్రమంలో భాగస్వాములవుతారు.

శ్యాంమోహన్, 9440595858

బిడ్డ పుట్టాక తల్లి కోలుకోవడానికి..





తల్లి అవటం మహిళకు వరంలాంటిది. గర్భవతిగా ఉన్నప్పుడు, కాబోయే తల్లి బిడ్డకోసం మంచి ఆహారపదార్థాలు తింటుంది. తన బిడ్డకు హానికరమైనవి అస్సలు తీసుకోదు. ప్రసవం అనంతరం తల్లి చాలా నీరసంగా వుంటుంది కనుక మళ్లీ తిరిగి ఎప్పటిలాగానే బలంగా వుండడానికి కొన్ని రోజుల పాటు విశ్రాంతితో పాటు సరైన పోషక ఆహారపదార్థాలు తీసుకోవడం మంచిది. తన బిడ్డను ఆరోగ్యంగా ఉంచడమేగాక తల్లిని బలంగా త్వరగా కోలుకునేలా చేసే పోషక పదార్థాల గురించి తెలుసుకుందాం. ఓట్స్ లో ఉండే పీచు పదార్థం మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. బాలింతలు ఓట్స్‌ను ఖిచిడి లేదా ఉప్మాలా చేసుకుని తినవచ్చు. పళ్ళ ముక్కలు, డ్రై ఫ్రూట్స్ వంటివి కూడా కలిపి తీసుకోవడంవల్ల బలం చేకూరుతుంది. పప్పుధాన్యాలలో ప్రొటీన్, విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. పప్పులు, సూపులు, హల్వా వంటి స్వీట్లు తయారు చేసుకోవచ్చు. కంది లేదా పెసరపప్పు కొత్త తల్లులకు (వాటి సులభ అరుగుదల వల్ల) ఎంతో మంచివి. వామును సాధారణంగా ప్రసవం తర్వాత ఆహారదినుసుగా వాడతారు. ఇది మలబద్ధకాన్ని, అజీర్తిని, గ్యాస్‌ను తొలగిస్తుంది. తల్లిపాల ఉత్పత్తిని పెంచుతుంది. గర్భాశయం కుచించుకుని ఇంతకు ముందు స్థితికి రావటానికి సాయపడుతుంది. బ్యాక్టీరియా, ఫంగల్ వ్యాధులకు కూడా ఇది వ్యతిరేకంగా పనిచేస్తుంది. కొంతమంది వామును నీటిలో వేసి మరగించి ఆ నీరును నేరుగా కోలుకోవటానికి తాగుతారు. ఇది బాలింతకు చాలా మంచిది. అదేవిధంగా, ఒక చెంచాడు పసుపు పాలలో మరిగించి, గోరువెచ్చగా తాగండి. కావాలంటే కొంచెం తేనె, పంచదార వేసుకొని తీసుకుంటే మంచి ఫలితం లభిస్తుంది. వాపులు తగ్గించే గుణం అల్లంకు వుంటుంది కనుక బిడ్డ పుట్టాక ఇది వాడితే మేలు. శొంఠి లడ్డును బాలింతలకు పెడతారు. భోజనం చేసేటప్పుడు కూడా కొంచెం అల్లం పొడి వేసుకొని తిన్నా మంచిది.

ఎడ్ల, గొడ్ల పండుగంటె ఊరంత ఉషారె!

పర్యావరణ పరిరక్షణ, సమస్త జీవజాల సంరక్షణ, జీవితంలో క్రమశిక్షణ నేర్పడమే పండుగుల ముఖ్య ఉద్దేశ్యం. బంధువులు, స్నేహితులు, మనుగడలో మనకు సాయమందించేవారందరితో కలిసిమెలిసి కష్టసుఖాలు పంచుకోవాలన్నదే ఈ వేడుకల వెనక ఉన్న పరమార్థం.

నేడు పోలాల అమావాస్య





శ్రావాంట మృగశిర కార్తెతోటి వానలు మొదలై శ్రావణమంత భూమిఆకాశం ఒక్కటయ్యేటట్టు పడేవి చిన్నప్పుడు. ఇంట్లకెల్లి కాలు బయటవెడ్దామంటె ఒకటే బురద, దాన్కితోడు కుప్పలు కుప్పలుగ పుట్టుకచ్చె అప్పడాల గుర్రాలు. గవీట్ని సూస్తె అన్నం కూడ తినబుద్ధికాక పోయ్యేట్టి. కాని వాట్ని చూసి అసిచ్చుకుంటె "భూమ్మీద అన్ని రకాల పురుగుపుట్ర, చెట్టుచేమ మంచి గుంటెనె మనం మంచిగుంటం" అని అమ్మ తిట్టేట్టి. సరె అమ్మ అప్పుడేంజెప్పిందో కాని ఈ కాలంల మనం గూడ కోరేది "live and let live". సరె గీ ముచ్చట ఇప్పుడెందుకు చెప్తున్ననంటె అప్పటంత వానల్లేకుండనే శ్రావణం అయిపోతాందిప్పుడు, వానలు కొద్దిగంత తగ్గితె శ్రావణం అయిందని తెల్సేది ఇదివరకు. కాని ఇప్పుడు పండుగును యాద్జేస్కుంటు ఫోటోషాప్‌ల తయార్జేసిన ఫోటోలు సోషల్ మీడియాల దోస్తులు పెడ్తేనే పండుగు అన్నది తెలుస్తాంది. పండుగులు వస్తెగాని వానాకాలం అనే సంగతి మతికి వస్తలేదు. అవు మరి శ్రావణం అయిపోయి భాద్రపదం మొదలయ్యే ముంగటిదినాన వచ్చే అమాశ నాడు ఊర్లె ఉన్నోల్లందరు ఏకమై పొలాలమాశ పండుగు చేసుకునుడు ఇంకా యాదికే ఉన్నది. ఇగ ఇప్పుడా! ఒక్క తల్లికడుపున పుట్టినోల్లే ఒక్కకాడుంటలేరు, ఊరందరి సంగతి దేవున్నెరుక. అయితె గప్పుడువడ్డ వానలిప్పుడు లేకపోయినా, అందరొక్కకాడ ఉండకపోయినాగాని తాతలకాలం నుంచి వస్తున్న ఆచారమైతె ఎటుపోదుగదా! గందికె ఏడున్నాగాని పొలాలమాశ పండుగుజేస్కుండు మాత్రం బంజేస్తలేరు, కాకుంటె చేస్కునే పద్ధతులు మారినై.

వానలు పడేటప్పుడు ఊళ్లల్ల వాగులు, చెరువులు మస్తుగనిండి, కట్టలు తెగుతయని భయపడేటిది. చెర్లల్లకి నీళ్లచ్చేకాలంగావట్టి ఆ చెరువుల్ల మట్టిని తీస్కచ్చి ఎడ్లు, గొడ్లు, గొల్లబోయన్ని తయారుజేసేది. నడింట్ల పోచమ్మను పూదిచ్చినకాడ (గోడకు ఆవుపాలు, పేడతో అలికి పసుపు కుంకుమతో పొలాలు గీస్తారు) గీ గొడ్లు, ఎడ్లనుంచి పూజ చేసేది. వాటి పక్కపొంటి ఓ జల్లెట్ల ఆ ఇంటిల్లిపాది పేరు మీద కొత్తబట్టలుంచి, వాటి మీద మక్కకంకులు, ఎలక్కాయి, పొట్లకాయి వంటివన్ని పెడుదురు. పోచక్కతల్లికి, ఎడ్ల, గొడ్లకు పత్తితోటి వస్త్రం తయారుచేసి వేద్దురు, అంటె ఆనాడు ఎడ్లు, గొడ్లకు కూడ పూజచేద్దురు. కడుపు సల్లగుండాలని ముత్తేద కడుపు మీద పెరుగు సల్లి వాయినం ఇచ్చినంక ఆనాడు వండిన వంటలన్నీ ఓ పచ్చివిస్తరాకులో వడ్డించేది. పోచక్కతల్లిని పూదిచ్చిందగ్గర ఇంకో పచ్చి విస్తరాకువేసి అండ్ల కూడా వండిన వంటలన్ని వడ్డిచ్చేది. గిట్లెందుకు జేసుడు అని అడిగితే ఈగలుదోమల కాలం కద, వాటిగ్గూడ పెట్టాల్నని చెప్పేట్టి అమ్మ (LIVE AND LET LIVE అనేది పెద్దయినంక తెలిసింది). ముత్తేద తిన్నంకనే మాకు పెట్టేది (అతిథి దేవో భవ). మేం తినేసరికి పగటీలు మూడయ్యేది. బియ్యప్పాయసం, గారెలు, తొమ్మిది రకాల కూరలు, పచ్చళ్లు, రోటి తొక్కులతోటి వడ్డిచ్చిన వంటలను పారేయకుండ తినాల్నని చెప్పేది అమ్మ (సీజనల్‌గా దొరికే కూరగాయలను తినే అలవాటు చేయడం దీని వెనక ఉండే ఆలోచన). గవన్ని తినేసరికి మస్తు నిద్ర వచ్చేది. కాని గదే టైంకు ఊర్ల ఉన్న గొడ్లను ఈదుల్లల్ల తిప్పేటందుకు తీసుకచ్చేటిది. గట్ల తీస్కచ్చే ఎడ్ల కొమ్ములకు గులాల్‌రంగు పూసి, వాటిని మస్తుగ తయార్జేసేది. గదాన్ని చూసెటందుకు ఎంత నిద్ర వచ్చినా అపుకోని లేసి బయిటికి పోయ్యేది. అన్ని చూసినంక, వాటినిగురించి దోస్తులందరం కల్సి ముచ్చట్లువెట్టుకునేది. పండుగైపోయినంక పూజకోసం తయారుజేసిన ఎడ్లు, గొడ్లతో ఎన్నో రోజులు ఆటలాడుకుందుము. ఎడ్లు, గొడ్లు వంటి పశుసంపద ఉన్నోళ్లు పొద్దుగాల్నె వాటిని పొలంకాడికి తోల్కపొయ్యి పూజ చేద్దురు. ఎడ్లగొడ్లను రంగులతోటి అలంకరిచ్చి హారతిజూపి కోడిగుడ్డు, జీలకర్ర, ఎల్లిపాయితోటి జేసిన రసాన్ని వాటికి తాగిద్దురు. ఆడికెల్లి ఊళ్లెకు తీస్కచ్చి ఆంజనేయుని గుడిసుట్టూ ప్రదిక్షిణలు చేయిచ్చి ఊర్ల తింపి ఇంటికాడికి తీస్కపోయి, ఆడ మల్లి వాటి కాళ్లు కడిగి హారతిచ్చి ఇంట్లోకి తోల్కపోదురు. ఇవన్ని జూస్తే... మనకు సాయంజేసిన వాటిని మర్చిపోకుండ, పండుగుపేరు జెప్పి ఏడాదిల ఒక్కరోజన్న మర్యాద జెయ్యాల్నని తెలిసేది. ఊర్లె అందరు గివే వంటలు వండేది దీంతోటే కాకుండ పండుగునాడు వండిన వంటలను కూరగాయలు తెచ్చిన రైతులకు, పాలమ్మేటోళ్లకు, విస్తరాకు చేసేందుకు పాలాకు తెచ్చెటోళ్లకు, పోచక్కతల్లికి పెట్టే పత్రి తెచ్చేటోళ్లకు, ఇంటిముందోళ్లకు, పక్కోళ్లకు పంచుడుతోటి...ఊర్లె అందరికి పండుగు లెక్కనే ఉండేది.

ఇగ ఇప్పుడు పద్ధతులన్ని మారినై, ఊర్లల్ల ఉండెటోళ్లు తగ్గింద్రు. ఏడుంటె ఆడనే పండుగుజేసుకునుడు ఆచారం ఐంది. ఇగ పట్నాలల్ల మట్టి దొర్కకపోతె చైనా క్లేతో గొడ్లు, ఎడ్లను తయార్జేసుడు, పొద్దుగాల్నె వాట్సప్‌ల వచ్చిన పూజచేసే పద్ధతిని చూసి ఇంట్ల పూజచేసుడు. టివిల్లల్ల చూపిచ్చే ఎడ్లను, గొడ్లను చూసి మురుసుడు. తొమ్మిది రకాల కూరలను కలిపి ఒక్కటికింద వండుడు, మిగిలిందాన్ని ఫ్రిజ్జుల పెట్టుకొని తెల్లారి ఒవెన్‌ల వేడిచేసుకొని తినుడు... గిట్ల పద్ధతి మారింది కాని పండుగు జేసుకుండు మాత్రం ఇంక మరువలేదు.

విద్యార్థులు సామాజిక శాస్త్రవేత్తలు కావాలి : ఈటల రాజేందర్

మన తెలంగాణ/ కరీంనగర్ ప్రతినిధి : దేశం శరవేగంగా అభివృద్ధి సాధించాలంటే విద్యార్థులు భవిష్యత్తులో మంచి సామాజిక శాస్త్రవేత్తలుగా ఎదగాలని రాష్ట్ర ఆర్థిక పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. ఆదివారం నాడు కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లాలో గత 2016–17 సంవత్సరంలో 10వ తరగతిలో 10 జిపిఏ, 9.8 జిపిఏ మార్కులు సాధించిన విద్యార్థులను వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలల ప్రధానోపాధ్యాయులను మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలవడం జిల్లా ప్రజలందరికి గర్వకారణంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం విషయంలో అధిక ప్రాధాన్యత నిస్తుందని అన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలికవసతుల కల్పన, మరమ్మత్తులు పరికరాల కొనుగోలుకు ఒకే రోజు 10 కోట్ల రూపాయలు మంజూరు చేయించామని తెలిపారు. అలాగే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని నియోజక వర్గాలలోని పాఠశాలలో కాంపౌండ్ వాల్స్, టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్ సదుపాయం, గేట్లు ఇతర మౌలిక సదుపాయలకు ఒక్కొక్క నియోజక వర్గానికి 45 కోట్లు మంజూరు చేశామన్నారు.



కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 40 కిలోల గంజాయి పట్టివేత

మన తెలంగాణ/ కాజీపేట : కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో 40 కిలోల గంజాయి తరలిస్తున్న నిందితున్ని అరెస్టు చేసిన ఘటన జరిగింది.ఆదివారం కాజీపేట జీఆర్‌పి పోలీస్ స్టేషన్‌లో సిఐ ఎస్ వెంకటేష్, వరంగల్ జిఆర్‌పి సిఐ జె.వెంకటరత్నం,రైళ్లలో గంజాయి అక్రమంగా తరలిస్తున్న నిందితులను విలేకరులకు చూపిస్తూ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వే ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు జిఆర్‌పి పోలీసులు రైళ్లలో తనిఖీలలో భాగంగా భువనేశ్వర్ నుంచి ముంబాయికి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహిస్తుండగా రైలులోని ఎస్9 బోగిలో అనుమానాస్పదంగా కనిపించిన ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లా, పుస్తాపూర్‌కు చెందిన గడధర్ పాండా (38) , ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లా, అమ్బుర్ఘూర్‌కు చెందిన సాన్‌స్వెన్ (46) ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లా, కోడలకు చెందిన చిత్ర సేన్ జేన(43)ఒడిశా రాష్ట్రం, గజపతి జిల్లా,చుండంగాపూర్ ప్రాంతానికి చెందిన మీనాక్షి (22) అనే నలుగురు వ్యక్తులు కాజీపేట రైల్వే స్టేషన్ పరిధిలో అదుపులోకి తీసుకుని విచారించగా 8 ప్యాకెట్లలో 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని నింధితులు ఒడిశా రాష్ట్రంలో ని బరంపురలో తక్కువ దరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలోని పూణేలో ఎక్కువ ధరకు విక్రయించేందుకు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని నింధితులపై ఎన్‌డిపిఎస్ నేరము క్రింద అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దయాకర్, శ్రీనివాస్, వైవి వెంకట్‌రెడ్డి, డి.రాజేందర్, హెడ్ కానిస్టేబుల్‌లు కృష్ణ, మధు, సురేష్, సదానందం, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో మహారాష్ట్ర మంత్రి

మన తెలంగాణ/ వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో ఆదివారం మహారాష్ట్ర ఆర్థిక, అటవీ శాఖ మంత్రి సుధీర్ సచ్చిదానంద ముంగంటివార్ కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ అర్చకులతో పాటు అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మహామంటపంలో ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందించా రు. వీరి వెంట ఆలయ అర్చకులు, అధికారులు, తదితరులున్నారు. అంతకుముందు వీరికి రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ మొక్కలను అందజేయగా, నగర పంచాయతీ అధ్యక్షురాలు నామాల ఉమ, డీఎస్పీ అవధాని చం ద్రశేఖర్ వేర్వేరుగా శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

మహిళా రిజర్వేషన్‌కు సంతకాల సేకరణ



మనతెలంగాణ/ గద్వాలన్యూటౌన్: పార్లమెంటు ఉభయ సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండు చేస్తూ ఆదివారం గద్వా ల పట్టణంలో ఎమ్మెల్యే డికె అరుణ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలతో ప్రేత్యక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డికె అరుణ మాట్లాడుతూ వ్యవస్థలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే రాజ్యంగాపరమైన అధికారంతో సాధ్యపడుతుందని పేర్కొన్నారు. అందుకోసం మ హిళలు చైతన్యవంతమై పార్లమెంటు ఉభయ సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చేలా వివిధ రూపాల్లో పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు బండల పద్మావతి, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్త్‌రన్ ఘనాఘన్

(మొదటిపేజీ తరువాయి)

జూబ్లీహిల్స్ మీ దుగా హైటెక్స్ సిటీకి పరుగు తీశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న నగరంలో ఇలాంటి వాక్‌లు ఎంతో అవసరమన్నారు. ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం కోసం ప్రతి ఒక్కరూ నడక, పరుగు అలవరుచుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో మారథాన్‌ను విజయవంతం చేసినట్టు వారు పేర్కొన్నారు.

లారీ లోడు చోరీ

(మొదటిపేజీ తరువాయి)

మరో కంటైనర్‌లో సిగరెట్‌లను డంప్ చేసుకున్నా రు. అనంతరం చౌటుప్పల్ ప్రాంతం ఓ దాబ దగ్గర డ్రైవర్ అఖిలేష్‌ను, కంటేనర్‌ను వదిలివెళ్ళిపోయా రు. దాబ నిర్వాహకుడి సహాయంతో హయత్‌నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమెదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ అఖిలేష్‌యాదవ్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

కాల్పించుకోలేదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. సానుభూతి కోసమే కాల్పులు జరిపించు కున్నానని పోలీసులు చెప్పిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ తనపై పోలీసులకు పాత కోపం ఉందని ఆరోపించారు. తానేమీ ఎమ్మెల్యేగా పోటీ చేయ లేదని, అయితే, తన తండ్రికి రాజకీయ వారసుడిని తానేనని చెప్పారు. డ్రగ్స్‌తో తనకు సంబంధం లేదని, డ్రగ్స్ కేసులో సిట్ విచారణకు హాజరైన వారిలో తన స్నేహితులు ఉన్నారని చెప్పారు. ఒడిశాలో తాను మైనింగ్ వ్యాపారం చేశానని, అక్కడ కొందరితో గొడవలు ఉన్నాయని, ఈ విషయం తెలిసిన ఒడిశా ఇంటెలిజెన్స్ పోలీసులే తనకు వెపన్ లైసెన్స్ కూడా ఇచ్చారని చెప్పాడు. తనపై జరిగిన కాల్పుల కేసుకు సంబంధించి నందు అనే వ్యక్తిపై తనకు అనుమానం ఉందని పోలీసులకు తానే చెప్పానని, ఈ కేసును కోర్టులో ఎదుర్కొంటానని విక్రమ్‌గౌడ్ చెప్పుకొచ్చారు.

మసాజ్ సెంటర్లపై దాడులు

(మొదటిపేజీ తరువాయి)

కొందరు ప్రముఖుల పుత్ర రత్నాలు ఉన్నట్లు సమాచారం. మసాజ్ సెంటర్లలో వాడిన కండమ్స్‌ను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ దాడులలో మాదాపూర్‌లోని స్పా సెంటర్లు తంత్ర, ఔరా, సప్త, రివేరా, మోహ్, బ్లిజ్ తదితర స్పా సెంటర్లను పోలీసులు సీజ్ చేశారు. అరెస్టు అయిన వారిలో ఫిజియోథెరపి డాక్టర్ బి.విజయ్‌కుమార్ (32), ఐటి ఉద్యోగులు ఎన్.ఉదయ్ కిరణ్ (30), బి.రామ్ సుందర్ (37), యూసుఫ్‌గూడకు చెందిన వ్యాపారి దీపక్ కుమార్ (25), ఎస్ఆర్‌నగర్‌కు చెందిన స్పా క్యాషియర్ తాడికొండ సౌజన్య (22), గుంటూరుకు చెందిన థెరపిస్ట్‌లు రమగ హిజౌలి (34), బాలు, రాజశేఖర్, వినయ్, సుధీర్ తదితులు ఉన్నారు. పట్టుబడిన యువతుల్ని వైద్య పరీక్షల నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రజనీ అభిమానుల సందడి

- **రాజకీయాల్లోకి రావాలని భారీ బహిరంగసభ ద్వారా డిమాండ్**

చెన్నై : సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు వేలాది మంది త్రిచిలో ఆదివారం సాయంత్రం బహిరంగ సభ నిర్వహించారు. జెండాలు, బ్యానర్లతో హడావిడి చేశారు. రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశానికి ఈ ఫ్యాన్స్ సభ స్వాగత వేదికగా భావిస్తున్నారు. తమ అభిమాన హీరో ఇక జాప్యం చేయకుండా రాజకీయాలలోకి రావాలని, అవినీతి రహిత సమాజస్థాపనకు నడుం బిగించాలని కోరేందుకు ఈ సభను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సుపరిపాలన, నదుల అనుసంధానం, అవినీతి నిర్మూలన వంటివి తమ నేత లక్ష్యాలని, ఆయన రాకతో తమిళనాట సరికొత్త రాజకీయ కోణం నెలకొంటుందని అభిమానులు విశ్వాసం వ్యక్తం చేశారు. రజనీ తరహా రాజకీయాల గురించి ఆయన అజెండా గురించి తాను వివరిస్తానని, అభిమానుల అంచనాలను రజనీకి వివరిస్తానని సమావేశానికి ముందు గాంధేయవాదిగా పేరొందిన తమిళరువిమణియన్ వెల్లడించారు. రజనీ రాజకీయ స్టయిల్ సరికొత్తగా ఉంటుందని, స్పష్టతతో నిండుకుంటుందని తెలిపారు. దక్షిణాదిలో పారే నదుల అనుసంధానం రజనీ ఆలోచన అని, అదే విధంగా పారదర్శకత, అవినీతికి తావులేని రాష్ట్రం ధ్యేయం అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఉందని, విశేషానుభవ కరుణానిధి అనారోగ్యంతో ఉన్నారని, అధికార అన్నాడిఎంకె పాలన ఏ విధంగా ఉందో అంతా చూస్తూనే ఉన్నారని చెన్నైనుంచి సభకు తరలి వచ్చిన ఓ టెక్కీ తెలిపారు. ఇప్పుడు ఉత్తమ ధీరోదాత్త నేత కావాలి. రజనీకే ఆ లక్షణాలు ఉన్నాయన్నారు. రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశం గురించి ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. అయితే తన ప్రవేశం ఎప్పుడనేది చెప్పకుండానే భారీ సినిమా షూటింగ్‌లో ఉన్నారు. ఈ సమయంలోనే ఆయన బిజెపిలో చేరడం కానీ, బిజెపి మద్దతుతో పార్టీ స్థాపించడం కానీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఫ్యాన్స్ తనకు ప్రాణం అని వారికి చెప్పే ఏదైనా చేస్తానని చెప్పే రజనీ ఇప్పుడు ఫ్యాన్స్ వీర స్థాయిలో ఏర్పాటు చేసిన సభపై ఏ విధంగా స్పందిస్తారనేది కీలకంగా మారింది.

బిజెపి విభజించి పాలిస్తోంది

మన తెలంగాణ / హైదరాబాద్ : దేశ ప్రజలను విభజించి పాలించి రాజకీయ లబ్ది పొందేందుకు బిజెపి కుట్ర చేస్తున్నదని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. లౌకికవాదానికి ప్రమాదం ఏర్పడిందని, భిన్నత్వంలో ఏకత్వంతో బతికే దేశ ప్రజల మధ్య అనేక రకాల చిచ్చులు పెడుతూ రాజకీయ స్వార్థ ప్రయోజనాలు పొం దేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 73వ జయంతి వేడు కలు టిపిసిసి ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో ఘనంగా జరిగాయి. సోమజిగూడలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి, గాంధీభవన్ లో రాజీవ్ చిత్రపటానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గాంధీభవన్ ఆవరణలో మొక్కలు నా టారు. అనంతరం నేషనల్ సాలిడారిటీ కమిటీ ఆధ్వర్యం లో ప్రకాశం హల్‌లో జరిగిన రాజీవ్ గాంధీ జయంతి సభలో ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు శాసనమండలి విపక్ష నేత షబ్బీర్ అలీ, మాజీ ఎంపీలు వి.హనుమంత రావు, ఎం. అంజన్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, మాజీ మంత్రి దానం నాగేందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎం.అనిల్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పెద్దలు ప్రజలకు స్వే చ్ఛ లేకుండా చేశారని, ఏమి తినాలో, ఏ బట్టలు కట్టుకోవా లో కూడా వారే నిర్ణయించి ప్రజలను నిర్బంధాల మధ్య బ తికేలా చేస్తున్నారని విమర్శించారు. నేడు పసి పిల్లల ప్రాణా లు పోతున్నా కూడా బిజెపి నేతలు స్పందించడం లేదని, ఆవుల గురించి ఆందోళన చెందుతున్నారని, ఆవులకు ఉ న్న ప్రాధాన్యత పసి పిల్లల ప్రాణాలకు లేకుండా పోవడం బాధాకరమన్నారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన గాంధీ, నెహ్రూ కుటుంబాల ప్రాధాన్యతను తగ్గించేందుకు ప్రస్తుత బిజెపి పాలకులు కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రధానిగా రాజీవ్‌గాంధీ మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు, సాంకేతిక విప్లవం, పంచాయితీలకు నేరుగా నిధులు తదితర విప్లవాత్మక చర్యలు తీసుకున్నారన్నారు. కాగా చార్మినార్ వద్ద రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర స్మారక సమితి అధ్యక్షులు జి.నిరంజన్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి రాజీవ్ గాంధికి నివాళులు అర్పించారు.



రూర్కీ ఐఐటి విద్యార్థి ఆత్మహత్య

హరిద్వార్: ఉత్తరాఖండ్‌లో రూర్కీ ఐఐటి విద్యార్థి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. అమన్ చౌహాన్ అనే విద్యార్థి గంగా భవన్ హాస్టల్‌లోని తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని చనిపోయినట్లు రూరల్ ఎస్‌పి మణికంఠ మిశ్రా తెలిపారు. ఎంఎస్‌సి మొదటి సంవత్సరం చదువుతున్న అమన్ చౌహాన్ ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్ వాసిగా గుర్తించారు. గత కొంత కాలంగా అమన్ చౌహాన్ మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారని మిశ్రా తెలిపారు. హాస్టల్ గదిలో ఎటువంటి సూసైడ్ నోట్ లభించలేదన్నారు. అయితే ఘటనా స్థలం నుంచి ఓ డైరీని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. అమన్ చౌహాన్ మధ్యాహ్నం నుంచి తోటి విద్యార్థులకు కనిపించకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హైవే విస్తరణ పనులు ముమ్మరం

- **డబుల్ లైన్ నుంచి నాలుగు లైన్ల పనుల్లో పురోగతి**
- **మంత్రి చీవాట్లతో కదిలిన యంత్రాంగం**

మన తెలంగాణ/ హైదరాబాద్ : పలు జిల్లాల్లో చేపడుతున్న జాతీయ రహదారుల పనులు ఊపందు కుంటున్నా యి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత తదితర కారణంతో కొద్ది మాసాలుగా హైవే విస్తరణ పనుల్లో స్థబ్దత నెలకొంది. డబుల్ లైన్ నుండి నాల్గు లైన్ల విస్తరణ పనులు ఎంతకు సాగక పోవడంపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఇటీవల సమీక్ష నిర్వహించి కాంట్రాక్టర్లు, జాతీయ రహదారుల శాఖ ఉన్నతాధికారుల తీరును త ప్పుబట్టారు. పనుల్లో అశ్రద్ధ వహిస్తే సహించేది లేదంటూ, నిర్లక్ష్యం వహించే కన్సల్టెన్సీలను బ్లాక్‌లిస్టులో పెడతామని గట్టిగానే హెచ్చరికలు జారీ చేశారు. నిర్మాణ కన్సల్టెన్సీలు ప్యాకేజీల వారీగా డిపిఆర్‌లను ఆ మోదింపజేసుకుని విస్తరణ పనుల్లో నిమగ్నమయ్యాయి.

విస్తరణ జరుగుతున్న హైవేలు ఇవే..

హైదరాబాద్ నుండి సంగారెడ్డి, గజ్వేల్ మీదుగా ముం బైకి వెళ్లే మహారాష్ట్ర జాతీయ రహదారి 161 పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సంగారెడ్డి జిల్లా స్టార్టింగ్ పాయింట్ అయిన బిహెచ్ఇఎల్ నుండి జహీరాబాద్ వర కు 100 కి.మీ రహదారిని హైవేగా విస్తరిస్తున్నారు. ప్రధానంగా సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుండి సదాశివపేట, కన్‌కోల్, చిరాగ్‌పల్లి మీదుగా 35 గ్రామాలను కలుపుతూ జహీరాబాద్ వరకు హైవే పనులు సాగుతున్నాయి. భద్రాచలం నుండి అశ్వారావుపేట, అలాగే కామారెడ్డి , నిజామాబాద్, బాసర వెళ్లే రహదారిలోనూ విస్తరణ, మరమ్మత్తు పనులు కొనసాగుతున్నాయి. కా మారెడ్డి, భీమ్‌గల్, ఆర్మూరు రోడ్లు కొద్ది రోజులుగా పాడైనట్లు గుర్తించిన రోడ్లు భవనాల శాఖ వీటి మరమ్మతులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించనున్నట్లు తెలిసింది.

కోదాడ రహదారి కూడా..

జడ్చర్ల నుండి కోదాడ రహదారి పనులను అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ఇప్పటికే జడ్చర్ల నుండి కల్వకుర్తి, అలాగే కల్వకుర్తి నుండి కొండమల్లేపల్లి రహదారి పనులను రెండుగా విభజించి టెండర్లను పూర్తి చేసిన అధికారులు వీటిని ఆరు మాసాల్లోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించింది. జడ్చర్ల, కల్వకుర్తి పనులను కడప జిల్లాకు చెందిన ఒక కాంట్రాక్టర్ చేపడుతుండగా, కల్వకుర్తి నుండి కొండమల్లేపల్లికి వెళ్లే హైవే పనులను గద్వాల మాజీ ఎంఎల్‌ఏ డికే భరతసింహారెడ్డి చేపడుతుండడం గమనార్హం. వీటితో పాటు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) కూడా తాను తెలంగాణలో చేపట్టిన హైవే పనులను వేగవంతం చేయాలని నిశ్చయించుకుంది. జాతీయ రహదారి 161లో జడ్చర్ల నుండి కర్నాటక రాష్ట్రంలోని హగ్గరి వరకు ఇప్పుడున్న డబుల్ లైన్ రోడ్లను నాల్గు లైన్లుగా విస్తరించే పనులు ముమ్మరంగా చేపట్టింది. టెండర్లు పూర్తయి నిర్మాణం కోసం ఈ హైవే ఏడాదిగా నిరీక్షిస్తోంది. జిఎస్‌టి, డిమానిటైజేషన్ పర్యవసానంగా సదరు కాంట్రాక్టర్ నూతన ధరల ప్రకారం నిధులను ఇవ్వాలని కోరుతూ పనులు పెండింగ్‌లో పెట్టారు. ఇలా ఈ హైవే నిర్మాణ పనులు నిలిచి పోవడంతో అసౌకర్యం ఏర్పడింది.

కొన్ని చోట్లే

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం విదర్భ వైపు మళ్లింది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 9.5 కిలోమీటర్ల ఎత్తులో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం చురుకుగా ఉన్నాయి. ఫలోడి, ఉదయ్‌పూర్, ఇండోర్, విదర్భ, కళింగపట్నం మార్గంలో రుతుపవన ద్రోణి పయనిస్తోంది. ఫలితంగా తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. ఆదివారం నాడు ఉత్తర తెలంగాణలోని పలు చోట్ల వర్షం కురిసింది. గత 24 గంటల్లో రెంజల్, నల్లబెల్లిలో గరిష్టంగా 19 సెంటీమీటర్ల వర్షం కురవగా, సారంగాపూర్, నిజాంసాగర్, కోటగిరిలో 17 సెంటీమీటర్లు నమోదైంది. వర్ణి, శాయంపేట, ఎల్లారెడ్డిలో 16, ఆత్మకూరు, బోధన్‌లో 15, ములుగు, గోవిందరావుపేటలో 14, నారాయణఖేడ్, రుద్రూరులో 13, పిట్లం, జుక్కల్, బాన్సువాడ, గాంధారిలో 12, మక్లూరు, బిర్కూరులో 11, కామారెడ్డి, హసన్‌పర్తి, బోథ్, నిజామాబాద్‌లో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సదాశివనగర్, ఉట్నూరు, నిర్మల్, లింగంపేట, పర్కల్, డిచ్‌పల్లి, అసిఫాబాద్, హన్మకొండ, ఎడపల్లి, తాడ్వాయి, కామారెడ్డి, నందిపేటలో 9, మాచారెడ్డి, నాగరెడ్డిపేట, మెదక్‌లో 8, దోమకొండ, మద్నూరులో 7, కమ్మర్‌పల్లి, భీంగల్, ధర్మాసాగర్, గంబీర్రావుపేట, మొగుల్లపల్లి, రామాయంపేటలో 6, ఇబ్రహీంపట్నం, చెన్నూరు, మెట్‌పల్లి, ధర్పల్లి, జఫర్‌గఢ్, నర్సంపేట, హుజూరాబాద్, భిక్నూరు, కొత్తగూడెం, భీమదేవరపల్లి, చెన్నారావుపేట, మోర్తాడు, దుబ్బాకలో 5, మంథని, కాళేశ్వరం, సిరిసిల్ల, ఖానాపూర్, జక్రాన్‌పల్లి, గూడూరు, పోచంపాడు, ఆర్మూరు, జగిత్యాల, ధర్మపురి, వెంకటాపురం, గంగాధర, అశ్వారావుపేటలో 4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. వేల్పూరు, పాలకుర్తి, భూపాలపల్లి, నర్మెట్ట, ఆదిలాబాద్, ముస్తాబాద్, సత్తుపల్లి, బాల్కొండ, కరీంనగర్, మల్యాల, లక్సెట్టిపేట, బెజ్జంకి, తిమ్మాపూర్, జులపల్లి, అశ్వారావుపేట, పర్వతగిరి, పెగడపల్లి, మేడ్చల్‌లో 3, సుల్తానాబాద్, జనగాం, మణుగూరు, కొల్లాపూర్, శామీర్‌పేట, సిర్పూర్, ఖాన్‌పూర్, పినపాక, భద్రాచలం, పేరూరు, రామగుండం, గుండాల, మోమీన్‌పేట, కోస్గి, మంచిర్యాల, వికారాబాద్, సంగారెడ్డి, కోయిడలో 2, దుమ్ముగూడెం, పాల్వంచ, మర్పల్లి, ములకలపల్లి, మక్తల్, అశ్వాపురం, ఇల్లందు, హకీంపేట, గండీడ్, కొడంగల్, పెద్దేముల్, జూలూరుపాడు, బూర్గంపాడు, భువనగిరి, తాండూరు, చంద్రుగొండ, కొత్తగూడెం, మహబూబాబాద్, శేరిలింగంపల్లి, హైదరాబాద్, దోమ, టేమ, తిమ్మాజీపేట, జడ్చర్ల, సూర్యాపేట తదితర ప్రాంతాల్లో 1 సెంటీమీటర్ వర్షం కురిసింది. ఇదిలా ఉండగా ఆదివారం నాడు రామగుండంలో 36.8 డిగ్రీల గరిష్టంగా నమోదైంది. ఖమ్మంలో 31, నల్లగొండలో 30.4 డిగ్రీల గరిష్టంగా నమోదయ్యాయి.

రోడ్లే ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

సన్నద్ధమవుతోంది. జిఐఎస్ హోమ్‌లెస్ సర్వే మొదటి దశగా హైదరాబాద్ రీజియన్‌లోని (జిహెచ్ఎంసి, కంటోన్మెంట్ మినహా) 42 స్థానిక సంస్థలు, రెండద దశగా వరంగల్ రీజియన్ పరిధిలోని 30 స్థానిక సంస్థలు, మూడవ దశలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో సర్వేను నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల పరిధిలోని ఏ ప్రాంతాల్లో నిలువ నీడలేని వారు ఎక్కువగా ఉన్నారు..? వారు ఎక్కడి నుంచి వస్తున్నారు.?, ఒకే ప్రాంతంలో ఒక సంవత్సరానికి మించి ఎక్కువగా ఉంటున్న వారిని ఈ సర్వే సంస్థ గుర్తించాల్సి ఉంటుంది. ప్రతి వారం, నెలల వారిగా సర్వే నివేదికను మెప్మాకు అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సర్వే ప్రక్రియను చేపట్టాలని ఆదేశించింది. తొలుత సర్వేను ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చేస్తే హోమ్‌లెస్ వారిని గుర్తించేందుకు సులువుగా ఉంటుందని, పైగా వారి వయసు, విద్య, వృత్తి, వివాహం, పిల్లలు, పురుషులు, మహిళల సంఖ్య ఇలా అన్ని వివరాలను సేకరించాలని మెప్మా నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పార్కులు, రైల్వే, బస్ స్టేషన్లు, ఆలయాలు, రహదారులు, జంక్షన్లు, ఖాళీ ప్రదేశాలు, వివిధ పురాతన భవనాలతో పాటు క్షేత్ర స్థాయిలో పర్యటించి జిఐఎస్ సర్వే చేపట్టనున్నారు. అయితే ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాల్లో తాత్కాలిక షెడ్లు వేసుకుని జీవనం గడుపుతున్న వారిని కూడా గుర్తించాలని మెప్మా నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న షెల్టర్ల పనితీరుపై కూడా ఆరా తీయనుంది.

వ్యాధులను గుర్తించాల్సిందే..

హోమ్‌లెస్ వారిలో వ్యాధిగ్రస్తులను కూడా గుర్తించాల్సి ఉంటుంది. ఎక్కువగా వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి అలాంటి వారి వివరాలను సేకరించాల్సి ఉంటుంది. ఏ వ్యాధితో ఎక్కువగా బాధపడుతున్నారో పూర్తి వివరాలను సేకరించాలి. అలాగే మత్తు మందులు వాడుతున్న వారిపై దృష్టి కేంద్రీకరించాలని కూడా నిర్ణయించింది. వివిధ రోగాలతో బాధపడుతున్న వారు ఎక్కువగా ఎలాంటి ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు.?, ఎక్కడ చికిత్స పొందుతున్నారనే వివరాలను కూడా సేకరించనున్నారు. హోమ్‌లెస్ వారిని గుర్తించి, వారికి తగిన బస ఏర్పాటుచేసే అంశంలో ఇది వరకే సుప్రీం కోర్టు పలు మార్గదర్శకాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. జిఐఎస్ సర్వే పూర్తికాగానే షెల్టర్ల ఏర్పాటు, వసతుల కల్పనపై కార్యచరణను రూపొందించి అమలు చేయాలని మెప్మా భావిస్తున్నది.

గురుకుల వైభవం

(మొదటిపేజీ తరువాయి)

మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని, ప్రతి విద్యార్థికి 10/10 జీపిఏ రావాలని, ఆ రకంగా ఉపాద్యాయ బృందం కృషిచేయాలని కోరారు. ప్రతి రెండు మాసాలకోసారి కలెక్టర్, అధికారులు సందర్శించి ఒక సంవత్సరం లోపు ఈ భవన సముదాయలను పూర్తిచేయించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖా మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కాలంలోనే తెలంగాణ వస్తదని, అప్పుడే తెలంగాణను ఎలా అభివృద్ధి చేయాలో ఆలోచించిన వ్యక్తి కెసిఆర్ అని తెలిపారు. మనం గర్వంగా చెప్పుకునే స్థాయికి సర్వేల్ గురుకుల పాఠశాల అభివృద్ధి చెందాలన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా విద్యను అందిస్తున్నామని తెలిపారు. భోదనా సిబ్బంది నిబద్ధతతో పనిచేయడం మూలంగా ఈ పాఠశాలలో చదివినవారు ఎంతో మంది ఐఏఎస్‌లు, ఐపిఎస్‌లు, డాక్టర్లు అయ్యారని అన్నారు. ఇక్కడ చదివే ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అంతకు ముందు ఇద్దరు మంత్రులు పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం మంత్రులకు పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గాదరి కిషోర్, కలెక్టర్లు అనితా రామచంద్రన్, సురేంద్రమోహన్, జెడ్పిటిసిలు బొల్ల శివశంకర్, పెద్దిటి బుచ్చిరెడ్డి, గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ కెవిఎన్ ఆచార్య, ఎంపిపి బుజ్జి, ఆర్‌డివో సూరజ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్‌కుమార్, ఎంపిడివో సరస్వతి, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

రైజ్‌మిల్లులు అవుతాయి

(మొదటిపేజీ తరువాయి)


అవకాశాలు లభిస్తాయన్నారు. చట్ట సభల్లో వ్యాపా ర వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే అంశం రాజ్యాంగంలో పొందు పర్చబడిందన్నారు. సిఎం కెసిఆర్ సమాజంలో ఉన్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారంలో ముందుంటున్నారన్నారు. అడగక ముందే వరాలు ఇచ్చే సిఎం కెసిఆర్ రాబోయే రోజులలో వైశ్యులు ఊహించిన దానికంటే ఎక్కువ వరాలు ఇస్తారన్నారు. రాష్ట్ర ఎస్‌సి వన భోజన వంటి కార్యక్రమాలు రాజకీయాలకు అతీతంగా,ఆనందంగా జరుపుకోవాలని వైశ్యులు స్వేచ్ఛా వ్యాపా రం చేసుకోవడంతో పాటు తోటి వారికి సహాయ సహ కా రాలు అందించాలని సూచించారు. వృత్తి సంఘాల ఏర్పాటులో రాజ కీయ జోక్యం జరిగితే నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున సంఘాల ఏర్పాటు రాజకీయాలకు అతీతంగా ఎవరికి వారే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తెలంగాణలో వైశ్యులు పెట్టిన వ్యాపార సంస్థలు మాత్రమే చివరిదాకా నిలబడుతున్నా యని ఇటువంటి వ్యాపార సంస్థల ఏర్పాటు వైశ్యులకే సాధ్యం అన్నారు.

రైతులకు బేడీలు వేసినందుకా.. కెసిఆర్‌కు అవార్డు?




మన తెలంగాణ/జగిత్యాల : తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు 2017 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో వ్యవసాయ విధాన సారధి అవార్డు ప్రకటించడం పట్ల ఆశ్చర్యం కలుగుతోందని, గిట్టుబాటు ధరల కోసం గళమెత్తిన రైతులకు బేడీలు వేసి కోర్టుకు తీసుకెళ్ళినందుకే అవార్డు ఇచ్చారా అని సిఎల్‌పి ఉపనేత, జగిత్యాల ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం జగిత్యాలలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం నిర్ణయించిన ధరలు గిట్టుబాటు కావడం లేదని, వరికి క్వింటాల్‌కు కనీసం రూ.3వేలు ఉంటేనే గిట్టుబాటు అవుతుందని, పత్తి, మిర్చి, పసుపు, పప్పు దినుసులకు క్వింటాల్‌కు రూ.10వేలు మద్దతు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించిందన్నారు. అయితే కేంద్రం ఆ విషయాన్ని ఏ మాత్రం పరిగణలోకి తీసుకోలేదన్నారు. నివేదిక పంపించడానికే పరిమితమైందే తప్ప ధరల వ్యత్యాసాన్ని కొంత మేర భరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో రైతులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని జీవన్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ, మాజీ చైర్మన్ గిరినాగభూషణం, వైస్ చైర్మన్ మన్సూర్, వైస్ ఎంపిపి మహేష్, బండ శంకర్, పుప్పాల అశోక్, కోర్టు శ్రీనివాస్, రఘువీర్ గౌడ్ పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో శశాంక్‌గోయల్



మన తెలంగాణ/బాసర: సరస్వతీ దేవి సన్నిధిలోని ఆదివారం తెలంగాణరాష్ట్ర ఎంప్లాయిస్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ శశాంక్ గోయల్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.వీరికి ఆలయాధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి గర్భగుడిలో కుంకుమార్చన, ప్రత్యేక పూజలను నిర్వహించారు. వీరికి ఆలయ అర్చకులు మహా మంగళహారతినిచ్చి ఆశీర్వదించగా ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి పూలమాలతో సత్కరించి కండువాను కప్పి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనం అనంతరం ఆలయంలో తాత్కాలికంగా పనిచేసున్న ఆవుట్‌సో ర్సింగ్ ఉద్యోగులు తమను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని పిఫ్, ఈఎస్‌ఐ అందించే విధంగా చూడాలన్నారు. ఆలయంలో 80మంది తాత్కాలిక ఉద్యోగులు గత 15సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు తమను క్రమబద్ధీకరించడం లేదన్నారు. స్పందించిన ఆయన తమ నివేదిక ప్రకారం ప్రభుత్వానికి నివేదికలను పంపుతామన్నారు. వీరి వెంట నిర్మల్ జిల్లా లేబర్ కమిషనర్ ముత్యంరెడ్డి, ఆలయ సూపరింటెండెంట్ సాయిలు, గిరిధర్, రాజేందర్, భీంరావు, విలాస్ తదితరులున్నారు.

పాముకాటుతో ఇద్దరు చిన్నారుల మృతి



మన తెలంగాణ /మదనాపురం: అన్నాదమ్ములైన ఇద్దరు చిన్నారులు పాముకాటుతో మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని నరసింగాపురం గ్రామానికి చెందిన ఆశన్న, ఈశ్వరమ్మ దంపతులకు హరికృష్ణ (10), నాగేష్ (8) ఇద్దరు కుమారులు ఉన్నారు. పిల్లలను వారి నాయినమ్మ వద్ద వదలి వీరు బతుకుదెరువు కోసం వలస కూలీకి వెళ్లారు. మనవళ్లతో నాయినమ్మ నిద్రిస్తుండగా శనివారం అర్ధరాత్రి హరికృష్ణ, నాగేష్‌లను పాము కరిచింది. దీంతో వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహిస్తుండగా హరికృష్ణ మృతి చెందాడు. మెరుగైన చికిత్స కోసం నాగేష్‌ను మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తుండగా నాగేష్ మృతి చెందాడు. మృతుల కుటుంబానికి వనపర్తి జిల్లా కలెక్టర్ శ్వేతామహంతి స్పందించి రూ. లక్షా 50 వేలను ప్రకటించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో తహశీల్దార్ సింధుజ, ఆర్‌ఐ గౌస్, సర్పంచ్ బిట్లి ఉమా యాదగిరి,కోట్ల తిరుపతయ్య, హన్మన్‌రావు,లక్ష్మణ్‌రావు,శ్రీకాంత్ ఉన్నారు.

శ్రీరాముల శ్రీనివాస్ అరెస్టు

గజ్వేల్ కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

మన తెలంగాణ/గజ్వేల్ : మావోయిస్టు మాజీ నాయకుడు శ్రీరాముల శ్రీనివాస్ అలియాస్ సుదర్శన్‌ను పోలీసులు ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. సిద్దిపేట పరిధిలో ఒక పాత కేసులో అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారని పోలీసులు తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌ను చర్లపల్లి జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా మహాజన సమాజం అనే సంస్థకు కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న శ్రీరాముల శ్రీనివాస్‌పై తప్పుడు కేసులు బనాయించి తమ సంస్థ ఎదుగుదలను అడ్డుకోవాలని చూస్తున్నారని మహాజన సమాజం రాష్ట్ర కోకన్వీనర్ బత్తుల సిద్దేశ్వర్ అన్నారు. ఆదివారం కోర్టుకు శ్రీనివాస్‌ను పోలీసులు తీసుకువచ్చిన సమయంలో అక్కడికి వచ్చిన సిద్దేశ్వర్ విలేకరులతో మాట్లాడారు. శనివారం నాగారంలో తన ఇంట్లో ఉన్న శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టుచేశారని ఆయన ఆరోపంచారు. సుమారు 30 సంవత్సరాల పాటు విప్లవ ఉద్యమంలో కొనసాగిన శ్రీరాముల శ్రీనివాస్ ఆ తర్వాత సాధారణ జీవితం గడుపుతూ పూలే, అంబేద్కర్ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండే మహాజన సమాజం అనే ఉద్యమ సంస్థలో పనిచేస్తున్నారన్నారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ వ్యవస్థాపక, గౌరవాధ్యక్షుడుగా ఉన్న ఈ మహాజన సమాజం రానున్న కాలంలో రాజకీయ పార్టీగా ప్రజల్లోకి వెళ్లనుందన్నారు. శ్రీనివాస్‌ను మహాజన సమాజం పార్టీ అభ్యర్థిగా రానున్న ఎన్నికల్లో పోటీకి దించుతామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సిద్దేశ్వర్‌తోపాటు మహాజన సమాజం రాష్ట్ర కమిటీ సభ్యులు చుక్కా కిషన్, ఎం.షకీల్ పాష ఉన్నారు.

ఎన్నికల హామీలు విస్మరించిన సర్కార్



మన తెలంగాణ/మెదక్ ప్రతినిధి : అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మెదక్ జిల్లాలో స్థానిక టిఎన్‌జివో భవన్‌లో టీ మాస్ జిల్లా సదస్సు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజు రోజుకూ కులదురహంకార హత్యలు పెరుగుతున్నాయని, ఇప్పటివరకు 21 కుల దురహంకార హత్యలుజరిగాయన్నారు. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసమని మూడేళ్ల పాలన పూర్తి అయినప్పటికీ వీటిలో ఏ ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదన్నారు. మొన్నటి నేరెళ్ల ఘటనకు బాధ్యత వహించి మంత్రి కెటిఆర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు రాష్ట్ర నాయకులు అబ్రజమల్లి మల్లేశం మాట్లాడుతూ సెప్టెంబర్ 3న మెదక్ జిల్లా లో సామాజిక దళిత, కార్మిక సంఘాలతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సామాన్య ప్రజలపై జరుగుతున్న అణచివేతను నిర్మూలించేందుకే టి మాస్ ఏర్పడిందని అన్నారు. సిఐటియు నాయకులు బాలమణి, రాజు, సామాజిక బహుజన సంఘాల నాయకులు రాధాక్రిష్ణ, సత్యనారాయణ, శ్రీనివాస్, పద్మరావు, దేవయ్య, నర్సమ్మ, బాబు, మల్లేష్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయితీ రాజ్ పటిష్టం చేయాలి

మన తెలంగాణ / హైదరాబాద్ : గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టైన పంచాయితీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయితీ రాజ్ వ్యవస్థకు అవసరమైన నిధులు విడుదల చేసి స్వపరిపాలన సాగించేలా చర్యలు తీసుకోవాలని, అందుకు సంపూర్ణ సహాయ సహకారాలు ప్రభుత్వం వైపు నుండి అందించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. గ్రామ పంచాయితీలతో పాటు మండల, జిల్లా పరిషత్‌లు నిధులు లేక విధులు కూడా నిర్వర్తించలేని దుస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని ఆయన పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కారం కావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్థానిక సంస్థలకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఇంటికే 'రేషన్' సమాచారం

- ఈ-పిడిఎస్‌కు వినియోగదారుల మొబైల్ నెంబర్ల అనుసంధానం
- నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి

మనతెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: చౌకధరల దుకాణాల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్న నిత్యావసర వస్తువులకు సంబంధించిన సమాచారాన్ని పౌరసరఫరాల శాఖ వినియోగదారులకు మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్‌ల రూపంలో అందించనుంది. ఈ సమాచారం ద్వారా సరుకుల వివరాలను వినియోగదారులు తెలుసుకుని సకాలంలో చౌకధరల దుకాణాలకు వెళ్లి సరుకులను తీసుకునే వీలు కలుగుతుంది. ఇప్పటికే ఆధార్ అనుసంధానం చేసి ఈపాస్ విధానం ద్వారా నిత్యావసర వస్తువులను పంపిణీని చేస్తున్న పౌరసరఫరాలశాఖ తాజాగా సరుకుల పూర్తి వివరాలను సైతం వినియోగదారులకు అందించేందుకు మొబైల్ ఫోన్ నెంబర్లను అనుసంధానం చేయాలని నిర్ణయించింది. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన గోదాముల నుంచి చౌకధరల దుకాణాలకు సరుకులు చేరగానే ఈ నెల స్టాక్ వచ్చినట్లు వినియోగదారుల మొబైల్ నెంబర్లకు సంక్షిప్త సమాచారం అందుతుంది. ఈ నెలకు సంబంధించిన సబ్సిడీ సరుకులు అందుబాటులో ఉన్నాయని, పని వేళల్లో చౌకధరల దుకాణానికి వచ్చి తీసుకెళ్లాలని సమాచారం వస్తోంది. ఈ సమాచారం అందిన వెంటనే వినియోగదారులు తమకు వీలున్న సమయంలో చౌకధరల దుకాణాలకు వెళ్లి సరుకులను తీసుకునే వీలుకలుగుతుంది. దీంతో వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తవు. వారి సమయం వృథా కాదు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆహారభద్రత కార్డుల్లో అందుబాటులో ఉన్న వినియోగదారులకు సంబంధించిన మొబైల్ నెంబర్లను అనుసంధానం చేసే ప్రక్రియను పౌరసరఫరాలశాఖ చేపట్టింది. ఈ నెలాఖరులోగా ఆహారభద్రత కార్డుదారుల మొబైల్ నెంబర్ సీడింగ్ ప్రక్రియను పూర్తి చేసే విధంగా అధికారులకు కసరత్తు చేస్తున్నారు. ఇదిలాఉండగా ఆహార భద్రత కార్డుల్లో ఉన్న వినియోగదారులకు సంబంధించిన సగానికిపైగా సెల్‌ఫోన్ నెంబర్లు పనిచేయడం లేదు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో 5.59లక్షల ఆహారభద్రత కార్డులుండగా, అందులో 3.12 లక్షల ఫోన్ నెంబర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 5.20 లక్షల కార్డులుండగా 1.40లక్షలు, మేడ్చల్ జిల్లాలో 4.89 లక్షల కార్డులుండగా 2.20లక్షల ఫోన్ నెంబర్లు మాత్రమే పనిచేస్తున్నాయి. ఈ కారణంగా అనుసంధాన ప్రక్రియ చేపట్టిన అధికారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నెంబర్లను అధికారులు ఈపీడీఎస్‌తో అనుసంధానం చేస్తున్నారు. మొత్తం మీద 50 శాతానికి ఫీడింగ్ పూర్తయ్యిందని పౌరసరఫరాల శాఖ వర్గాల తెలిసింది. హైదరాబాద్ జిల్లాలో పౌరసరఫరాల శాఖ విభాగంలో 55 శాతం, రంగారెడ్డి జిల్లాలో 58 శాతం, మేడ్చల్ జిల్లాలో 50 శాతం పూర్తయ్యినట్లు తెలుస్తోంది. అయితే మిగిలిన వినియోగదారులకు సంబంధించిన మొబైల్ నెంబర్లను కూడ అధికారులు సేకరించే పనిలో పడ్డారు. సెప్టెంబర్ నెలలో సరుకుల కోసం చౌకధరల దుకాణాలకు వచ్చే వినియోగదారుల నుంచి మొబైల్ నెంబర్లను తీసుకోవాలని అధికారులు డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ విధంగా సేకరించిన మొబైల్ నెంబర్లను కూడా అంచలంచెలుగా ఈపిడిఎస్‌కు అనుసంధానం చేయనున్నారు.

ప్రత్యేక యాప్‌కు రూపకల్పన

ప్రజా పంపిణీ వ్యవస్థలో సరుకుల నిల్వల తీరు తెన్నులను వినియోగదారులు స్వయంగా తెలుసుకునేందుకు వీలుగా పౌరసరఫరాల శాఖ దేశంలోనే మొట్టమొదటగా ప్రత్యేక యాప్‌కు రూపకల్పన చేసింది. దీనివలన గోదాముల నుంచి చౌకధరల దుకాణాల వరకు సరుకుల నిల్వల తీరుతెన్నులను ప్రజలు స్వయంగా తెలుసుకునే వీలు కలుగుతుంది. నిత్యావసర వస్తువుల పంపిణీలో పారదర్శకతను తీసుకుని వచ్చేందుకు ఈ యాప్ ఎంతో ఉపకరిస్తోంది.

శ్రీరాంపూర్ బొగ్గు గనుల్లో రెండు ప్రమాదాలు

ఎస్‌ఆర్‌పి3లో ట్రామర్ కార్మికుని మృతి–ఆర్‌కె5బిలో ఒకరికి తీవ్రగాయాలు



మృతి చెందిన రత్న రాజిరెడ్డి



తీవ్రంగా గాయపడిన దాసరి లచ్చయ్య

మన తెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : శ్రీరాంపూర్ ఏరియాలోని రెండు గనుల్లో ఆదివారం జరిగిన వేర్వేరు గని ప్రమాదాల్లో ఒక కార్మికుడు మృతి చెందగా మరో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఆర్‌పి3 గనికి చెందిన ట్రామర్ కార్మికుడు రత్న రాజిరెడ్డి (55) ఆదివారం తెల్లవారు జామున అండర్‌గ్రౌండ్‌లోని 3వ లెవల్‌కు సమీపంలో బొగ్గు నింపిన టబ్బులను సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు టబ్బులు కదలడంతో వాటి మధ్య ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. చెన్నూర్‌కు చెందిన రత్న రాజిరెడ్డి కుటుంబీకులకు సమాచారం అందడంతో గని వద్దకు వచ్చి కన్నీరు మున్నీరుగా విలపించారు.కోల్‌ఫిల్లర్‌గా విధులు నిర్వహించే రాజిరెడ్డికి ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే ట్రామర్‌గా విధులకు పంపించడంతో ప్రాణాలు కోల్పోయారు. మృతునికి భార్య రాజేశ్వరి, కుమారుడు సతీష్, సంతోష్, కుమార్తె సౌదర్యం ఉన్నారు. అదే విధంగా ఆర్కే5బి గనిలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన మరో ప్రమాదంలో దాసరి లచ్చయ్య తలకు తీవ్రంగా గాయాలు కావడంతో అతన్ని వెంటనే రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుండి హైదరాబాద్‌కు తరలించారు. కాగా ఒకే రోజు రెండు ప్రమాదాలు జరగడంపై టిబిజికెఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, హెచ్ఎంఎస్ నాయకులు పేరం రమేష్, సత్యనారాయణ, ఎఐటియుసి కేంద్ర కమిటీ సభ్యులు పి. బానుదాస్‌లు ఏరియా ఆసుపత్రిని సందర్శించి, యాజమాన్యం వైఖరిపై మండిపడుతున్నారు. మృతి చెందిన కార్మికునికి రూ. 50లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇటీవలి కాలంలో బొగ్గు ఉత్పత్తిపై దృష్టిని కేంద్రీకరించిన యాజమాన్యం రక్షణ చర్యలను పూర్తిగా విస్మరిస్తోందని ఆరోపించారు.

నిబంధనల మేరకే మక్కా మసీదు మరమ్మత్తులు


మన తెలంగాణ/హైదరాబాద్ : నిబంధనల మేరకే హైదరాబాద్‌లోని మక్కా మసీదుకు మరమ్మత్తుల ప్రక్రియను చేపడుతున్నామని మైనార్టీ సంక్షేమ శాఖ తెలిపింది. మక్కా మసీదు మరమ్మత్తుల నిమిత్తం పురవాస్తు శాఖ టెండర్లను ఆహ్వానించిందని, తక్కువ కోడ్ చేసిన లక్ష్మి హరికాన్ సంస్థకు రూ. 4.61 కోట్లకు పనులను అప్పగించినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఈ మరమ్మత్తు పనులను ఈనెలాఖరులోపు ప్రారంభిస్తామని స్పష్టం చేసింది. నిబంధనల మేరకే ఈ పనులు చేపడుతున్నామని తెలిపింది. మక్కామసీతు మరమ్మత్తులు, పలు సౌకర్యాల నిమిత్తం రూ. 8.48 కోట్ల వరకు వేసిన అంచనాలకు మంజూరు చేస్తూ జివో కూడా జారీ అయిందని వివరించింది.

వేతన ఒప్పందంపై చర్చలు మళ్లీ వాయిదా

24న తిరిగి ఢిల్లీలో సమావేశం

మన తెలంగాణ/గోదావరిఖని ప్రతినిధి : దేశంలోని మూడున్నర లక్షల మంది బొగ్గు గని కార్మికులకు సంబంధించిన పదవ జాతీయ వేతన ఒప్పందం తుది రూపానికి చేరుకున్నది. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో మూడు రోజుల పాటు నిర్వహించిన జెబిసిసిఐ చర్చలు శనివారం రాత్రి తిరిగి వాయిదా పడ్డాయి. ఈనెల 24న ఢిల్లీలో మళ్లీ చర్చలు జరపాలని నిర్ణయించారు. చర్చల్లో ప్రస్తుత వేతనాలపై 21శాతం వృద్ధి చేయటానికి బొగ్గు గనుల సంస్థల యాజమాన్య ప్రతినిధులు అంగీకరించినట్టు కార్మిక సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. కార్మిక సంఘాల ప్రతినిధులు 50శాతం వృద్ధిని మొదట డిమాండ్ చేస్తూ, చర్చలు, సమావేశాలు జరిగినప్పుడల్లా వేతన ఒప్పందం కుదరాలన్న సంకల్పంతో 25శాతానికి ఆ తర్వాత రాంచీలో చర్చల్లో 21శాతానికి తగ్గించి సమ్మతించారు. యాజమాన్య ప్రతినిధులు ప్రారంభంలో 9శాతం వృద్ధి మాత్రమే సాధ్యపడుతుందని భావించి ఆపై 14శాతానికి పెంచి వితండవాదం ప్రారంభించారు. సమావేశంలో పాల్గొన్న నాలుగు జాతీయ సంఘాల ప్రతినిధులు తమ వాదనలను గట్టిగా వినిపించి సమ్మె హెచ్చరిక చేయటంతో 21శాతం వృద్ధికి ఇరుపక్షాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈమేరకు కొత్త వేతన కనీస పెరుగుదల రూ. 5144 రూపాయలుగా ఉండాలనే అంగీకారం కుదిరింది. బొగ్గు గని కార్మికులకు 21శాతం వేతన వృద్ధితో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న నాలుగు శాతం అలవెన్సుల చెల్లింపు యధావిధిగా కొనసాగించాలని కార్మిక సంఘాలు చేసిన డిమాండ్‌ను యాజమాన్య ప్రతినిధులు అంగీకరించలేదు. ప్రధాన వేతన వృద్ధి 21శాతాన్ని అంగీకరించినప్పటికీ తక్కిన 4శాతం అలవెన్సు చెల్లింపులకు ఒప్పందం కుదరలేదని, అందువల్ల చర్చలు తిరిగి 24కువాయిదా పడ్డట్టు కార్మిక సంఘ ప్రతినిధి తెలిపారు. గతంలో కుదిరిన 9వ జాతీయ వేతన ఒప్పందంలో 25శాతం వృద్ధి సాధించగా 10వ వేతన ఒప్పందంలో కూడా కనీసం 25శాతం వృద్ధి సాధించాలని కార్మిక సంఘాల ప్రతినిధులు ప్రయత్నించారు. చివరికి 21శాతం వృద్ధి సాధించారు. తక్కిన 4 శాతం అలవెన్సులు సాధిస్తామని, యాజమాన్య ప్రతినిధులు అంగీకరించకపోతే దేశవ్యాపిత సమ్మె ప్రారంభిస్తామని నాలుగు జాతీయ కార్మిక సంఘాల (ఏఐటియుసి, సిఐటియు, హెచ్ఎంఎస్, బిఎంఎస్) నేతలు హెచ్చరించారు. ఐఎన్‌టియుసి నేతలు ఈ చర్చల్లో పాల్గొనటం లేదు. ఈనెల 24న ఢిల్లీలో జరగనున్న చర్చల్లో పదవ జాతీయ వేతన ఒప్పందం కుదురుతుందని కార్మిక సంఘాల నేతలు ఆశిస్తున్నారు.21శాతం వేతన వృద్ధి అమలు చేస్తే 2016 జులై 1నుంచి బొగ్గు గని కార్మికులందరికీ పెరిగిన వేతనాలు చెల్లిస్తారు. ఒక్కొక్క కార్మికునికి పదవ వేతన ఒప్పందం కింద నెలకు ఏడు వేల రూపాయల నుంచి 12వేల మేరకు వేతనాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. 21శాతం వేతన వృద్ధితో పాటు నాలుగు శాతం అలవెన్సుల చెల్లింపు సాధిస్తే బొగ్గు గని కార్మికులకు ఓ మేరకు ప్రయోజనం జరగనున్నప్పటికీ సింగరేణిలోని 50శాతం మంది కార్మికులు ప్రతీఏటా ఆదాయపు పన్ను కింద వేలాది రూపాయలు తిరిగి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని అంటున్నారు.

కొల్లగొట్టేసారు!



ప్రభుత్వ భూమిలో నాపరాతిని వెలికి తీసిన దృశ్యం



ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్ –ప్రభుత్వ ఆదాయనికి గండి

మన తెలంగాణ / తాండూర్ టౌన్ : ప్రభుత్వ భూములపై కన్నేసిన అక్రమార్కులు వందలాది ఎకరాలలో కోట్లాది రూపాయల విలువగల నాపరాతిని కొల్లగొట్టారు. ప్రభుత్వ భూములలో ఎలాంటి లీజులు పొందకుండానే అక్రమార్కులు నాపరాతిని యథేచ్ఛగా వెలికి తీసి రాయల్టీ చెల్లించకుండానే దండుకుపోయారు. ఈతంతు గత కొన్నేళ్లుగా గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు మామూళ్ళ మత్తులో మునిగి తేలారు. ఏకంగా సబ్‌కలెక్టర్ లాంటి పెద్ద సార్లు స్పందించే వరకు ఈ మైనింగ్ వ్యవహారం బయట పడలేదంటే ఎంత గుట్టుగా సాగిందో ఇట్టే అర్థమవుతుంది. గత కొన్నేళ్ళుగా ప్రభుత్వ భూములపై కన్నేసిన అక్రమార్కులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టారు.తాండూరు డివిజన్ మైనింగ్ పరిధిలోని బషీరాబాద్ మండలంలోని ఎక్మాయి గ్రామ శివారులోని సర్వేనెంబర్ 147లో సుమారు 240 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో ఎలాంటి లీజులు లేకుండా సుమారు 27మంది అక్రమార్కులు గత కొన్నేళ్ళుగా నాపరాతిని దండుకపోయారు. ఈ నాపరాతి విలువ కోట్లాది రూపాయలలో ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ లెక్కన ప్రభుత్వానికి రాయల్టీ రూపేణ రావాల్సిన ఆదాయం భారీగానే గండి పడింది. రాయల్టీ చెల్లించకుండా అక్రమార్కులు గద్దలా నాపరాతిని దండుక పోతున్నా అక్రమార్కులు అందించే నెలవారీ మామూళ్ళ మత్తులో మైనింగ్, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడక పోవడంతో వారి ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. సబ్ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తాజాగా రెండు రోజుల క్రితం అక్రమ మైనింగ్‌పై దాడులు చేయడంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టుకుంది. అక్రమ మైనింగ్‌పై కొరడా ఝుళిపించిన సబ్‌కలెక్టర్ ఏకంగా 27 మంది అనుమతులు లేకుండానే నాపరాతి వెలికి తీస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు 27 నాపరాతి కోత మిషన్‌లను, రెండు హిటాచ్‌లను సీజ్ చేయడంతో పాటు పోలీసుల సహకారంతో సీజ్ చేసిన యంత్రాలను బషీరాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్రమమైనింగ్‌పై సబ్‌కలెక్టర్ కొరడా ఝుళిపించడాన్ని తెలుసుకున్న మరి కొందరు అక్రమార్కులు నాపరాతి గనులను మూసి వేసుకోవడంతో పాటు యంత్రాలను సైతం అక్కడి నుండి తరలించడం చర్చనీయాంశంగా మారింది. అనుమతులు తీసుకున్న ఏరియా నాపరాతిని వెలికి తీయకుండా మరో ప్రాంతంలో నాపరాతిని వెలికి తీస్తూ దండుకుంటున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది.ఈ విషయం తెలుసుకున్న మండలంలోని క్యాద్గీర, నవల్గా, కొర్విచెడ్, మాసన్‌పల్లి తదితర గ్రామాలలోని ప్రభుత్వ భూములలో అక్రమ మైనింగ్ సాగుతున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఓగిపూర్,మాల్కాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూములలో అక్రమ మైనింగ్ సాగుతున్నట్లు తెలిసింది. అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌పై డ్రోన్ చక్కర్లు?

విమానాల నిలిపివేత ..దారి మళ్లింపు

న్యూఢిల్లీ : దేశ రాజధానిలోని విమానాశ్రయం గగనతలంలో డ్రోన్ విమానం చక్కర్లు కొట్టడం సంచలనానికి దారితీసింది. ఆదివారం సాయంత్రం ఏడు నుంచి ఏడున్నర ప్రాంతంలో ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణికుల విమానాలు బయలుదేరాల్సి ఉన్న సమయంలో ఆకాశంలో డ్రోన్ కన్పించినట్లు ఓ పైలెట్ ఎయిర్‌పోర్టు అధికారులకు సమాచారం అందించారు. దీనితో ఓ వైపు భద్రతా సంస్థలు హుటాహుటిన రంగంలోకి దిగాయి. వెనువెంటనే మొత్తం మూడు రన్‌వేలను మూసివేశారు. బయలుదేరాల్సిన విమానాలను కొద్దిసేపు నిలిపివేశారు. ఢిల్లీకి రావాల్సిన విమానాలను అహ్మదాబాద్‌కు, లక్నోకు దారిమళ్లించి ఆ తరువాత ఇక్కడికి అనుమతించారు. డ్రోన్ భయం నెలకొనడంతో విమానాశ్రయంలో ప్రయాణికులు చాలా సేపటి వరకూ ఏమి జరుగుతున్నదో తెలియక అయోమయానికి గురయ్యారు. టర్మినల్ 3కి సమీపంలో డ్రోన్ వంటిది సంచరిస్తున్నట్లు ఎయిర్‌ఆసియా విమాన పైలెట్ ఒకరు అలర్ట్ చేశారని, దీనితో అన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నామని ఎయిర్‌పోర్టు డిప్యూటీ పోలీసు కమిషనర్ సంజయ్ భాటియా తెలిపారు. ఈ సమాచారం గురించి అన్ని విధాలుగా ఆరాతీస్తున్నామని , దాదాపు ముప్పావు గంట బ్రేక్ తరువాత యధావిధిగా విమానాల , ప్రయాణికుల రాకపోకలు సాగుతున్నాయని వివరించారు.

అప్పటివరకూ భారత్‌లోనే తలదాచుకుంటాం!

జమ్ములో రోహింగ్యా ముస్లిం శరణార్థుల వేదన

జమ్ము: జమ్ముకశ్మీర్ గడ్డపై దశాబ్దాలుగా తిష్టవేసిన రోహింగ్యా ముస్లిం శరణార్థులను తరిమికొట్టాలంటూ ఆదేశాల నేపథ్యంలో తమ దేశంలో నిర్బంధ చర్యలను తట్టుకోలేకే భారత్‌లోని జమ్ములో తలదాచుకోవాల్సి వచ్చిందని రోహింగ్యా ముస్లింలు వాపోతున్నారు. మయన్మార్‌లో పరిస్థితులు అనుకూలించిన అనంతరం తాము తిరిగి తమ దేశానికి వెళ్లిపోతామని అప్పటి వరకూ భారత్‌లో తలదాచుకునేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. 'కొన్ని ఒత్తిళ్ల మేరకే భారత్‌లో అడుగుపెట్టాం. మాకు మరో దారి లేదు. మాకు తెలుసు ఇది మా దేశం కాదు. ప్రపంచ వ్యాప్తంగా తమ కమ్యూనిటీకి వేధింపుల నుంచి న్యాయం జరిగిన క్షణమే భారత్‌ను వదిలి మయన్మార్‌కు స్వచ్ఛందంగా వెళ్లిపోతాం' అని రోహింగ్యా శరణార్థుల శిబిరానికి అధ్యక్షుడు 35 ఏళ్ల మెహమ్మద్ యుసఫ్ స్పష్టం చేశారు. మయన్మార్‌లో నిర్బంధ వేధింపుల కారణంగా బెంగాలీ మాండలికం మాట్లాడే ముస్లిం మైనార్టీలకు చెందిన రోహింగ్యా శరణార్థులు బంగ్లాదేశ్ సరిహద్దు నుంచి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించారు. అప్పటి నుంచి రోహింగ్యా ముస్లింలు జమ్ము, సాంబ జిల్లాల్లో నివాసముంటున్నారు.

డిప్యూటీ సర్వేయర్ పరీక్షకు 78.37 శాతం హాజరు

మన తెలంగాణ/హైదరాబాద్ : డిప్యూటీ సర్వేయర్ పోస్టుల రాత పరీక్షకు 78.37 శాతం హాజరు నమోదైనట్లు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ తెలిపారు. మొత్తం 26,874 మంది అభ్యర్థులకు 21,060 మంది పరీక్షకు హాజరైనట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం 273 కేంద్రాలలో ఉదయం 10 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు పరీక్ష నిర్వహించినట్లు పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

కానిస్టేబుల్‌పై ఇసుక స్మగ్లర్ దాడి

రెండు ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత

మన తెలంగాణ / రాయికల్ : ఖచ్చితమైన సమాచారంతో ఇసుక ట్రాక్టర్‌లను అడ్డుకొని ట్రాక్టర్‌లను స్టేషన్‌కు తరలిస్తున్న ఓ కానిస్టేబుల్‌పై ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తి దాడి చేసి గాయపరిచిన సంఘటన రాయికల్ మండలం రామాజీపేట గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం జరిగింది. జగిత్యాల రూరల్ సిఐ శ్రీనివాస్‌చౌదరి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయికల్‌కు చెందిన ఓ వ్యక్తి చాల కాలంగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. ఇసుక అక్రమ రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలోనూ ఇక్కడ ఇసుక అక్రమ రవాణా జరుగుతునే ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ట్రాక్టర్‌లలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని పోలీసు స్టేషన్‌కు సమాచారం అందడంతో ఎస్‌ఐకి సమాచారం ఇచ్చి కానిస్టేబుల్ అనిల్ రామాజీపేట గ్రామ శివారులో నిఘా వేయడంతో ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి స్టేషన్‌కు తరలిస్తుండగా ట్రాక్టర్ ఓనర్ రాయికల్ కు చెందిన గోపాల్ అనే వ్యక్తి కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడి గాయపరిచినట్లు తెలిసింది. సదరు వ్యక్తి నేను అందరికి మామూళ్లు ఇస్తున్నప్పటికి నా ట్రాక్టర్‌లనే ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీస్తు కానిస్టేబుల్‌పై దాడికి దిగినట్లు తెలిపారు. కాగా ఈ సంఘటనపై సిఐ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడటమే కాకుండా పోలీసుపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

100 క్వింటాళ్ళ రేషన్ బియ్యం పట్టివేత

మన తెలంగాణ/పాల్వంచ : అక్రమంగా తరలిస్తున్న 100 క్వాంటాళ్ళ రేషన్ బియ్యాన్ని పట్టణ పోలీసులు పట్టుకున్నారు. శనివారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం నుండి పాల్వంచ వైపు వస్తున్న లారీని పట్టణ యస్‌ఐ కరుణాకర్ పట్టుకున్నారు. 200 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. లారీతో పాటు బియ్యాన్ని సీజ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కు చెందిన కొత్తపల్లి వెంకటేష్, కర్రి వెంకన్నబాబు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీ దేవిపల్లి మండలానికి చెందిన రేషన్ డీలర్ చీమల శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకున్నారు.మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

'మహానటి'లో ప్రకాష్‌రాజ్

అందం, అభినయంతో ఒక తెలుగమ్మాయి అంటే ఇలా ఉండాలి అని వెండితెరపై చూపించిన అలనాటి తార సావిత్రి. ఆ మహానటి జీవితంలోని ఊహించని మలుపులు, అనుకోని ఘటనలు చాలా మందికి తెలియదు. ఆ సందేహాలన్నీ జవాబులు లేని ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. అందుకే ఆ సందేహాలన్నింటిని తీర్చేందుకు ఆమె జీవితంపై ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు దర్శకుడు నాగ్ అశ్విన్. 'మహానటి'గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సావిత్రిగా కీర్తి సురేష్, సావిత్రి భర్త జెమిని గణేషన్ పాత్రలో దుల్కర్ సల్మాన్ నటిస్తున్నారు. ఇక సావిత్రి జీవితాన్ని ఒక దారిలో నడిపించిన ఓ నిర్మాత పాత్రకు విలక్షణ నటుడు ప్రకాష్‌రాజ్‌ను ఎంపికచేశారు. అప్పట్లో అనేక చిత్రాలకు నిర్మాత బి.నాగిరెడ్డితో సహ నిర్మాతగా కొనసాగిన అల్లూరి చక్రపాణి పాత్రలో ప్రకాష్‌రాజ్ నటించబోతున్నాడు. నాగిరెడ్డి, చక్రపాణి కలిసి విజయ బ్యానర్‌లో మిస్సమ్మ, మాయాబజార్, గుండమ్మ కథ వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. ఈ సినిమాల్లో సావిత్రి అద్భుతంగా నటించి ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఈ చిత్రంలో సమంత కూడా ఓ ముఖ్యమైన పాత్రను పోషిస్తోంది. ఈ సినిమా తెలుగులోనే కాకుండా తమిళ్, మలయాళంలో కూడా రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం అలనాటి కాలానికి తగ్గట్టుగా కొన్ని సెట్స్ వేసి అందులో నిర్విరామంగా షూటింగ్ చేస్తున్నాడు దర్శకుడు నాగ్ అశ్విన్. 'మహానటి' చిత్రాన్ని వైజయంతి ప్రొడక్షన్‌లో సి.అశ్వనీదత్ నిర్మిస్తున్నాడు.




మహేష్‌బాబు

మూడు రోజులు ముందుగానే ముగించేశారు


కొరటాల శివ దర్శకత్వంలో సూపర్‌స్టార్ మహేష్‌బాబు హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'భరత్ అనే నేను'. ఈ సినిమా తాజా షెడ్యూల్ ముందుగానే ముగిసింది. మంగళవారం ఈ షెడ్యూల్ పూర్తికావాల్సి ఉండగా శనివారానికే ఈ షెడ్యూల్‌ను ముగించారు. ఈ విషయాన్ని నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. లక్నోలో మహేష్‌బాబు షూటింగ్ సక్సెస్‌ఫుల్‌గా జరిగిందంటూ ప్రకటించారు. కానీ కొన్ని అనుమతులు దొరకకపోవడంతోనే సినిమా షూటింగ్‌ను అనుకున్న డేట్ కంటే మూడు రోజులు ముందుగానే ముగించినట్టు తెలిసింది. లక్నోలోని కొన్ని పురాతన కట్టడాలు, చారిత్రక ప్రదేశాల వద్ద షూటింగ్ ప్లాన్ చేశారు. ఆ ప్రాంతాల్లో కొన్ని యాక్షన్ సన్నివేశాలు తీయాలనుకున్నారట. అయితే పురాతత్వ శాఖ నుంచి షూటింగ్‌కు అనుమతులు రాలేదని తెలిసింది. మరోవైపు రొమేనియా వెళ్లడానికి సిద్ధమవుతున్నాడు మహేష్. కొద్ది రోజుల్లో 'స్పైడర్' యూనిట్‌తో కలిసి అతను రొమేనియా వెళ్తాడు. సినిమాకు సంబంధించి మిగిలిన ఒక్క పాటను పూర్తిచేయబోతున్నాడు. ఈ ఫారిన్ టూర్‌కు ముందు రెండు రోజులు రెస్ట్ తీసుకోవాలనే ఉద్దేశంతోనే కొరటాల సినిమా షూటింగ్‌ను మహేష్ కాస్త ముందే ముగించాడనే వాదన కూడా వినిపిస్తోంది.


నితిన్

నితిన్‌తో సంపత్ నంది చిత్రం?

ఇటీవల 'గౌతమ్ నంద' వంటి స్టయిలిష్ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చాడు దర్శకుడు సంపత్ నంది. సినిమా సక్సెస్ అయి మేకింగ్‌పరంగా బాగుందన్న పేరు వచ్చింది. సంపత్ నంది నెక్స్ట్ ప్రాజెక్ట్‌లో నితిన్ హీరోగా ఉంటాడని వార్తలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి గౌతమ్ నంద కథను ముందుగా నితిన్‌కే చెప్పాడు సంపత్ నంది. కానీ అది నితిన్‌కు నచ్చలేదు. ప్రస్తుతం సొంత బ్యానర్‌పై సినిమా చేస్తున్నాడు నితిన్. ఆ సినిమా తరువాత నిర్మాత రాధామోహన్‌తో ఓ సినిమా చేయాల్సి ఉంటుంది. సంపత్ నందితో 'బెంగాల్ టైగర్' వంటి హిట్ సినిమాను నిర్మించాడు రాధామోహన్. అందుకే మళ్లీ సంపత్‌నందిరాధామోహన్ కాంబినేషన్ వార్తల్లోకి వచ్చింది. నితిన్‌కు మరో లైన్ తయారుచేసి ఉంచాడట సంపత్ నంది. అది కనుక ఓకే అయితే నిర్మాతగా వ్యవహరించడానికి రాధామోహన్ సిద్ధంగా ఉన్నాడు. కొద్ది రోజులు ఆగితే ఈ సినిమాపై పూర్తి క్లారిటీ వస్తుంది.


సంపత్ నంది


రజనీకాంత్

అనుకున్న సమయానికే '2.0'

ప్రస్తుతం సౌత్‌లో బాహుబలిని మించిన మరో చిత్రం రాబోతోంది. శంకర్ దర్శకత్వంలో '2.0'గా తెరకెక్కుతున్న ఈ సినిమా ఎప్పుడెప్పుడు రిలీజ్ అవుతుందా అని అటు తమిళ్ సినిమా ప్రేక్షకులతో పాటు ఇటు తెలుగు ప్రేక్షకులు కూడా చాలా ఆశగా ఎదురుచూస్తున్నారు. అలాగే శివాజీ, రోబో వంటి భారీ హిట్స్ తర్వాత శంకర్ దర్శకత్వంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ ఈ చిత్రంలో నటిస్తున్నాడు. ఈ హిట్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకులు, అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. అయితే ప్రస్తుతం ఈ సినిమా రిలీజ్ ఆలస్యం కానుందనే వార్తలు వినిపిస్తున్నాయి. గ్రాఫిక్స్‌వర్క్ చాలా ఆలస్యమవుతోందని అంటున్నారు. కానీ ఈ కామెంట్లను కొట్టిపారేశారు ఫిల్మ్‌మేకర్స్. ముందుగా చెప్పినట్లుగానే వచ్చే ఏడాది జనవరి 25న '2.0' చిత్రం ఖచ్చితంగా విడుదలవుతుందని వారు చెప్పారు. దీంట్లో ఎటువంటి మార్పు ఉండదని కూడా స్పష్టంచేశారు. దాదాపు 300 కోట్లతో శంకర్ ఈ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్‌ను తనదైన శైలిలో తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ చివరి దశలో ఉండగా గ్రాఫిక్స్ వర్క్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమాలో ప్రతినాయకుడిగా బాలీవుడ్ స్టార్ అక్షయ్‌కుమార్ నటిస్తుండగా... హీరోయిన్‌గా అమీ జాక్సన్ నటిస్తోంది. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు.

మణిరత్నంతో నాని చిత్రం

యంగ్ హీరో నాని ఇప్పుడు తెలుగులో గొప్ప సక్సెస్ ఉన్న కథానాయకుడిగా రాణిస్తున్నాడు. వరుస సినిమా విజయాలతో అటు అభిమానులను ఇటు నిర్మాతలను ఆనందపరుస్తున్నాడు. నేను లోకల్, నిన్ను కోరి సినిమాల విజయాల తర్వాత చేస్తున్న 'ఎంసిఎ' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు నాని. ఈ సినిమాలో అతనికి జంటగా ఫిదా బ్యూటీ సాయి పల్లవి నటిస్తోంది. దిల్‌రాజు నిర్మిస్తున్న ఎంసిఎ డిసెంబర్‌లో విడుదలకానుంది. ఇకపోతే నాని నటిస్తున్న మరో చిత్రం 'కృష్ణార్జున యుద్ధం' వచ్చే ఏడాది వేసవిలోపు విడుదలకావచ్చని తెలిసింది. ఈ రెండు సినిమాలతో పాటు మరో బిగ్ మూవీకి కూడా ఓకే చెప్పాడట నాని. దేశంలోనే గొప్ప దర్శకుడు అయిన మణిరత్నంతో ఈ యంగ్ స్టార్ ఓ సినిమా చేయబోతున్నాడట. మణిరత్నం ఇప్పటికే నానీకి ఓ కథను వినిపించాడని... దానిని అతను ఓకే అని అన్నాడని తెలిసింది. గతంలో మణిరత్నం చిత్రం 'ఓకే బంగారం' సినిమాలో హీరో దుల్కర్ సల్మాన్‌కు తెలుగులో నాని డబ్బింగ్ కూడా చెప్పాడు. ఆ సమయంలో ఎప్పటికైనా మణిరత్నం సినిమాలో హీరోగా చేయాలని కోరుకుంటున్నట్లు నాని తెలిపాడు. ఇప్పుడు అతని కోరిక నెరవేరబోతోందట. ఇప్పుడు చేస్తున్న సినిమాలన్నీ పూర్తయిన వెంటనే మణిరత్నం ఈ సినిమాను మొదలుపెడతాడట. బహుశా వచ్చే ఏడాది చివరలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రావచ్చు.


నాని

'ఆనందో బ్రహ్మ'కు తాప్సీనే హీరో

తాప్సీ, శ్రీనివాస్‌రెడ్డి, వెన్నెల కిషోర్, తాగుబోతు రమేష్, షకలక శంకర్ ప్రధాన పాత్రధారులుగా మహి వి.రాఘవ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆనందో బ్రహ్మ'. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డిలు కలిసి నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై మంచి సక్సెస్‌ను అందుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర బృందం సక్సెస్‌మీట్‌ను ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దిల్‌రాజు మాట్లాడుతూ "సినిమా విడుదలైన మార్నింగ్ షో నుండే పాజిట్ టాక్ వచ్చింది. మంచి కలెక్షన్లు వస్తున్నాయి. నిర్మాత విజయ్ తన రెండో చిత్రంతో కూడా మంచి సక్సెస్‌ను అందుకున్నాడు. చిన్న సినిమాలు ఈరోజుల్లో ఆడడం ఎంత కష్టమో తెలిసిందే. కానీ ఈ చిత్రానికి కలెక్షన్లు పెరుగుతుండడం విశేషం. మనుషులను చూసి దెయ్యాలు బయపడటమనే కాన్సెప్ట్ కొత్తగా ఉంది. సెకండాఫ్‌లో 40 నిమిషాల పాటు ప్రేక్షకులు బాగా నవ్వుకుంటున్నారు. దర్శకుడు మహి ఈ చిత్రాన్ని బాగా తెరకెక్కించాడు. తాప్సీ ఈ సినిమాకు హీరో అని చెప్పవచ్చు"అని అన్నారు. తాప్సీ మాట్లాడుతూ "నేను ఊహించినట్టుగానే ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. నా కెరీర్‌లో ఓ స్పెషల్ మూవీగా ఇది నిలిచింది"అని చెప్పారు. నిర్మాత విజయ్ మాట్లాడుతూ "రెండు తెలుగు రాష్ట్రాల్లో సినిమాకు భారీ కలెక్షన్లు వస్తున్నాయి. ఓవర్సీస్‌లో విడుదలైన 85 థియేటర్లలో సినిమా సక్సెస్ అయి మంచి కలెక్షన్లు రావడం ఆనందంగా ఉంది. సెకండాఫ్‌ను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు"అని తెలిపారు. దర్శకుడు విజయ్ మాట్లాడుతూ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ హార్రర్ కామెడీ ఎంటర్‌టైనర్ విజయం సాధించడం హ్యాపీగా ఉందని అన్నారు.


'ఆనందో బ్రహ్మ' సక్సెస్‌మీట్‌లో తాగుబోతు రమేష్, మహి వి.రాఘవ్, తాప్సీ, దిల్‌రాజు, విజయ్ చిల్లా, రాజీవ్ కనకాల


పూజాహెగ్డే

పూజకు గురువుగా ఆ స్టార్ హీరో!

2010 సంవత్సరంలో మిస్ యూనివర్స్ సెకండ్ రన్నపర్ కిరీటాన్ని దక్కించుకున్న భామ పూజ హెగ్డే. మొదట ఫ్యాషన్ ప్రపంచంలో మోడల్‌గా ఎదిగిన ఈ భామ ఆతర్వాత పలు ప్రముఖ కంపెనీ యాడ్స్‌లో మెరిసింది. ఇక ఆతర్వాత కోలీవుడ్‌లో మొదటి సినిమా చేసి వెండితెరకు పరిచయమై పర్వాలేదనిపించుకుంది. 'ముకుందా' చిత్రంతో టాలీవుడ్‌లోకి వచ్చి ఇక్కడి ఫిల్మ్‌మేకర్స్ దృష్టిలో పడింది. అనంతరం అదృష్టవశాత్తు బాలీవుడ్‌లో స్టార్ హీరో హృతిక్ రోషన్ సరసన'మొహంజోదారో' సినిమాలో నటించే లక్కీ ఆఫర్‌ను దక్కించుకుంది. ఈ సినిమా ఫ్లాప్ కావడంతో పూజాహెగ్డే ఎంతో నిరాశచెందింది. ఈ సినిమా చేస్తున్న సమయంలోనే హృతిక్‌కు ఆమె చాలా దగ్గరైందని బాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం పూజకి హృతిక్ గురువుగా మారాడని అంటున్నారు. ఇటీవల పూజాహెగ్డే నటించిన హిట్ మూవీ 'డీజే... దువ్వాడ జగన్నాథం' తర్వాత ఆమెకు తెలుగులో మంచి అవకాశాలు రావడం మొదలయ్యాయి. అయితే బాలీవుడ్‌లో ఆమెకు ఛాన్సులు మాత్రం రావడం లేదు. దీంతో హృతిక్ రోషన్ బాలీవుడ్‌లో ఓ రెండు ఆఫర్లు పూజకు దక్కేవిధంగా రికమండ్ చేస్తున్నాడట. దీంతో వీరిద్దరి మధ్య ఏదో రిలేషన్‌షిప్ ఉందంటూ గాసిప్స్ వినబడుతున్నాయి. కొంత కాలం క్రితం హృతిక్ తన భార్య సుసానేకు విడాకులు ఇచ్చినప్పటి నుండి పూజాహెగ్డేతో సన్నిహితంగా ఉంటున్నాడనే కామెంట్స్ వినపడుతున్నాయి. అయితే ఏదో మంచితనంతోనే హృతిక్... పూజకు గురువుగా ఉంటూ ఆమెకు అవకాశాలు దక్కేవిధంగా చూస్తున్నాడని బాలీవుడ్‌లో కొందరు పెద్దలు అంటున్నారు. పూజ ఏ విషయాన్ని అయినా హృతిక్‌కు చెప్పనిదే చేయడం లేదనే టాక్ కూడా వినిపిస్తోంది.

కొత్తవాళ్లతో ఇక చేయను


తేజ

అసలు కొత్త నటీనటులను తెరకు పరిచయం చేయడం అనేది ఒక ఆర్ట్. చాలా తక్కువమంది దర్శకులు మాత్రమే అలాచేయగలరు. టాలీవుడ్‌లో టాప్ డైరెక్టర్లు కొందరు కొత్తవాళ్లను పరిచయం చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపరు. గతంలో దాసరి నారాయణరావు వంటి దర్శక దిగ్గజాలు ఎంతో మంది కొత్త నటులను ఇండస్ట్రీకి పరిచయం చేశారు. అలాంటి కోవకే చెందుతాడు దర్శకుడు తేజ. ఉదయ్‌కిరణ్, నితిన్, నవదీప్, కాజల్ అగర్వాల్, ఆర్‌పి పట్నాయక్ తదితరులకు ఆయన లైఫ్ ఇచ్చాడు. కానీ అతను ఇప్పుడు రూట్ మార్చాడట. చిత్రం, నువ్వు నేను, జయం వంటి సినిమాలను కొత్త వాళ్లతో తీసి విజయాలు కొట్టిన తేజ ఆతర్వాత చాలా ఫ్లాపులే తీశాడు. అందుకే ఇప్పుడు రానా, కాజల్ వంటి స్టార్లతో 'నేనే రాజు నేనే మంత్రి' తెరకెక్కించి మంచి హిట్‌ను అందుకున్నాడు. దీంతో తేజ కొత్తవాళ్లతో మరోసారి సినిమా చేస్తాడా అనే ప్రశ్న చాలా మందికి కలిగింది. దీనికి స్పందించిన తేజ మాట్లాడుతూ "అసలు కొత్తవారితో సినిమా చేయడం శుద్ధ దండగ. నేనేమీ అందరినీ ఉద్ధరించడానికి రాలేదు. ఈమధ్యనే నాకు జ్ఞానోదయం అయింది. కాబట్టి ఇకనుండి కథకు తగ్గ పేరున్న హీరోలనే పెట్టుకొని సినిమాలు చేస్తాను. కొత్తవాళ్లకు యాక్టింగ్ నేర్పించి ఒక ఆలోచనను తెరపై పండించడానికి చాలా కష్టపడాలి. ఒక్కోసారి అనుకున్నట్లుగా సినిమా రాదు. స్టార్స్ అయితే మన ఆలోచనలు చక్కగా తరువాతి రేంజ్‌కు వెళ్లిపోతాయి"అని అన్నాడు.

అందుకే రిజిస్టర్ మ్యారేజ్

ఒక హీరో పెళ్లి చేసుకుంటున్నాడు అంటే అది పెద్దగా చర్చకు దారితీయదు. కానీ అదే ఒక హీరోయిన్ పెళ్లి చేసుకుంటుంది అంటే మాత్రం ఎవరిని చేసుకుంటుంది, ఎప్పుడు చేసుకుంటుంది, సినిమాలు లేక చేసుకుంటుందా, పెళ్లైన తర్వాత నటిస్తుందా... ఇలా రకరకాల ప్రశ్నలు వచ్చేస్తాయి. సౌతిండియాలో పాపులర్ హీరోయిన్ ప్రియమణి తన చిరకాల ప్రియుడు ముస్తఫారాజ్‌ను పెళ్లి చేసుకోబోతున్న విషయం తెలిసిదే. ఈ నెల 23న వీరిద్దరి వివాహం జరగనుంది. కాకపోతే అందరూ అనుకుంటున్నట్లు ఘనంగా కాకుండా రిజిస్టర్ ఆఫీసులో వీళ్లిద్దరూ పెళ్లి చేసుకొని ఆతర్వాత గ్రాండ్ రిసెప్షన్ ఇస్తారట. తన పెళ్లి గురించి, ఆతర్వాత తన ప్లాన్స్ గురించి ప్రియమణి చెబుతూ... "మేము రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోవడానికి ఓ కారణం ఉంది. మా ఇద్దరి మతాలు ఒక్కటి కావు. రెండు వేరు వేరు పద్ధతులలో పెళ్లి చేసుకోవడంకన్నా ఈ రిజిస్టర్ పెళ్లి బాగుంటుందని అనిపించింది. ముస్తఫా, నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నాం. పెళ్లయిన మరుసటి రోజే గ్రాండ్‌గా ఒక రిసెప్షన్ కూడా ఏర్పాటు చేశాం"అని పేర్కొంది. అయితే తన పెళ్లయిన రెండో రోజు నుండే సినిమా షూటింగ్‌లతో బిజీ అవుతానని ప్రియమణి చెప్పింది. ఎందుకంటే తాను ఇదివరకే ఒప్పుకున్న సినిమాలు ఇంకా పూర్తిచేయాల్సి ఉందని... పెళ్లి తర్వాత కూడా సినిమాలలో నటిస్తానని ఆమె తెలిపింది.


ప్రియమణి



జూన్ త్రైమాసికంలో నిఫ్టీ-50 కంపెనీల లాభాల్లో క్షీణత

న్యూఢిల్లీ : జూన్ ముగింపు నాటికి తొలి త్రైమాసిక ఫలితాలను చూస్తే నిఫ్టీ– 50 కంపెనీల నికర ఆదాయంలో 8.4 శాతం మేరకు క్షీణత నమోదైంది. దీంతో ఆర్థిక వ్యవస్థలో బలహీనతను ప్రతిబింబించగా, మరో ఏడాది మందగమన పరిస్థితి కొనసాగే అవకాశముందనే అంచనా వెలువుడుతున్నాయి. జూన్ త్రైమాసికంలో నిఫ్టీ 50 కంపెనీల లాభం 1.8 శాతం అంచనా కంటే ఎక్కువగా 8.4 శాతం తగ్గిపోయింది. అనేక రంగాల్లో బలహీన పరిస్థితులను ఇది ప్రతిబింబిస్తోందని కోటక్ ఇనిస్టిట్యూషనల్ సెక్యూరిటీస్ వెల్లడించింది. 2018 ఆర్థిక సంవత్సరానికి తాము నిఫ్టీ– 50 కంపెనీల నికర లాభం 1.5 శాతం వృద్ధిని అంచనా వేశామని బ్రోకరేజ్ సంస్థ వెల్లడించింది. ఇన్ఫీ ప్రభావంతో శుక్రవారం స్టాక్‌మార్కెట్ కుదేలైంది. అంతర్జాతీయ సంకేతాలు బలహీనంగా ఉండడం, ఇటీవల పెరిగిన షేర్లలో లాభాల స్వీకరణతో సూచీలు క్షీణించాయి. దీంతో మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. నిఫ్టీ కీలకమైన 9,850 పాయింట్ల దిగువకు పడిపోయింది. సెన్సెక్స్ 270 పాయింట్ల నష్టంతో 31,525 పాయింట్ల వద్ద ముగిసింది. ఇన్ఫోసిస్ సిఇఒ విశాల్ సిక్కా రాజీనామా చేయడం ఈ షేర్ మీదనే కాకుండా మొత్తం స్టాక్ మార్కెట్‌పైనే తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. ఇంట్రాడేలో ఓ దశలో ఇన్ఫీ షేరు 13 శాతం వరకూ క్షీణించింది. ఆఖరికి 10 శాతం నష్టంతో రూ.923 వద్ద ముగిసింది.

ఎస్‌బిఐవే అధికం

- ఈ బ్యాంకు నుంచే అత్యధిక మొండి బకాయిలు
- 1,762 మంది ఎగవేతదారులు, రూ.25,104 కోట్ల రుణాలు
- రెండో స్థానంలో పిఎన్‌బి, రూ.12,278 కోట్ల రుణాలు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఉద్దేశపూర్వక ఎగవేతదారుల(డిఫాల్టర్లు) మొత్తం ఎక్కువగా ఎస్‌బిఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)లోనే ఉంది. 27 శాతం మొండి బకాయిలు దేశీయ అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్‌లోనే ఉన్నాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ వెల్లడించింది. మార్చి 31 ముగింపు నాటికి 1,762 మంది డిఫాల్టర్లు రూ.25,104 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీంతో బ్యాంకు బ్యాలెన్స్ షీట్‌పై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతోంది. ఎస్‌బిఐ తర్వాత అత్యంతగా మొండి బకాయిలు ఉన్న ప్రభుత్వ బ్యాంక్ పిఎన్‌బి(పంజాబ్ నేషనల్ బ్యాంక్).. ఈ బ్యాంక్‌కు 1,120 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారులు ఉండగా, వీరు దాదాపు రూ. 12,278 కోట్లకు ఎగనామం పెట్టారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఎస్‌బిఐ, పిఎన్‌బి ఈ రెండు బ్యాంకుల మొత్తం మొండి బకాయిలే రూ.37,382 కోట్లు అంటే 40 శాతం ఉండడం గమనార్హం. 2016–17 ఆర్థిక సంవత్సరం ముగింపునాటికి ఎగవేతదారుల మొత్తం రుణాలు రూ. 92,376 కోట్లుగా ఉండగా, 2015–16 ఆర్థిక సంవత్సరం ముగింపునాటికి రూ.76,685 కోట్లతో పోలిస్తే 20.4 శాతం పెరిగాయి. అదే సమయంలో ఏడాదిలో ఉద్దేశపూర్వక ఎగవేతదారులు 8,167 నుంచి 8,915 మందితో 10 శాతం పెరిగారు. మొత్తం 8,915 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు గాను 1,914 మంది డిఫాల్టర్లపై ఎఫ్ఐఆర్(ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్)ను నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదైనవారి రుణాలు రూ. 32,484 కోట్లు ఉన్నాయి. 2016–17 సంవత్సరంలో ఎస్‌బిఐ, దీని ఐదు అనుబంధ బ్యాంకులు సహా 27 ప్రభుత్వరంగ బ్యాంకులు దాదాపు రూ.81,683 కోట్లు రుణాలను మాఫీ చేశాయి. గత ఐదేళ్లలో రుణాల మాఫీ ఇదే అత్యధికం.. అదే సమయంలో 2015–16తో పోలిస్తే ఇది 41 శాతం అధికంగా ఉంది.

2017 మార్చి ముగింపునాటికి ప్రభుత్వరంగ బ్యాంకుల స్థూల ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) రూ.6.41 లక్షల కోట్లుగా ఉండగా, అంతకుముందు ఏడాదిలో ఇది రూ.5.02 లక్షల కోట్లుగా ఉంది. ఉద్దేశపూర్వక ఎగవేతదారుల పట్ల ఆర్‌బిఐ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. కొత్త నిబంధనల ప్రకారం, డిఫాల్టింగ్ కంపెనీ ప్రమోటర్ బాధ్యతల నుంచి తప్పించుకోలేడు.. ఆయన హోల్‌టైమ్ డైరెక్టర్ కానప్పటికీ తప్పించుకోవడం సాధ్యం కాదు. ఉద్దేశపూర్వక ఎగవేతదారుల పేర్లు 'నేమ్ అండ్ షేమ్' పేరిట పోటోలతో సహా పత్రికల్లో ప్రచురించేందుకు ఆర్‌బిఐ అనుమతి ఇచ్చింది.

దివాళా చట్టం కింద మొండి బకాయిదారులపై ఆర్‌బిఐ చర్యలు వేగవంతం చేసింది. భారీ మొండి బకాయిదారులైన 12 మందిపై దివాలా చట్టం కింద చర్యలు తీసుకోవాలని సంబంధిత బ్యాంకులను ఆదేశించింది. మొండి బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకోవాలని బ్యాంకులకు సూచించింది. కాగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో భారతీయ మహిళా బ్యాంక్‌తో సహా ఎస్‌బిబిజె, ఎస్‌బిఎం, ఎస్‌బిటి, ఎస్‌బిపి, ఎస్‌బిహెచ్ వంటి అనుబంధ సంస్థలను విలీనం అయ్యాయి. దీని వల్ల ఈసారి త్రైమాసిక ఫలితాల్లో ఎస్‌బిఐకి నష్టాలొచ్చాయి. జూన్ 30 ముగింపు నాటి క్యూ1(ఏప్రిల్–జూన్) ఫలితాల్లో ఎస్‌బిఐ నికర లాభం రూ.3,105.35 కోట్లు నమోదైంది. గతేడాది ఇదే త్రైమాసికంలో బ్యాంక్ లాభం రూ.867.32 కోట్లుగా ఉంది. మొండి బకాయిలు మరింతగా పెరగడం వల్ల బ్యాంక్ లాభం 20 శాతం క్షీణించింది. 2016–17 చివరి త్రైమాసికంలో స్థూల నిరర్థక ఆస్తులు 6.9శాతం ఉండగా, ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో అవి 9.97శాతానికి పెరిగాయి. నికర నిరర్థక ఆస్తులు కూడా 3.71 శాతం నుంచి 5.97 శాతం వరకూ పెరిగాయి.



సామ్‌సంగ్ గెలాక్సీ ఎ7, గెలాక్సీ ఎ5 ధరలు తగ్గింపు

న్యూఢిల్లీ: సామ్‌సంగ్ కంపెనీ రెండు మోడళ్లపై ధరలు తగ్గించింది. గెలాక్సీ ఎ7, గెలాక్సీ 5 ఫోన్లపై ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌లో మాత్రమే ఈ ధరల తగ్గింపును ఇస్తోంది. గెలాక్సీ ఎ5 ధర ఇప్పటి వరకూ రూ.26,900 ఉండగా ఇప్పుడు రూ.22,900లకు అందించనుంది. గెలాక్సీ ఎ7 ధర ఇప్పటి రూ.30,900గా ఉంది. తగ్గింపు అనంతరం రూ.25,900కు లభించనుంది. దేశంలో పండగ సీజన్ సందర్భంగా ఈ తగ్గింపు ప్రకటిస్తున్నట్లు సామ్‌సంగ్ ప్రకటించింది. ఈ ఏడాది మార్చిలో ఈ రెండు ఫోన్లను విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనిలో ఫింగర్ ప్రింట్ స్కానర్, యుఎస్‌బి సి పోర్టు, సామ్‌సంగ్ పే సపోర్టు వంటి ఫీచర్లు ఉన్నాయి. అలాగేగెలాక్సీ ఎ5 మోడల్ 5.2 అంగుళాల ఫుల్ హెచ్‌డి స్క్రీన్‌తో రూపొందగా గెలాక్సీ ఎ7 మోడల్ 5.7 అంగుళాల స్క్రీన్ కలిగి ఉంది. రెండు మోడళ్లలోనూ 3జిబి ర్యామ్, 32 జిబి ఇంటర్నల్ మెమొరీ, 3000 ఎంఎహెచ్ బ్యాటరీ, ఫ్రంట్, బ్యాక్ 16 ఎంపి కెమరా ఉన్నాయి.

రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఐపిఒ

RELIANCE
NIPPON LIFE INSURANCE

ముంబయి: దేశీయ మూడు అతిపెద్ద మ్యూచువల్ ఫండ్ మేనేజర్ రిలయన్స్ నిప్పాన్ లైఫ్ అస్సెట్ మేనేజ్‌మెంట్ ఐపిఒ(ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్) రానుంది. దీనికి సంబంధించిన పత్రాలను క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. షేర్ల విక్రయం ద్వారా దాదాపు 18,00 కోట్లు సేకరించినట్లు కంపెనీ ప్రకటించింది. ఇష్యూ లో భాగంగా 2,44,80,000 ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నారు. రిలయన్స్ క్యాపిటల్ 1,12,30,200 షేర్లను, 2,54,89,800 షేర్లను నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయిస్తాయి.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27590	29508.02	-0.72%
ముంబై	28550	30534.76	1.31%
ఢిల్లీ	28100	30053.48	0.72%
కోల్‌కతా	28430	30406.42	0.74%
కేరళ	27100	28983.96	0%
బెంగళూరు	27300	29197.86	- 0.36%
హైదరాబాద్	27590	29508.02	- 0.61%
గల్ఫ్	1367.44	1462.50	0.15%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	శనివారం	శుక్రవారం	మార్పు (%)
చెన్నై	42600.00	42300.00	0.71
ముంబై	42600.00	42300.00	0.71
ఢిల్లీ	42600.00	42300.00	0.71
కోల్‌కత్తా	42600.00	42300.00	0.71
హైదరాబాద్	42600.00	42300.00	0.71




కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	362
వరంగల్	357	చిత్తూరు	390
విజయవాడ	359	చెన్నై	397
గోదావరి	359	బెంగళూరు	382

ఇన్ఫీకి కొత్త సిఇఒ శోధన కష్టమైందే..

- నారాయణ మూర్తిని మెప్పించ గలిగేవారెవరు?
- ఎంపిక అంత సులువేమీ కాదంటున్న నిపుణులు



న్యూఢిల్లీ : ఇన్ఫోసిస్‌కు కొత్త సిఇఒ పదవి నుంచి విశాల్ సిక్కా వైదొలగడానికి గల కారణాలు చూస్తుంటే కంపెనీకి కొత్త సిఇఒ ఎంపిక అంత సులువేమీ కాదని నిపుణులు అంటున్నారు. సంస్థ వ్యవస్థాపకుల పరిశీలనలో కొత్త సిఇఒ ఎంపిక కత్తిమీద సాములాంటిదేనని, ఇది ఎంతో ఒత్తిడితో కూడుకున్నదని పేర్కొంటున్నారు. సిక్కా వ్యవస్థాపకుల ఒత్తిడితోనే రాజీనామా చేశారని ఆరోపణలు ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఈ అత్యున్నత పదవికి కొత్త వ్యక్తిని ఎంపిక చేయడం సాధారణ విషయం కాదని పరిశ్రమ వర్గాలు, నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వ్యవస్థాపకుడు ఎన్‌ఆర్ నారాయణ మూర్తిపై పలు విమర్శలు చేసిన కంపెనీ బోర్డు వచ్చే ఏడాది మార్చి 31న కొత్త సిఇఒ నియామకం ఉంటుందని స్పష్టం చేసింది. అప్పటి వరకు తాత్కాలిక సిఇఒగా యుబి ప్రవీణ్ రావ్ కొనసాగుతారు. కంపెనీలో కీలక నిర్ణయాలు తీసుకోవడానికి శాశ్వత సిఇఒ, ఎండి తప్పనిసరి, ఈ నేపథ్యంలో ఈ పదవికి ఎవరిని నియమించాలనే అంశం పరిశ్రమలో ఆసక్తికరంగా మారింది. నిరాధార తప్పుడు ఆరోపణలు, వ్యక్తిగత దూషణ కారణంగానే తాను బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నానని రాజీనామా సందర్భంగా సిక్కా అన్నారు. దీంతో ప్రస్తుతం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సిఒఒ)గా ఉన్న ప్రవీణ్‌రావు తాత్కాలిక సిఇఒగా మార్చి 31, 2018 వరకూ ఆ హోదాలో కొనసాగుతారు.

తొలి వ్యవస్థాపక సిఇఒ విశాల్ సిక్కా సమర్థవంతంగా పనిచేసినప్పటికీ ఒత్తిడి కారణంగా వైదొలగాల్సి వచ్చింది. అయితే మళ్లీ కొత్త సిఇఒ వేటను కంపెనీ ప్రారంభించింది. ఈసారి సమర్థుడైన వ్యక్తికోసం ఇన్ఫోసిస్ చూడవచ్చని, అది బయట వ్యక్తి కూడా కావచ్చని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. అదే సమయంలో అంతర్గతంగా ఉన్న వ్యక్తిని సిఇఒ పదవికి ఎంపిక చేసే ఆలోచనను కొట్టి పారేయలేమని చెబుతున్నాయి. చాలా అంశాలను పరిగణనలోకి తీసుకొని సిఇఒ ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఇది ఎంతో నమ్మకమైన, తేలికైన విషయమైనా ఇబ్బందులు, మనస్పర్థలకు దారితీస్తుందంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త సిఇఒ కోసం శోధించడం కొంత కష్టమైన పనే అని ఐటీ రంగానికి చెందిన నిపుణులు ప్రమోద్ భాసిన్ అభిప్రాయపడ్డారు. కంపెనీలోని వాటాదారులు, అటు బోర్డు అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కొత్త సిఇఒ ఎంపిక ప్రక్రియను ఇన్ఫోసిస్ వేగవంతం చేయాలని, అదే సమయంలో వ్యాపారాభివృద్ధి కొనసాగించడం అవసరమని మరో నిపుణుడు గణేష్ నటరాజన్ పేర్కొన్నారు. విశాల్ సిక్కా సంస్థను వీడవచ్చని, ఈ పరిస్థితుల్లో కంపెనీలో నెలకొన్న పరిస్థితులు, సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనగల వ్యక్తిని వెతికి పట్టుకోవాలని అన్నారు.

ఎల్‌ఐసి కొనుగోలు జాబితాలో ఇన్ఫీ స్టాక్



ముంబయి: ఇన్ఫీ సిఇఒ సిక్కా రాజీనామా చేయడంతో అంతా షేర్లను అమ్మేస్తుంటే.. ఎల్ఐసి మాత్రం కొనుగోళ్లు చేపట్టింది. ఈ నెలలో తమ స్టాక్స్ కొనుగోలు జాబితాలో సంక్షోభంలో ఉన్న ఇన్ఫోసిస్ స్టాక్ ఉందని ఎల్ఐసి(లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) వెల్లడించింది. ఈ కంపెనీ షేర్ల కొనుగోలును ఆగస్టులో కొనసాగిస్తామని, ఇప్పటికే శుక్రవారంనాడు వేలాది షేర్లను కొనుగోలు చేశామని పేర్కొంది. సిక్కా రాజీనామాతో షేరు విలువ 13 శాతం పడిపోయి తక్కువ ధరలో ఉన్న ఇన్ఫీ షేరును కొనుగోలు చేశామని కంపెనీ తెలిపింది. శుక్రవారం ఇన్ఫీ షేరు దాదాపు 11 శాతానికి పైగా పతనమవడంతో సూచీలు అతలాకుతలం అయ్యాయి. గంటల్లోనే ఇన్వెస్టర్లకు చెందిన 27వేల కోట్ల రూపాయలు ఆవిరయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలి? ఇన్ఫీ వద్దనుకుంటే మరే ఇతర ఐటి షేర్లను పరిశీలించాలి? అన్న అంశాలపై ప్రముఖుల సలహాలు ఇలా ఉన్నాయి. సిక్కా వైదొలగడం దురదృష్టకరమని, ప్రస్తుతం చోటు చేసుకున్న ఒడిదుడుకులు సద్దుమణిగేందుకు సుమారు ఏడాది సమయం పట్టొచ్చని ఐడిబిఐ క్యాపిటల్‌కు చెందిన ఎ.కె ప్రభాకర్ అంటున్నారు. ఇన్ఫీ షేరున్న ఇన్వెస్టర్లు చిన్నపాటి బౌన్స్‌బ్యాక్ వద్ద వైదొలగడం మేలని, ఇదే రంగంలోని టాటా ఎలెక్సి, పెరిసిస్టెంట్, సైయంట్ షేర్లను పరిశీలించవచ్చని తెలిపారు.

హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్‌కు చెందిన వి.కె. శర్మ సలహా ప్రకారం, సిక్కా ఉన్నప్పుడు ఇన్ఫీషేరు సూచీలను మించి రాబడులు ఇచ్చాయని, సిక్కా తప్పుకోవడంతో ఆయన నిర్దేశించిన 2020 నాటికి 2000 కోట్ల డాలర్ల లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యమని చెప్పొచ్చని అన్నారు. బైబ్యాక్ ప్రస్తుత షేరు పతనాన్ని కొంతమేర అడ్డుకున్నా, ఇన్వెస్టర్లు ఈ సమయాన్ని షేరును వదిలించుకోవడానికి ఉపయోగించుకోవాలని అన్నారు.

రూ.54,968 కోట్లు పెరిగిన 8 కంపెనీల ఎం-క్యాప్



ముంబయి : గత వారం టాప్–10 బ్లూచిప్ కంపెనీల్లో ఎనిమిది సంస్థ మార్కెట్ విలువ(ఎం– క్యాప్) రూ.54,968.17 కోట్లు పెరిగింది. ఐటిసి, హెచ్‌యుఎల్ కంపెనీలు అత్యధికంగా లాభపడ్డాయి. ఇక టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్, ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్‌బిఐ నష్టాలను చవిచూశాయి. ఇక మిగిలిన కంపెనీల్లో ఆర్ఐఎల్, టిసిఎస్(టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్), హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వంటి సంస్థలు భారీగా మార్కెట్ విలువను పెంచుకున్నాయి. ఎఫ్ఎంసిజి దిగ్గజం ఐటిసిసి అత్యధికంగా రూ.12,559.75 కోట్ల మార్కెట్ విలువ పెరగడం ద్వారా ఆ సంస్థ విలువ రూ. 3,43,120.21 కోట్లకు చేరింది. హెచ్‌యుఎల్‌లో రూ. 10,140.52 కోట్లతో రూ.2,59,670.81 కోట్లకు పెరిగింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.9,381.74 కోట్లతో రూ. 2,07,250.02కు మార్కెట్ విలువ చేరింది. ఐటిసి తొలిసారి టాప్ టెన్ జాబితాలో చోటు దక్కించుకుని.. రూ. 7,042.02 కోట్ల మార్కెట్ విలువ పెరగడంతో మొత్తం ఎం–క్యాప్ రూ.2,07,250.02 కోట్లు అయ్యింది. ఇన్ఫోసిస్‌లో నెలకొన్న పరిస్థితుల ప్రభావం ఆ కంపెనీ షేర్లపై పడింది. విశాల్ సిక్కా రాజీనామాతో కంపెనీ షేరు విలువ దాదాపు 10శాతం మేర పడిపోయింది. ఎస్‌బిఐ రూ. 1,726.41 కోట్లు కోల్పోవడం ద్వారా బ్యాంకు విలువ రూ. 2,40,532.08 కోట్లకు చేరింది. గత వారంలో సూచీలు లాభాల్లో సాగినా ఆఖరి రోజు ఇన్ఫీ సిఇఒ సిక్కా రాజీనామాతో కొంత అలజడి రేగింది. మొత్తం స్టాక్ మార్కెట్‌పైనే తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. దీంతో సెన్సెక్స్ 270 పాయింట్ల నష్టంతో 31,525 వద్ద ముగిసింది.



జీరో ఛార్జీలతో వెబ్‌లోనూ కోటక్ 811 సేవలు

మన తెలంగాణ / హైదరాబాద్ : వినియోగదారుల సౌలభ్యం కోసం కోటక్ మహింద్రాబ్యాంక్ తాజాగా కోటక్ 811 సేవలను జీరో ఛార్జీలతో వెబ్‌లోనూ అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటి వరకు కోటక్ 811ను జీరో బ్యాలెన్స్ అకౌంట్‌గా గూగుల్ ఆన్‌లైన్ యాప్ ద్వారానే సేవలను అందించేది. జీరో బ్యాలెన్స్ అకౌంటే కావడంతో వినియోగదారులు కేవలం 5 నిమిషాల్లోనే ఖాతాలను ఓపెన్ చేసుకుని లావాదేవీలను నిర్వహించుకుంటున్నారని ఆ బ్యాంక్ సీనియర్ ఇవిపి అంబుజ్ చాంద్‌నా ఒక ప్రకటనలో తెలిపారు.

నవజాత శిశువుల కోసం అబాట్ పోషకాహారం

మన తెలంగాణ / హైదరాబాద్ : నవజాత శిశువులకు విస్తృత పోషకాహారాన్ని అందించేందుకు న్యూట్రిషన్ సైన్స్ పరిశోధన, అభివృద్ధి సంస్థ అబాట్ మార్కెట్‌లోకి అబాట్ న్యూట్రిషన్ మెటబాలిక్ ఫార్ములాస్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రమాణాలతో డైట్ ఫర్ లైట్ ఇనిషియేటివ్ కింద ఐఈఎం న్యూట్రిషన్ ఉత్పాదనలను ఆవిష్కరించినట్లు అబాట్ బిజినెస్ ఇండియా జిఎం అమల్ కెల్షికర్ ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారుల్లో మెటబాలిజం లోపాల నివారణ ఈ న్యూట్రిషన్ ఫుడ్ ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు.

విమానాల సంఖ్యను పెంచనున్న ట్రుజెట్

న్యూఢిల్లీ: ట్రూజెట్ ఎయిర్‌లైన్స్ విమానాల సంఖ్యను మరింత పెంచాలని నిర్ణయించింది. ఈ సంస్థకు సినీనటుడు రామ్‌చరణ్ తేజ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. దేశీయంగా 18 విమానయాన మార్గాల్లో ఈ సంస్థ సేవలందిస్తుండగా, విమానాల సంఖ్య పెంపుపై దృష్టిపెట్టింది. 2018 మార్చి నాటికి రోజుకు 50 సర్వీసుల చొప్పున ఎనిమిది విమానాలను నడపాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఈ సంస్థకు ప్రమోట్ చేస్తున్న టర్బో మేఘా సంస్థ ప్రస్తుతం విమానాలను నడుపుతోంది. వీటిల్లో నాల్గింటిని ఉడాన్ పథకం కింద నిర్వహిస్తోంది. ప్రస్తుతం మా వద్ద ఐదు ఏటీఆర్ విమానాలు ఉన్నాయని, వీటిల్లో నాలుగు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని టర్బో మేఘా ఎండి వి.ఉమేష్ తెలిపారు. కంపెనీ వృద్ధి పథాన నడుస్తున్న నేపథ్యంలో విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. ఈ ఏడాది వీటిసంఖ్యను ఎనిమిది వరకు పెంచాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామన్నారు. ట్రూజెట్ ఇప్పటికే హైదరాబాద్–కడప, హైదరాబాద్–నాందేడ్, నాందేడ్–ముంబయి మార్గాల్లో సర్వీసులు నడుపుతోంది.

ప్రధానికి మాత్రమే అనుకూలం.. అమిత్ షాకు కాదు : మమత



కోల్‌కతా: పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టికి వ్యతిరేకంగా మొన్నటి వరకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఒక్కసారిగా తన వైఖరిని మార్చుకున్నట్లు కనిపిస్తోంది. మోడీకి బదులుగా బిజెపి అధ్యక్షుడు అమిత్ షాపై ఆమె విమర్శనాస్త్రాలను సంధిస్తున్నారు. ఓ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా పై మమత తీవ్రంగా మండిపడ్డారు. తాను నరేంద్ర మోడీకే అనుకూలం కానీ, అమిత్ షాకు కాదన్నారు. తాను ప్రధానిని నిందించలేదని, అయినా ఆయనను ఎందుకు నిందిస్తానని ప్రశ్నించారు. దేశంలో నియంతృత్వ వాతావరణం పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందని, దానికి వ్యతిరేకంగా పోరాడడంపైనే తాము ప్రధానంగా దృష్టి సారించామన్నారు. నియంతృత్వం పెరగడానికి ప్రభుత్వ వ్యవహారాల్లో బిజెపి అధ్యక్షుడు జోక్యం చేసుకోవడమే కారణమని మమత పరోక్షంగా అమిత్ షాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిపై బెంగాల్ సిఎం ప్రశంసల వర్షం కురిపించారు. అతను కూడా బిజెపి పార్టీకి చెందిన వారేనని, అయితే వాజ్‌పేయి నిష్పక్షపాతంగా, సమతుల్యతను పాటించేవారని మమత పేర్కొన్నారు. ఆయనతో కలిసి పనిచేశామని, ఎప్పుడూ ఎలాంటి సమస్యను కూడా ఎదుర్కోలేదన్నారు.

నోట్ల రద్దుతో వాళ్లకు కష్టాలు



లక్నో : జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) తీసుకుంటున్న చర్యల కారణంగా జమ్మూకశ్మీర్‌లో రాళ్లు రువ్వే ఘటనలు తగ్గాయని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గత మూడేళ్లుగా నక్సలిజం, ఉగ్రవాదం, తీవ్రవాదం కూడా తగ్గుముఖం పట్టిందని చెప్పారు. ఆదివారం ఆయన ఎన్ఐఎ కార్యాలయం, రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లను ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్ఐఎ ఇప్పుడు కీలక భూమిక పోషిస్తోందని, అందువల్లనే జమ్మూకశ్మీర్‌లో రాళ్లు రువ్వే ఘటనలు తగ్గిపోయాయన్నారు. దేశ భద్రత కోసం తీసుకుంటున్న చర్యలతో నక్సలిజం, ఉగ్రవాదం, తీవ్రవాదంలపై గెలుపు సాధించామని అన్నారు. ఈశాన్య భారతంలో తీవ్రవాదం 75 శాతం తగ్గిందని, ఇదే సమయంలో నక్సలిజం 35–40 శాతం పడిపోయిందని వివరించారు. కాగా, జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదుల కార్యకలాపాలను నిరోధించడంలో ఎన్ఐఎ చురకుగా పనిచేస్తోందని రక్షణ మంత్రి అరుణ్‌జైట్లీ ప్రశంసించారు.

వచ్చే ఏడాది ఆన్‌లైన్‌లోనే జెఇఇ

న్యూఢిల్లీ : ఐఐటిల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జెఇఇ) వచ్చే ఏడాది నుంచి ఇక పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. ఈ మేరకు జాయింట్ అడ్మిషన్ బోర్డు (జెఎబి) ఆదివారం నిర్ణయం తీసుకుంది. ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరగోరు విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలో అర్హత సాధించాక, జెఇఇ మెయిన్స్‌ను పూర్తి చేయాల్సివుంటుంది. అయితే ప్రభుత్వం ఇప్పటికే మెయిన్స్ టెస్ట్ ఆన్‌లైన్ ఆప్షన్‌ను ప్రవేశపెట్టింది. సామగ్రి తరలింపు, మూల్యాంకనాలను సరళీకృతం చేసేందుకు గాను ఇప్పుడు జెఇబి కూడా ఈ నిర్ణయాన్ని అడ్వాన్స్‌డ్ పరీక్షకు వర్తింపజేయాలని నిశ్చయించింది. 1.3 మిలియన్ల మంది మెయిన్స్ పరీక్షకు హాజరవుతుండగా, ఇందులో రెండు లక్షల మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత పొందుతున్నారు. వీరంతా ఇప్పుడు ఆన్‌లైన్ పరీక్షను రాయాల్సివుంటుంది.

లిమ్కా బుక్‌లోకి జెఇఇ ర్యాంకర్



న్యూఢిల్లీ: జెఇఇ మెయిన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కల్పిత్ వీర్వల్‌కు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఉదయ్‌పూర్‌కు చెందిన కల్పిత్ గత జెఇఇ మెయిన్స్‌లో ఎవరూ హించని విధంగా 100 శాతం మార్కులు సాధించాడు. 360 మార్కులకు గాను 360 మార్కులు సాధించి అందర్నీ అబ్బురపరిచాడు. ప్రస్తుతం ఇతను ముంబయి ఐఐటిలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. జెఇఇ మెయిన్స్‌లో 100 శాతం ప్రతిభ కనపర్చినందుకు గాను 'ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్స్' కింద ఇతనికి ఈ పురస్కారం లభించనుందని లిమ్కా బుక్ అధికారులు తెలిపారు. 'నాకు కచ్చితంగా మంచి మార్కులు వస్తాయని తెలుసు కానీ 360 కి 360 మార్కులు సాధిస్తానని అనుకోలేదు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు వస్తుందని కలలో కూడా హించలేదు' అని కల్పిత్ అన్నాడు.

పెట్టుబడిదారుల చేతుల్లో బిజెపి

లక్నో: పెట్టుబడిదారుల కనుసన్నల్లో అధికార బిజెపి నడుచుకుంటున్నదని బిఎస్‌పి అధినేత్రి మాయావతి ధ్వజమెత్తారు. ఆ పార్టీకి అందిన నిధుల వివరాలను ఓ ఎన్‌జిఓ విడుదల చేయడంతో ఈ విషయం నిరూపితమవుతోందని ఆమె విమర్శించారు. బిజెపి ఒక పెట్టుబడిదారి పార్టీ అని, అది పెట్టుబడిదారుల చేతిలో ఉందన్న భావన ప్రజల్లో బలంగా ఉందని అన్నారు. ఈ భావన నిజమేనని ఎన్‌జిఓ విడుదల చేసిన వివరాలతో తేటతెల్లమైందని మాయావతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిజెపి2012–2016 మధ్య కాలంలో పెట్టుబడిదారుల నుంచి రూ.708 కోట్లను స్వీకరించిందని అసోసియేషన్స్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) పేర్కొన్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఈ నిధులు మొత్తం విరాళాల్లో 92 శాతమని వివరించారు. తమ పార్టీకి 10.12 కోట్ల సభ్యులున్నట్టుగా బిజెపి చెప్పుకోవడంలో ఏమాత్రం నిజం లేదని విమర్శించారు.

భారతీయులకు పాక్ పౌరసత్వం

ఇస్లామాబాద్ : గత ఐదేళ్లలో కనీసం 298 మంది భారతీయులకు పాకిస్తాన్ పౌరసత్వం లభించింది. '2012 నుండి ఏప్రిల్ 14, 2017 వరకు మొత్తం 298 మంది ప్రవాస భారతీయులకు పాకిస్తాన్ పౌరసత్వాన్ని మంజూరు చేశాం' అని పాకిస్తాన్ హోం మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. 2012లో 48 మంది, 2013లో 75 మంది, 2014లో 76 మంది పాకిస్తాన్‌లోని ఎన్నారైలు ఆ దేశ పౌరసత్వం పొందారు. ఇక 2015లో 15 మందికి, 2016లో 69 మందికి, ఈ ఏడాది ఏప్రిల్ 14 వరకు 15 మంది భారతీయులకు తమ దేశ పౌరసత్వాన్ని మంజూరు చేశామని పాకిస్తాన్ తెలిపింది. పాకిస్తాన్‌లో నివసించే ప్రవాసులు ఆ దేశ పౌరసత్వం పొందడం చాలా కష్టమని భావిస్తుంటారు. కానీ, ప్రత్యేకించి భారత్, ఆఫ్గనిస్తాన్, బంగ్లాదేశ్, బర్మా లాంటి అనేక దేశాల ప్రజలు పాకిస్తాన్‌లో చట్టవిరుద్ధంగా ఉంటున్నారని ఆ ప్రకటన పేర్కొంది.


కేరళలో 9 లక్షల సభ్యత్వాలు లక్ష్యం

న్యూఢిల్లీ : కేరళలో విస్తరించేందుకు దూకుడుగా వ్యవహరించాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నిర్ణయించింది. 2019 కల్లా రాష్ట్రంలో 9 లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు వెళ్లనుంది. కేరళలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై దాడులు పెరిగిపోతున్నాయని సీనియర్ నేత జె నందకుమార్ పేర్కొన్నారు. ఇలాంటి దాడులు జాతి, సమాజం పట్ల కట్టుబడి ఉండేందుకు మరింతగా బలాన్నిస్తాయన్నారు. రాష్ట్రంలో అందరికీ అభివృద్ధి ఫలాలు అందేలా చేయాలని తమ సంస్థ నిర్ణయించిందని ఆయన చెప్పారు. అందుకు అనుగుణంగా తాము మరింత దూకుడుగా తమ పనులను కొనసాగిస్తామని ఆయన చెప్పారు. 2019 కల్లా 9 లక్షల సభ్యత్వాలను చేర్చుకోవడమే తాము లక్ష్యాంగా పెట్టుకున్నామన్నారు.

పిసిసి చీఫ్‌కు తృటిలో తప్పిన ముప్పు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (డబ్ల్యుబిపిసిసి) అధ్యక్షుడు ఆధిర్ రంజన్ చౌదరి ఆదివారం తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. తాను ప్రయాణిస్తున్న కారును ముర్షిదాబాద్ జిల్లాలో ఓ కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదం నుంచి చౌదరి, అతని కారు డ్రైవర్ సురక్షితం గా బయటపడ్డారని ముర్షిదాబాద్ ఎస్‌పి ముఖేష్ పేర్కొన్నారు. కోల్‌కత్తా నుంచి మాజీ కేంద్రమంత్రి ముర్షిదాబాద్ జిల్లాలోని రఘునాథ్ గంజ్‌కు కారులో వెళ్తుండగా, మధ్యాహ్నం 3.10 గంటల సమయంలో రెజినగర్ చెక్‌పోస్టు సమీపంలో ఎదురుగా వచ్చిన కంటైనర్ ఆయన వాహనాన్ని సైడ్ నుంచి ఢీకొట్టిందని ఎస్‌పి చెప్పారు. ప్రమాదం అనంత రం చౌదరి మీడియాతో మాట్లాడుతూ ఘటన సమయంలో తాను నిద్రపో తున్నానని, తమ డ్రైవర్ చాకచక్యంగా ప్రమాదం నుంచి తప్పించా డన్నారు. లేకపోతే చెడువార్త వినాల్సి వచ్చేదని చెప్పారు.



పట్టాలు తప్పుతున్న రైల్వే

ఐదేళ్లలో ప్రమాదాలు 586
53 శాతం పట్టాలు తప్పడం వల్లే

న్యూఢిల్లీ: గడచిన ఐదేళ్లలో సంభవించిన 586 రైలు ప్రమాదాల్లో 53 శాతం రైళ్లు పట్టాలు తప్పడం వల్లే సంభవించాయని అధికారిక గణాంకాలు వెల్లడించాయి. పశ్చిమ యుపిలోని ముజఫర్‌నగర్‌కి సమీపంలో శనివారం చోటుచేసుకున్న ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి కూడా ఇదే కారణం. ఈ ప్రమాదంలో సుమారు 23 మంది మరణించగా వందమందికి పైగా గాయపడిన సంగతి విదితమే. ఒకవైపు రైల్వే శాఖ భద్రత పరంగా పలు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, మరోవైపు ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉండటం ఆందోళనకరం. నవంబరు, 2014 నుండి ఇప్పటివరకు 20 రైలు ప్రమాదాలు సంభవించాయి. వాటిలో చాలా వరకు స్వల్పమైనవే. నవంబరు 20, 2016న కాన్పూర్‌కి సమీపంలో ఇండోర్–పాట్నా ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఈ ఘోర రైలు ప్రమాదంలో 150 మంది మరణించగా మరో 150 మందికి పైగా గాయపడ్డారు. ఈ ప్రమాదానికి ప్రయాణికుల రద్దీ ఎక్కువ కావడం, పట్టాలు స్వల్పంగా విరిగిపోవడం ప్రధాన కారణాలుగా అధికారులు చెప్పుకొచ్చారు. సెప్టెంబరు 12, 2015న శివాలిక్ క్వీన్‌గా పిలిచే నారోగేజ్ రైలు కోల్‌కతా నుండి సిమ్లాకి వెళ్తున్న సమయంలో పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు బ్రిటన్ పర్యాటకులు మరణించగా, మరో 15 మంది గాయపడ్డారు. అదే రోజున దురంతో ఎక్స్‌ప్రెస్ కర్నాటకలోకి కల్‌బుర్గికి సమీపంలో పట్టాలు తప్పింది. తొమ్మిది బోగీలు పట్టాలు తప్పిన ఆ ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు మరణించగా మరో ఏడుగురు గాయపడ్డారు. ఇక, ఆగస్టు 4, 2015న మధ్యప్రదేశ్‌లో రెండు రైళ్లు పట్టాలు తప్పాయి. కామయాని ఎక్స్‌ప్రెస్ యుపిలోని వారణాశికి వస్తున్న సమయంలో పట్టాలు తప్పింది. తర్వాత జనతా ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఈ రెండు ప్రమాదాల్లో 31 మంది దుర్మరణం పాలవగా, 50 మందికి పైగా గాయపడ్డారు. మే 25, 2015న రూర్కెలా–జమ్ము తావి మూరి ఎక్స్‌ప్రెస్ ఎనిమిది బోగీలు యుపిలోని కౌషంబి జిల్లాలో పట్టాలు తప్పిన ఘటనలో ఐదుగురు ప్రయాణికులు మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు. ఇక, మార్చి 20, 2015న డెహ్రాడూన్–వారణాశి జనతా ఎక్స్‌ప్రెస్ రాయబరేలి జిల్లాలో పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో 58 మంది మరణించగా 150 మందికి పైగా గాయపడ్డారు. ఫిబ్రవరి 13, 2015న బెంగళూరు–ఎర్నాకులం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ బెంగళూరు శివారులో పట్టాలు తప్పిన ఘటనలో 10 మంది దుర్మరణం చెందగా మరో 150 మంది వరకు గాయపడ్డారు.

8 మంది అధికారులపై వేటు

ఉత్తరప్రదేశ్‌లో శనివారం సాయంత్రం జరిగిన ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంపై రైల్వేశాఖ స్పందించింది. మొత్తం ఎనమండుగురు అధికారులపై చర్యలు తీసుకు న్నారు. ముగ్గురు ఉన్నతస్థాయి అధికారులను సెలవుపై ఇంటికి పంపించారు. వీరిలో రైల్వేబోర్డులో కార్యదర్శి స్థాయి అధికారి ఒకరు కూడా ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించే మరో నలుగురు అధికారులను సస్పెండ్ చేశారు. ఒకరిని బదిలీచేశారు. ముజఫర్‌నగర్ జిల్లాలో ఖతౌలీ వద్ద రైలు బోగీలు పట్టాలు తప్పిన ఘటనలో 23 మంది మృతి చెందారు. 150 మందికిపైగా గాయపడ్డారు. వీరిలో 20 మంది వరకూ విషమ పరిస్థితిలో ఉన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై ఈ ఎనమండుగురిపై వేటు పడింది. సెలవుపై పంపించిన వారిలో రైల్వే బోర్డు ఇంజనీరింగ్ విభాగంలో సభ్యులు, నార్తర్న్ రైల్వే జనరల్ మేనేజర్, ఢిల్లీ డివిజనల్ రీజియనల్ మేనేజర్ ఉన్నారని అధికార ప్రకటనలో తెలిపారు. ఇక రైలు పట్టాల నిర్వహణకు సంబంధించి సస్పెండు అయిన నలుగురు అధికారులలో సీనియర్ డివిజనల్ ఇంజనీరు, అసిస్టెంట్ ఇంజనీరు, సీనియర్ సెక్షన్ ఇంజనీరు ఉన్నారు. ఇక చర్యలలో భాగంగా నార్తర్న్ రైల్వే చీఫ్ ట్రాక్ ఇంజనీరును బదిలీ చేశారు.

ప్రమదానికి రైల్వే మంత్రిదే బాధ్యత

కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ : యుపి రైలు ప్రమాదానికి కేంద్ర రైల్వే శాఖ మంత్రి సురేష్ ప్రభు బాధ్యత వహించాలని కాంగ్రెస్ పార్టీ ఆదివారం డిమాండ్ చేసింది. నిర్లక్ష్యం పరంగా ఆయన సరికొత్త రికార్డును నెలకొల్పారని ఎద్దేవా చేసింది. 'మే, 2014 నుండి సంభవించిన 27 భారీ రైలు ప్రమాదాల్లో మోడీ సర్కార్ ఘోరమైన భద్రతా వైఫల్యం ప్రతిబింబిస్తోంది. ఈ ప్రమాదాల్లో 259 మంది దుర్మరణం పాలవగా, 899 మంది తీవ్రంగా గాయపడ్డారు' అని ఎఐసిసి సమాచార విభాగం ఇన్‌ఛార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలా ప్రభుత్వంపై ఇక్కడ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మోడీ ప్రభుత్వం గద్దెనెక్కినప్పటి నుండి 27 రైలు ప్రమాదాలు సంభవించాయన్నారు.

ఇంట్లోకి రైలు బోగీ

ముజఫర్‌నగర్: కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం చుట్టుపక్కల నివాసితులను భయ కంపితులను చేసింది. పట్టాలు తప్పిన రైలు బోగీలు ఓ ఇంట్లోకి దూసుకెళ్లడంతో ఇప్పటికీ ఆ కుటుంబం తేరుకోలేకపోతోంది. 'అలసట మరిచిపోయేందుకు శనివారం సాయంత్రం ఆరుబయట కూర్చున్నా. ఇంతలో ఓ భారీ శబ్దం వినిపించింది. ఓ రైలు బోగీ ఇంకో బోగీని తోసుకుంటూ మా ఇంటి వైపు దూసుకొచ్చింది. ఇంటి గోడలోకి చొచ్చుకుపోయింది. వెంటనే భయంతో వణికిపోయి అక్కడి నుంచి పరుగుపెట్టాను.' అని మనోజ్ బాలియన్ అనే ప్రత్యక్ష సాక్షి శనివారం ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాద ఘటన గురించి వివరించాడు. తమ ఇంటిని దాటుకొని ఓ బోగి సమీపంలోని కళాశాల గోడను ఢీకొందని తెలిపాడు. తనకు ఇప్పుడు ఇల్లు లేకుండా పోయిందని, రైల్వేశాఖ తగిన పరిహారాన్ని ఇచ్చి ఆదుకోవాలని కోరారు. లేకపోతే న్యాయపరంగా ముందుకెళుతానని మనోజ్ స్పష్టం చేశారు.



డిమాండ్ల సాధన... మనుగడ వాదన

సంఘటిత రీతిలో రేపు బ్యాంక్‌ల సమ్మె

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మంగళవారం (22వ తేదీ) 75 శాతం బ్యాంకింగ్ లావాదేవీలు స్తంభించిపోనున్నాయి. తొమ్మిది బ్యాంకు సిబ్బంది సంఘాలు ఈసారి ఉమ్మడిగా ఒకే వేదికపైకి వచ్చి మంగళవారం బ్యాంకుల సమ్మెకు పిలుపునిచ్చాయి. ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్ల సమాఖ్య(ఎఐబిఒసి), ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఎఐబిఇఎ), నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాంక్ వర్కర్స్ వంటి తొమ్మిది సంఘాలు ఇప్పుడు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) ఛత్రం పరిధిలో ఒక్క రోజు సమ్మెకు దిగుతున్నాయి. బ్యాంకుల స్థిరీకరణ పేరిట ప్రభుత్వం తలపెట్టిన సంస్కరణలు ప్రతికూలంగా ఉన్నాయని ఉద్యోగ సంఘాలు విమర్శిస్తున్నాయి. చాలా కాలంగా తమ సమస్యల గురించి, ప్రత్యేకించి ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉనికిని నిల్పే సానుకూల చర్యల గురించి ప్రభుత్వానికి తెలిపినా పట్టించుకోవడం లేదని, అందుకే సమ్మె అనివార్యం అయిందని సంఘాల నేతలు తెలిపారు. మంగళవారం బ్యాంకింగ్ లావాదేవీలు ఉండకపోవచ్చునని పలు బ్యాంకులలో



ఖాతాదారులకు సమాచారం అందించారు. అయితే ఐసిఐసిఐ, హెచ్‌డిఎఫ్‌సి, యాక్సిస్, కోటక్ మహీంద్రా వంటి బ్యాంకులు మామూలుగానే పనిచేయవచ్చు. అయితే చెక్కుల క్లియరెన్స్‌లలో జాప్యం జరగవచ్చునని వెల్లడైంది. బ్యాంకుల యాజమాన్యం, ప్రభుత్వం నుంచి తమ డిమాండ్లపై ఎలాంటి హామీ దక్కలేదని, చీఫ్ లేబర్ కమిషనర్ ఎదుట జరిగిన రాజీ చర్చలు విఫలం అయ్యాయని దీనితో ఇక సమ్మె తప్పదని ఎఐబిఒసి ప్రధాన కార్యదర్శి డిటి ఫ్రాన్కో తెలిపారు. డిమాండ్లన్నింటినీ కమిషనర్ ముందు పెట్టామని అయితే నిర్దిష్టమైన హామీ ఏదీ దక్కలేదని వెల్లడించారు. ఉద్యోగుల ప్రయోజనాల అంశాలతో పాటు బ్యాంకింగ్ వ్యవస్థ పరిరక్షణపై తాము కొన్ని కీలక డిమాండ్లను పెట్టామని, అయితే వీటిపై కూడా దృష్టి సారించలేదని నేతలు విమర్శించారు. రుణాలను ఎగవేసే వారిపై నేరాభియోగాలు మోపాలని, ఎన్‌పిఎల రికవరిపై పార్లమెంటరీ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని తాము కోరినట్లు బ్యాంకు ఉద్యోగుల సంఘం నేత సిహెచ్ వెంకటాచలం తెలిపారు. ఇక బ్యాంకింగ్ ఛార్జీల పెంపుదలతో ఖాతాదారులలో అసంతృప్తి అంశాన్ని కూడా తాము యాజమాన్యం దృష్టికి తెచ్చినట్లు వెల్లడించారు. కార్పొరేట్లు రుణాలు ఎగ్గొడితే పనికిరానిఆస్తులను మదుపుగా పెడితే ఆ విధంగా వచ్చే నష్టం భారం ఖాతాదారులపై మోపడం తగదని స్పష్టం చేశారు. ప్రత్యేకించి సంస్కరణల అమలుకు ప్రభుత్వం తలపెట్టిన బ్యాంక్స్ బోర్డును రద్దు చేయాలని వెంకటాచలం సూచించారు. ఈ బోర్డు పేరిట ప్రభుత్వ రంగ బ్యాంకులను ఓ క్రమపద్ధతి ప్రకారం దెబ్బతీసేందుకు, ప్రైవేటు బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతానికి యత్నిస్తున్నారని నేతలు విమర్శించారు. పెద్ద నోట్ల రద్దు ప్రక్రియతో బ్యాంకులపై పడిన భారాన్ని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

స్టార్ హోటళ్లలో బసలొద్దు

మంత్రులకు ప్రధాని హెచ్చరిక

న్యూఢిల్లీ: ఐదు నక్షత్రాల హోటళ్లలో బస చేయడం, ప్రభుత్వ వాహనాలను కుటుంబ సభ్యుల కోసం వినియోగించడం వంటి వాటికి దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంత్రులను ఆదేశించారు. కొందరు మంత్రులు అధికారిక కార్యక్రమాలకు వెళ్లిన సందర్భంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే వసతులను వినియోగించుకోకుండా, ఐదు నక్షత్రాల హోటళ్లలో బస చేస్తుండడం పట్ల ప్రధాని అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు టైమ్స్ ఆఫ్ ఇండియా వర్గాలు పేర్కొన్నాయి. మంత్రుల ఈ వ్యవహార శైలిపై తనకు నివేదిక అందిన నేపథ్యంలో ప్రజాధనం దుర్వినియోగంపై ఆయన మంత్రులపై ఒకింత ఆగ్రహాన్ని కూడా వ్యక్తం చేసినట్టు సమాచారం. ప్రభుత్వ వాహనాలను సొంత ప్రయోజనాలకు, కుటుంబ సభ్యుల కోసం వినియోగించడాన్ని తాను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించినట్టు తెలిసింది. ఇది మంత్రుల్లో గందరగోళానికి దారి తీసింది. దీంతో అధికారిక కార్యక్రమాలకు తప్ప మరే ఇతర కార్యక్రమాలకు ప్రభుత్వ వాహనాలను వాడొద్దని మంత్రులు తమ సిబ్బందికి చెప్పినట్టు సమాచారం. ఇదిలావుండగా, మంత్రులు అవినీతిరహితంగా వ్యవహరించాలని, ఇందులో తాను రాజీ పడే ప్రసక్తే లేదని మోడీ స్పష్టం చేశారు.

నేడు బిజెపి సిఎంలతో ప్రధాని భేటీ

న్యూఢిల్లీ: దేశంలోని బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోడీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా నేడు భేటీ కానున్నారు. ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల తీరుతెన్నుల గురించి వారు ముఖ్యమంత్రులను అడిగి తెలుసుకోనున్నారు. 13 మంది ముఖ్యమంత్రులు, ఆరుగురు ఉప ముఖ్యమంత్రులే కాక కొందరు కేబినెట్ మంత్రులు కూడా ఈ భేటీకి హాజరయ్యే అవకాశముందని బిజెపి వర్గాలు తెలిపాయి. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రులతో మోడీ భేటీ కావడం ఇది మూడోసారి. జెడి(యు)తో చేతులు కలిపి బీహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ఇలాంటి సమావేశాన్ని తొలిసారిగా నిర్వహిస్తుండటం గమనార్హం. రాష్ట్రాల్లో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నట్లు తెలిసింది. 2019 లోక్‌సభ ఎన్నికలకు అమిత్ షా ఒక బ్లూప్రింట్‌ను సిద్ధం చేసిన కొద్ది రోజులకే ఈ భేటీని నిర్వహిస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

శశికళపై వేటు?

- పార్టీ పగ్గాలు పన్నీర్‌కు
- ప్రభుత్వ పగ్గాలు పళని చేతిలోనే
- నేడు విలీనంపై ప్రకటనకు అవకాశం



చెన్నై: తమిళనాడులోని అన్నాడిఎంకె వైరి వర్గాల విలీన అంశం తుది అంకానికి చేరుకుంది. విలీనంపై సిఎం పళనిస్వామి, మాజీ సిఎం పన్నీర్ సెల్వం వర్గాల మధ్య కొద్ది రోజులుగా నెలకొన్న ప్రతిష్టంభన నేటితో ముగియనున్నట్లు తెలుస్తోంది. నేడు జరగనున్న అన్నాడిఎంకె నాయకుల కీలక భేటీలో విలీనంపై సాయంత్రానికల్లా ఒక సానుకూల నిర్ణయం వెలువడే అవకాశముంది. మరోవైపు పార్టీ ఉప ప్రధాన కార్యదర్శిగా టిటివి దినకరన్ నియామకం చట్టవిరుద్ధమన్న ప్రతిపాదనను కూడా ఈ భేటీలో ఆమోదించే అవకాశం కన్పిస్తోంది. పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి నుండి వికె శశికళను తప్పించాలంటూ పన్నీర్ వర్గం మొదట్నుంచీ చేస్తున్న ప్రధాన డిమాండ్‌కు పళనిస్వామి వర్గం అంగీకరించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో వైరి వర్గాల విలీనానికి ఉన్న ప్రధాన అడ్డంకి తొలగిపోనుంది. కాగా, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ప్రస్తుతం బెంగళూరు జైలులో ఉన్న ఆమెను పదవి నుండి తొలగించే అవకాశాలు పుష్కలంగా కన్పిస్తున్నాయి. ఇదిలా ఉంటే, విలీనం తర్వాత పార్టీ పరంగా పన్నీర్‌సెల్వం నంబర్‌వన్‌గానూ, ప్రభుత్వం పరంగా నంబర్ 2 (ఉప ముఖ్యమంత్రి)గానూ కొనసాగుతారని, అదే పళనిస్వామి ప్రభుత్వం పరంగా నంబర్‌వన్‌గానూ (ముఖ్యమంత్రి), పార్టీ పరంగా నంబర్ 2గానూ కొనసాగుతారని పన్నీర్ వర్గానికి చెందిన నాయకుడొకరు ఐఎఎన్ఎస్ వార్తా సంస్థకు తెలిపారు. తమ వర్గంలోని ఇద్దరు ఎంఎల్‌ఎలకు మంత్రి పదవులు దక్కే అవకాశముందని కూడా ఆయన అన్నారు. ప్రభుత్వంపై పన్నీర్ సెల్వం వర్గం చేసిన అవినీతి ఆరోపణల గురించి అడగ్గా, వాటిని సరిచేసుకుంటామని, ప్రభుత్వం, పార్టీ రెండూ తిరిగి గాడిలో పడతాయనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. విలీనం తర్వాత ప్రస్తుతం పార్టీ పదవుల్లో ఉన్న వారికి మొండిచేయి చూపకుండా వారికి అవకాశం కల్పించేలా రాష్ట్ర శాసనమండలిని పునరుద్ధరించే అవకాశముందని ఆయన చెప్పారు. కాగా, త్వరలోనే విలీనం రాష్ట్ర ప్రజలు ఆకాంక్షిస్తున్నట్లుగానే జరుగుతుందని పన్నీర్‌సెల్వం శనివారం పేర్కొన్న సంగతి తెలిసిందే.

నాసిక్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు

నాసిక్: నాసిక్ నగరంతో పాటు, జిల్లాలోని పలు ప్రాంతాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. చాలాకాలంగా అనావృష్టి ఏర్పడిన తరుణంలో ఆదివారం ఒక్కసారిగా కురిసిన కుంభవృష్టితో అనేక ప్రాంతాలు నీటమునిగాయి. శనివారం రాత్రి 12 గం.ల నుంచి సోమవారం ఉదయం 8 గం.ల వరకు త్ర్యయంబకేశ్వర్‌లో 62 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే, ఇగత్‌పురిలో 65 మి.మీ. వర్షం కురిసిందని కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు. దేవ్లా, సాతన, మాలెగావ్, చన్వాడ్, సిన్నార్, దిండోరి, నిఫడ్ తాలూకాలు వరద ముంపులో చిక్కుకున్నాయి. వరద ఉధృతి కారణంగా గంగాపూర్, దర్నా డ్యాంల వద్ద గేట్లను ఎత్తివేశారు.



మన తెలంగాణ
11 | హైదరాబాద్ సోమవారం 21, ఆగస్టు 2017
www.manatelangana.news



అణు ఒప్పంద పరిరక్షణకే ప్రాధాన్యత : రౌహానీ

టెహ్రాన్: అమెరికా అణచివేత నుంచి అణు ఒప్పందాన్ని పరిరక్షించడమే తమ ప్రభుత్వ విదేశాంగ విధాన అత్యున్నత ప్రాధాన్యత అని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ తెలిపారు. ఇరాన్ పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ అమెరికా, ఇతర శత్రుదేశాలు విజయం సాధించకుండా చర్యలు తీసుకోవడమే విదేశాంగ మంత్రి విధి అని పేర్కొన్నారు. అమెరికా తమ దేశంపై తాజాగా ఆంక్షలు కొనసాగించినట్లైతే అణు ఒప్పందం నుంచి బయటకు వెళ్లేందుకు సంకోచించబోమని వారం రోజుల క్రితం రౌహానీ సూచనాప్రాయంగా తెలిపారు. క్షిపణి పరీక్షలు నిర్వహించిన ఇరాన్‌పై అమెరికా కొత్తగా ఆంక్షలు విధించడం, తమపై ఒత్తిడి తీసుకురావడమేనని ఆయన అన్నారు. దేశంలో ఆర్థిక వ్యవస్థ పునర్ నిర్మాణం, నిరుద్యోగ సమస్య ఉన్నప్పటికీ అణు ఒప్పందమే తమ ప్రాధాన్యత అని ఆయన నొక్కి చెప్పారు. విదేశీ పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందడం తమ విదేశాంగ విధాన రెండో ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెలలో తిరుగుబాటు రావడంతో ప్రజల సహకారంతో రౌహానీ దానిని అణచివేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో రాజకీయ మితవాది అయిన రౌహానీ రెండోసారి అధికార బాధ్యతలు చేపట్టారు. దేశంలో పౌర స్వేచ్ఛను బలోపేతం చేస్తానని ఆయన తెలిపారు. తన మంత్రి వర్గంలో ఒక మహిళా మంత్రిని కూడా నియమించకపోవడం పట్ల సంస్కరణ వాదులు ఆయనను విమర్శిస్తున్నారు.

భారత సంతతి బాలుడు 'చైల్డ్ జీనియస్'



లండన్: యుకెలో భారత సంతతికి చెందిన 12 ఏళ్ల బాలుడు 'చైల్డ్ జీనియస్' కిరీటాన్ని దక్కించుకుని రికార్డు సృష్టించాడు. రాహుల్ దోషి అనే బాలుడు యుకె పాపులర్ టెలివిజన్ క్విజ్ పోటీలో అడిగిన అన్ని ప్రశ్నలకు టక్కున సమాధానాలు చెప్పేసి రాత్రికి రాత్రికే టివి స్టార్‌గా అవతరించాడు. చైల్డ్ జీనియస్ ఛానల్ 4 షో ఫైనల్లో తన ప్రత్యర్థి పోటీదారుడు 9 ఏళ్ల రోనన్‌పై గెలిచి చైల్డ్ జీనియస్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. వారం క్రితం జరిగిన ఈ క్విజ్ పోటీలో అన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పి సంచలనం సృష్టించాడు. నార్త్ లండన్ నుంచి వచ్చిన రాహుల్ 19వ శతాబ్దపు కళాకారులు విలియమ్ హోల్మాన్ హంట్, జాన్ ఎవరెట్ మిల్లాయిస్‌లపై వరుసగా అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంతో 'యుకె చైల్డ్ జీనియస్' టైటిల్‌ను దక్కించుకున్నాడు. టైటిల్‌ను గెలుచుకున్న అనంతరం రాహుల్ మాట్లాడుతూ.. 'నేరుగా అడిగిన ప్రశ్నలకు బదులిచ్చే క్రమంలో ఒత్తిడికి లోనవ్వలేదు. కానీ, నిజానికి నాకు ఇదొక గొప్ప అనుభవం' అని పేర్కొన్నాడు. ఇంగ్లాండ్ 18వ శతాబ్దపు ఎడ్వర్డ్ జెన్నర్ వైద్య ఆవిష్కరణ పద్ధతి పాఠ్యాంశాన్ని ఎంచుకుని క్విజ్ ఫైనల్ పోటీలో రాహుల్ తన తెలివితేటలతో అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పి అందరి దృష్టిని ఆకర్షించాడు.

హసీనా కేసులో 10మందికి ఉరిశిక్ష

ఢాకా: బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో 10 మంది తీవ్రవాదులకు ఆదివారం బంగ్లా కోర్టు మరణశిక్ష విధించింది. ఈ కేసులో మరో తొమ్మిది మందికి కూడా 20 ఏళ్లపాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించింది. 2000 సంవత్సరంలో హసీనాను చంపేందుకు తీవ్రవాదులు రహస్య కుట్రలో భాగంగా నైరుతి గోపాల్‌గంజ్‌లో శక్తివంతమైన బాంబును అమర్చారు. హసీనా పబ్లిక్ ర్యాలీకి ముందు తనిఖీల్లో భద్రతా అధికారులు ఆ బాంబును గుర్తించి నిర్వీర్యం చేయడంతో అప్పట్లో ఆమెకు పెద్ద ప్రమాదమే తప్పింది. స్పెషల్ పవర్స్ యాక్ట్ కేసులో 25 మంది అనుమానితులపై నేరారోపణల నేపథ్యంలో వారిలో 9 మందికి కోర్టు 20 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ఒక్కొక్కరికి బంగ్లా కరెన్సీ టాకా 20వేల చొప్పున జరిమానా విధించింది. మరణ శిక్ష విధించబడిన దోషులను కోర్టు ఆదేశాల మేరకు ఉరిశిక్ష లేదా కాల్చి చంపడం ద్వారా శిక్షను అమలు చేయనున్నట్టు ఢాకా స్పీడీ ట్రయల్ ట్రిబ్యునల్2 జడ్జీ మమ్తాజ్ బేగం పేర్కొన్నారు.

విచారణకు షరీఫ్ కుటుంబం గైర్హాజరు

లాహోర్ : పనామా పత్రాల లీకేజ్ కేసులో విచారణకు పాక్ మాజీ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్ సహా ఆయన కుటుంబ సభ్యులు రెండోసారి గైర్హాజరయ్యారు. మనీలాండరింగ్, అవినీతి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న షరీఫ్ సహా ఆయన కుమారులు హసన్, హుస్సేన్, కుమార్తె మర్యమ్, అల్లుడు సఫ్దార్‌లను విచారణకు హాజరుకావాల్సిందిగా ఆదివారం నేషనల్ అకౌంటబులిటీ బ్యూరో (ఎన్ఎబి) సమన్లు జారీ చేసింది. అయినప్పటికీ ఎవరూ విచారణ హాజరుకాలేదని ఎన్ఎబి ప్రతినిధి అసిం అలీ నవాజీశ్ వెల్లడించారు. షరీఫ్ కుమారులు హసన్, హుస్సేన్‌లకు వేర్వేరు కేసుల్లో శుక్రవారం ఎన్ఎబి సమన్లు జారీ చేసినప్పటికీ వారు విచారణకు హాజరుకాలేదని అలీ చెప్పారు. ఈ కేసుల్లో విచారణకు హాజరయ్యేంతవరకు షరీఫ్ కుటుంబానికి ఎన్ఎబి సమన్లు జారీ చేస్తూనే ఉంటుందని అలీ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వేర్వేరు కేసుల్లో షరీఫ్ కుటుంబసభ్యులను విచారిస్తున్నామన్నారు. మరోవైపు తన అనర్హతపై వేసిన రివ్యూ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పును వెలువరించిన తరువాతే తన కుటుంబ సభ్యులతో విచారణకు హాజరవుతానని షరీఫ్ ఎన్ఎబికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

బీహార్‌లో ప్రమాదం, ముగ్గురు దుర్మరణం

బెగుసరై : బీహార్‌లోని బెగుసరై జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరో వ్యక్తి గాయపడ్డాడు. హర్పూర్ సమీపంలో 31వ జాతీయ రహదారిపై ప్రయాణికుల జీబు, ఎదురుగా వస్తున్న మరో వాహనం ఢీకొట్టడం వల్ల ప్రమాదం చోటు చేసుకుంది. మృతులు కిషన్ గంజ్ జిల్లాలకు చెందిన ఎండి లాల్‌బాబు (35), ఎండి జావేద్ (35), ఎండి ముజఫర్ అలం (37)గా గుర్తించినట్లు బరౌనీ రిఫైనరీ పోలీస్ స్టేషన్ ఇంచార్జి అజయ్ కుమార్ అజ్నాబీ తెలిపారు. మృతదేహాలను పంచనామా కోసం ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. గాయపడ్డ ఎండి సాజిద్ అలాంను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామని ఆయన పేర్కొన్నారు. కశ్మీర్‌లో పనిచేస్తున్న కార్మికులు కిషన్‌గంజ్‌లోని తమ స్వస్థలాలకు వెళ్తుండగా ఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వచ్చే ఏడాది ఆగస్టు 1న దేశవ్యాప్త సమ్మె



మన తెలంగాణ/హైదరాబాద్/నల్లకుంట: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చే ఏడాది (2018) ఆగస్టు 1న దేశ వ్యాప్తంగా సమ్మెను చేపట్టనున్నట్లు ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి పిఎస్ చౌదరి అన్నారు. అన్ని ఫెడరేషన్లను కలుపుకుని సమ్మెను చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం సుందరయ్య కళా నిలయంలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 8వ జాతీయ మహాసభల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిఎస్ చౌదరి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసేందుకు పోరాటం చేయాలని దేశవ్యాప్తంగా సమ్మె తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని విద్యుత్‌ను రెండు భాగాలుగా విడగొట్టే 2014 సవరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని జెన్‌కో డిస్ట్రిబ్యూషన్ సంస్థలను షెడ్యూల్ పరిశ్రమల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ తీర్మానించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆప్ ఇండియా అధ్యక్షులు కెఓ హబీబ్, తెలంగాణ కార్యదర్శి కిరణ్, సిఐటియూ జాతీయ నాయకులు ఆర్. సుధాభాస్కర్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

వంద గ్యాస్ ట్యాంకర్లతో

భారీ విధ్వంసానికి కుట్ర

ఉగ్రవాదుల పన్నాగం, తిప్పికొట్టిన పోలీసులు



బార్సిలోనా : స్పెయిన్‌లో పన్నెండు మంది సభ్యుల ఉగ్రవాదుల బృందం పేలుడు పదార్థాలు నింపిన వ్యాన్లతో ఇక్కడ పలు చోట్ల భారీ దాడులకు వ్యూహరచన చేశారని కేటలోనియా పోలీసు అధికారి జోసెఫ్ లూయిస్ ట్రాపిరో ఆదివారం విలేకరులకు తెలిపారు. బ్యూటేన్ వాయుపు ఉన్న సుమారు వందకు పైగా ట్యాంకులు అల్కనర్ ఇంటిలో బుధవారం రాత్రి పేలాయని ఆయన చెప్పారు. ఈ ట్యాంకులతో పాటు పారిస్, బ్రస్సెల్స్‌లో దాడులకు ఐసిస్ ఉగ్రవాదులు వినియోగించిన టిఎటిపిపేలుడు పదార్థం తయారీకి వాడే మిశ్రమ పదార్థాలతో భారీ విధ్వంసానికి ఉగ్రవాదులు కుట్ర పన్నారని ఆయన స్పష్టం చేశారు. 'బార్సిలోనా నగరంలో ఉగ్రవాదులు శక్తివంతమైన పేలుడు పదార్థాలతో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ దాడులకు కుట్ర పన్నారన్నది మా భావన' అని ట్రాపిరో అన్నారు. అయితే చాకచక్యంగా ఈ కుట్రను భగ్నం చేశామని ఆయన చెప్పారు. అల్కనర్ గృహం బుధవారం రాత్రి పేలిపోయిందని ఆయన తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా ఈ పేలుడులో మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్న ఇమామ్ అబ్దెల్‌బకి ఎస్ సాటీ ఆచూకీని తెలుసుకోవడంమైనా దృష్టి సారించామని ఆయన చెప్పారు. ప్రస్తుతం పరారీలో ఉన్న అనుమానిత డ్రైవర్ మొరాకోకి చెందిన 22 ఏళ్ల యూనస్ అబోయాక్వాబ్ ఇక్కడ అమాయకులపై వ్యానుతో దాడి చేశాడా? అన్న విషయాన్ని నిర్థారించడానికి ట్రాపిరో నిరాకరించారు. అతన్ని పట్టుకోగలమన్న ఆశతో పోలీసులు ఆదివారం ఈశాన్య స్పెయిన్ వ్యాప్తంగా అనేక రహదారులను దిగ్బంధించారు. కాగా, ఇక్కడ లస్ రంబ్లస్‌తో పాటు కాంబ్రిల్స్ వద్ద రెండు వ్యాన్లతో ఉగ్రవాదులు చేసిన అమానవీయ దాడుల్లో 14 మంది ప్రాణాలు కోల్పోగా మరో 120 మంది గాయపడిన సంగతి తెలిసిందే.

దూసుకొచ్చిన రాకెట్ బాంబు

ఐదుగురు మృతి, డజన్ల కొద్ది గాయాలు

డమాస్కస్: సిరియా రాజధాని డమాస్కస్‌లో అంతర్జాతీయ ట్రేడ్ ఫెయిర్‌కు సమీపంలో ఆదివారం దూసుకొచ్చిన రాకెట్ బాంబు పేలింది. ఈ ఘటనలో ఐదుగురు మృతిచెందగా, డజన్ల కొద్ది గాయపడినట్టు సిరియా మీడియా వెల్లడించింది. సిరియాలో ఐదేళ్లలో తొలిసారి ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ట్రేడ్ ఫెయిర్ జరుగుతున్న సమయంలో ఎగ్జిబిషన్ కాంప్లెక్స్ ప్రవేశమార్గానికి సమీపంలో రాకెట్ దూసుకరావడంతో పేలుడు ఘటన చోటుచేసుకుంది. వారం క్రితమే ఆరంభమైన ఈ బిజినెస్ ఫెయిర్‌లో పలువురు పారిశ్రామికవేత్తలతోపాటు ప్రాంతీయ మీడియా ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఈ ఘటనలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రులకు తరలించినట్టు సిరియా మీడియా తెలిపింది. 2011 మార్చిలో సిరియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న నాటి నుంచి ఎగ్జిబిష న్ సిటీలో ట్రేడ్ ఫెయిర్‌కుబ్రేక్ పడింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

ఉగ్ర చర్యలను అనుమతించబోమని పాక్ హామీ ఇవ్వాలి : యుఎస్

ఇస్లామాబాద్: పొరుగుదేశాలలో ఉగ్రవాదు లు దాడులు జరిపేందుకు తమ భూభాగాన్ని అనుమతించబోమని పాకిస్థాన్ హామీ ఇవ్వాలని అమెరికా పేర్కొంది. అమెరికా సెంట్రల్ కమాండ్‌కు చెందిన కమాండర్ జనరల్ జోసెఫ్ వోటెల్ వారం రోజుల క్రితం ఇస్లామాబాద్‌లో పర్యటించినప్పుడు ఈ విషయాన్ని పాకిస్థాన్‌కు తెలిపారు. తన పర్యటనలో పాక్ ప్రధాని షాహిద్ ఖకన్ అబ్బాసి, ఇతర ప్రముఖులు, సైనిక, మిలిటరీ అధికారులతో వోటెల్ సమావేశమై చర్చించారు. పొరుగు దేశాలలో దాడులు చేసేందుకు ఉగ్రవాదులు ప్రణాళికలు రచించ డం, దాడులకు పాల్పడకుండా అన్ని పార్టీలు కృ షి చేయాలని వోటెల్ చెప్పినట్లు అమెరికన్ రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రాంతీయ భద్రత, స్థిరత్వానికి అమెరికా,పాక్ సై న్యం కలిసి పనిచేయాల్సిన అవసరముందని ఆయన నొక్కి చెప్పారు. ఉమ్మడి ప్రయోజనాలను సాధించేందుకు ఉగ్రవాదులు, ఉగ్ర చొరబాట్లకు వ్యతిరేకంగా పాక్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వోటెల్‌కు మరింత అవగాహన పెరిగిందని తెలిపింది.

నేడు ఖగోళ 'సన్'దడి

సంపూర్ణ సూర్యగ్రహణం.. భారత్‌లో కన్పించదు

వాషింగ్టన్ : సోమవారం సంపూర్ణ సూర్యగ్రహణం సంభవించనుంది.1979 తరువాత కన్పించే సుదీర్ఘ సంపూర్ణ సూర్యగ్రహణం ఇదే. అయితే అమెరికా, యూరప్, ఆఫ్రికా దేశాల్లోఈ సూర్య గ్రహణం కన్పిస్తుంది. అమెరికాలో21వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పలు దశలలో మధ్యాహ్నం 3 గంటల వరకూ ఈ ఖగోళ పరిణామం ఉంటుంది. దాదాపు ఆరుగంటల పాటు సాగే ఈ ఘట్టం పలు విధాలుగా ఖగోళ పరిశోధకులకు ఆసక్తిని తెచ్చిపెట్టింది.అమెరికా ఇతర దేశాలలో సంభవించే ఈ గ్రహణం సమయానికి భారత్‌లో రాత్రి అవుతుంది కాబట్టి ఇక్కడ గ్రహణం కన్పించదని , గ్రహణ ప్రభావం ఏ విధంగానూ ఇక్కడ ఉండదని ఖగోళ నిపుణులు తెలిపారు. ఈ విధమైన సుదీర్ఘ సూర్య గ్రహణం తిరిగి 2500 సంవత్సరంలో ఏర్పడుతుంది. ఎక్కువ సమయం సూర్య గ్రహణం వచ్చినప్పుడు ఉపరితలంలో సాధారణంగా ఉష్ణోగ్రతలు రెండు మూడు డిగ్రీలు తగ్గుతాయని విశ్లేషించారు.దీనితో వాతావరణంలో పెను మార్పులకు అవకాశం ఉంటుంది. ఇవి కొన్ని సందర్భాలలో వికటించి ఉపద్రవాలకు దారితీసే అవకాశం ఉందని వెల్లడి కావడంతో కొన్ని దేశాల్లో ఈ గ్రహణంపై భయాలు నెలకొన్నాయి. టోర్నడోలు, భూకంపాలు, సునామీలకు దారితీసే వీలుందని భావిస్తున్నారు. నాసా వర్గాలు ఈ సంపూర్ణ గ్రహణం వీక్షణకు ప్రత్యేక శాస్త్రీయ ఏర్పాట్లు చేసుకున్నారు. పలు దేశాలలో గ్రహణం నేపథ్యంలో సెలవు దినాలు ప్రకటించారు. అయితే ప్రైవేటు సంస్థల వారు గ్రహణం వీక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు ఇతరత్రా జాగ్రత్తలు కూడా చేపట్టారు. అమెరికా ఇతర దేశాలలో ఈ సుదీర్ఘ గ్రహణం వల్ల పలు భయాలు పట్టుకున్నాయి.



కాపులను టిడిపికి దూరం చేసే కుట్ర

ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు



నంద్యాల : కాపులను టిడిపికి దూరం చేసేందుకు కొందరు చిచ్చు పెడుతున్నారని ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. కాపులకు గుర్తింపు ఇచ్చేది టిడిపి మాత్రమేనని పేర్కొన్నారు. ఎవరూ అడక్కుండానే 2014లో కాపు రిజర్వేషన్ల హామీ ఇచ్చానని, వారి ఆర్థిక పరిస్థితి చూశాకే పిఠాపురంలో ప్రకటన చేశానని గుర్తుచేశారు. నంద్యాలలో ఆదివారం జరిగిన బలిజల ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. కాపులు, బలిజలకు రాజకీయంగా ప్రాధాన్యత ఇచ్చింది తెలుగుదేశం పార్టీయేనన్నారు రాయలసీమలో బలిజలకు ముఖ్య పదవులు ఇచ్చామని పేర్కొన్నారు. కాపుల రిజర్వేషన్లు అమలు చేస్తామని 2004, 2009లో మేనిఫెస్టోలో పెట్టారని, అప్పుడు అమలు చేయనివారిపై మాట్లాడని కొందరు ఇప్పుడు మమ్మల్ని విమర్శిస్తున్నారన్నారు. చిత్తశుద్ధితో టిడిపి మంజునాథ కమిషన్ వేసిందని, కమిషన్ నివేదిక వచ్చాక రిజర్వేషన్లపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈలోగా కాపు కార్పొరేషన్ ద్వారా వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.నంద్యాల ఉప ఎన్నికలో టిడిపి అభ్యర్థిని బలపరచాలని చంద్రబాబు కోరారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న వైసిపి అభ్యర్థి వల్ల నంద్యాలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఓట్ల కోసం ప్రతిపక్ష నేత నంద్యాలపై ఎక్కడాలేని ప్రేమ చూపిస్తున్నారని, కాల్చండి.. ఉరితీయండి అంటూ మాట్లాడే నేతను సమర్థిస్తారా..?అని ప్రశ్నించారు.నంద్యాలలోఅవినీతికి పాల్పడిన జగన్ ఓట్లు అడగటం సిగ్గుచేటని అన్నారు.

ముస్లింలను అన్ని విధాలా పైకి తెస్తా

ముస్లింలను విద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో పైకి తీసుకొచ్చే బాధ్యత తనదని చంద్రబాబునాయుడు అన్నారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన ముస్లింలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో ముస్లింలకు ఎక్కువ నిధులు కేటాయించింది తమ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. నంద్యాలలో శిల్పా మోహన్‌రెడ్డి కుటుంబం అనేక అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. పేదలపై అరాచకాలకు పాల్పడేవారిని తమ ప్రభుత్వం వదిలిపెట్టదని హెచ్చరించారు. కొందరు పేదవాళ్ల భూములు కాజేసి ఇబ్బందిపెడుతున్నారని తన దృష్టికి వచ్చిందని తెలిపారు. కులం, మతం పేరుతో వేధించాలని చూస్తే వూరుకునేది లేదన్నారు. రాజకీయాల్లో ఉన్నవారు పేదవాళ్లకు అండగా ఉండాల్సింది పోయి అరాచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.



జోరువానలో వైఎస్ జగన్ భారీ రోడ్‌షో

నంద్యాల: మూడున్నరేళ్ల చంద్రబాబునాయుడు అవినీతి, మోసపూరితమైన పాలనకు వ్యతిరేకంగా నంద్యాల ఉప ఎన్నికలో ఓటు వేద్దామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. 'నంద్యాలలో ఉప ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఆదివారం సాయంత్రం పట్టణంలోని వైఎస్ఆర్ నగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో జగన్ ప్రసంగించారు. ఎవరో ఒక వ్యక్తిని ఎమ్మెల్యే చేసుకోవడానికో ఈ ఉప ఎన్నిక జరగడం లేదని, మూడున్నరేళ్ల చంద్రబాబు పరిపాలనపై ఇవాళ ఉప ఎన్నిక జరుగుతోందన్నారు. చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలకు వ్యతిరేకంగా మనం ఓటువేద్దాం. చంద్రబాబు పరిపాలనలోని అవినీతికి వ్యతిరేకంగా ఓటు వేద్దాం' అని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ప్రతి పేదవాడికి మూడు సెంట్ల స్థలమిస్తాను, ప్రతి పేదవాడికి ఇల్లు కట్టిస్తానని చంద్రబాబు చెప్పారని కానీ, ఇప్పటి వరకు ఒక్క ఇల్లైనా కట్టించారా? అని జగన్ ప్రశ్నించారు. అదే విధంగా ప్రతి పేదవాడికి సాగుభూమి ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి ఒక్క ఎకరం భూమి అయినా ఇవ్వలేదన్నారు. రేషన్ దుకాణాల్లో ఇంతకు ముందు బియ్యం, కిరసనాయిల్, కందిపప్పు, పామాయిల్, గోధుమపిండి పలు రకాల వస్తువులు ఇచ్చేవారు. కానీ, చంద్రబాబు సిఎం అయ్యాక ఒక్క బియ్యం తప్ప ఏమీ ఇవ్వడం లేదని జగన్ మండిపడ్డారు. 'ముఖ్యమంత్రి హోదాలో మూడేళ్ల కిందట ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా అందరినీ మోసం చేశారు. ఇలాంటి చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు సమయం ఆసన్నమైంది. నంద్యాల ప్రజలు ఆయనకు వ్యతిరేకంగా ఓటు వేయాలి. ధర్మం, న్యాయం వైపు నిలిచి శిల్పా మోహన్‌రెడ్డిని గెలిపించాలి' అని జగన్ పిలుపునిచ్చారు.

3,500 మందితో నంద్యాలలో బందోబస్తు

నంద్యాల: ఈనెల 23న జరిగే నంద్యాల ఉపఎన్నికలకు 3,500 మంది పోలీసులతో పాటు సాయుధ బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నట్లు రాయలసీమ డిఐజి జి.శ్రీనివాస్ తెలిపారు. తనిఖీ కేంద్రాలతో పాటు సంచార తనిఖీ కేంద్రాలు ఏర్పాటుచేసి అనుమానాలున్న ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తామన్నారు. నంద్యాల ఓటర్లు నిర్భయంగా ఓట్లేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

పాత పెన్షన్ విధాన సాధనకై శంఖారావం : ఉద్యోగ సంఘాలు



మన తెలంగాణ/శంషాబాద్ : పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వంపై తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీసీపీఎస్ఇఏ) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం శంషాబాద్‌లో జరిగిన సమావేశంలో సమర శంఖారావాన్ని పూరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిసిపిఎస్ఇఏ అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు పెన్షన్ ఎక్కువగా ఉండేదన్నారు. కాని తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అది పూర్తిస్థాయిలో తగ్గిపోయిందన్నారు. ఈ విధానం వల్ల ఉద్యోగస్తులు చాలా నష్టపోయారన్నారు. 2014 నుండి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న పెన్షన్ వెంటనే పాత పెన్షన్ విధానంలోనే చెల్లించాలన్నారు. ఈ విధానం వల్ల ఉద్యోగస్తులు చాలా నష్టపోయారన్నారు. 2004 నుండి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న పెన్షన్ వెంటనే పాత విధానంలోనే చెల్లించాలని ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. ఎంతో మందికి వృద్ధాప్య పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వం మాపై ఎందుకు ఇంత వివక్షత చూపుతుందో కెసిఆర్ చెప్పాలన్నారు. ఇప్పుడైనా ప్రభుత్వం వెంటనే పాత విధానాన్నే అమలు పర్చాలని ప్రభుత్వని డిమాండ్ చేశారు. లేదంటే ఎంతటి ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. అవసరమైతే నిరాహార దీక్షలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. ఎంతవరకైనా పోరాడి సాధించుకుంటామన్నారు. ఈ కార్యక్రమానికి పలు ఉద్యోగ సంఘాలు మద్ధతు పలికాయి. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దర్శన్ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సాహోల్ అలీ, జిల్లా కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

టి-90 యుద్ధ ట్యాంకుల సామర్థ్యం పెంపు

న్యూఢిల్లీ : టి90 ప్రధాన యుద్ధ ట్యాంకుల సామర్థ్యం పెంచేందుకు సైన్యం యోచిస్తోంది. ఈ యుద్ధ ట్యాంకులకు మూడో తరం క్షిపణి వ్యవస్థను అమర్చి వాటి సామర్థ్యాలను మరింత పెంచే ప్రాజెక్టుపై పని చేస్తోంది. టి90 యుద్ధ ట్యాంకులకు ప్రస్తుతం లేజర్ గైడెడ్ ఇన్వార్ క్షిపణి వ్యవస్థ ఉంది. వాటిస్థానంలో థర్డ్ జనరేషన్ గన్ మిస్సైళ్లను అమర్చుతున్నట్లు సైనిక వర్గా ల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఇన్వార్ క్షిపణి వ్యవస్థను విస్తరించారు. పరి ధి, లోతు నేపథ్యంలో వాటి సామర్థ్యం పెంచడం తప్పనిసరి అని ప్రాజెక్టు పత్రాల ఆధారం తెలుస్తోంది. రష్యా మూలాలు ఉన్న టి90 యుద్ధ ట్యాంకులను సైన్యం వినియోగిస్తోంది. మూడో తరం క్షిపణుల పరిధి, లోతు 800850 ఎంఎంలతో 8 కిలో మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం కలిగి ఉంటాయి. ఈ యుద్ధ ట్యాంకుల 125 ఎంఎం తుపాకుల నుంచి క్షిపణులను ప్రయోగిస్తారు. ఈ క్షిపణులునిశ్చల,మొబైల్ లక్ష్యాలను సైతం ఛేదించే సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఎత్తైన ప్రదేశాలలో లక్ష్యాలను ఛేదించేందుకు యుద్ధ ట్యాంక్‌లకు మాడ్యులర్ ఇంజిన్‌ను అమర్చేందుకు మరో పథ కాన్ని సైన్యం రూపొందిస్తోంది. స్వల్ప కాలం కొనసాగే పోరాటాలకు కావలసి శక్తివంతమైన ఆయుధాలు కొనుగోలుకు గత నెలలో ప్రభుత్వం సైన్యానికి అధికారం కల్పించింది.

సినిమాకు వద్దన్నందుకు

కాలువలో దూకింది



విజయవాడ: సినిమాకు తీసుకెళ్లడం లేదని భర్తతో గొడవపడిన భార్య ఆవేశంతో కాలువలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఎపిలోని విజయవాడలో చోటుచేసుకుంది. వాం బే కాలనీకి చెందిన రాజారెడ్డికి ఇటీవల తిరుపతమ్మ అనే యువతితో వివాహమైంది. ఆదివారం కావడంతో సినిమాకు వెళ్దామని తిరుపతమ్మ భర్తను కోరింది. రాజారెడ్డి ఇప్పుడొద్దని వారించాడు. దీంతో అలిగిన ఆమె సమీపంలోని కాలువలోకి దూకేసింది. గమనించిన భర్త ఈత రాకపోయినా భార్యను రక్షించేందుకు తానూ కాలువలోకి దూకాడు. ఇరువురు కొట్టుకుపోతున్న సమయంలో సమీపంలోని ధర్మాచౌక్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఎపిఎస్‌పి కానిస్టేబుళ్లు చూసి కాలువలోకి దూకి వారిని కాపాడారు. చిన్న విషయానికే ఆత్మహత్యాయత్నం చేసిన తిరుపతమ్మకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి రాజారెడ్డిని కూడా గట్టిగా హెచ్చరించారు.

మళ్లీ హల్‌చల్ చేసిన కోహ్లి, అనుష్క



దంబుల్లా: ప్రేమ పక్షులు విరాట్ కోహ్లి, అనుష్క శర్మలు మరోసారి హల్‌చల్ చేశారు. దంబుల్లాలోని ఆలియా రిసార్ట్‌లో వీరిద్దరూ మొక్కలు నాటుతూ కనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. శ్రీలంకలో ఆదివారం జరిగిన తొలి వన్డేకు ముందు వీరిద్దరూ ఇలా రిసార్ట్‌లో మొక్కలు నాటుతో సందడి చేశారు. ప్రస్తుతం టీమిండియా శ్రీలంకలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. దీంతో కెప్టెన్ విరాట్ కోహ్లి ప్రియురాలు అనుష్క శర్మ కూడా ఇక్కడికి చేరింది. ఇప్పటికే ఇద్దరు కలిసి లంకలో విహార యాత్రలు చేశారు. టెస్టు సిరీస్ ముగిసిన వెంటనే చాలా రోజులు విరామం లభించడంతో ప్రేమపక్షులు షికార్లు, విందులు, వినోదాలతో సందడిగా గడిపారు. మూడో టెస్టుకు వేదికగా ఉన్న క్యాండీ నగరంలో కూడా కోహ్లి, అనుష్కలు చాలా ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా అభిమానులతో సెల్ఫీలు కూడా దిగారు. శ్రీలంకలోని పర్యాటక ప్రదేశాలను చుట్టి వచ్చారు. ఈ సందర్భంగా వీరు తీసిన ఫొటోలను సోషల్ మీడియాలో ట్వీట్ చేస్తూ తమ ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. తాజాగా వీరిద్దరూ మొక్కలు నాటుతు కనిపించిన ఫొటోలను కూడా అప్‌లోడ్ చేశారు. ఇది వైరల్‌గా మారింది.

ధావన్ విధ్వంసం

మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్
శిఖర్ (132)
నాటౌట్



రాణించిన కోహ్లి, చెలరేగిన బౌలర్లు, కుప్పకూలిన శ్రీలంక, తొలి వన్డేలో భారత్ ఘన విజయం

దంబుల్లా: శ్రీలంతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తొలి వన్డేలో భారత్ 9 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0 ఆధిక్యాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 43.2 ఓవర్లలో కేవలం 216 పరుగులకే కుప్పకూలింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా కేవలం 28.5 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. శిఖర్ ధావన్ 132 (నాటౌట్), విరాట్ కోహ్లి 82 (నాటౌట్) అద్భుత బ్యాటింగ్‌తో భారత్‌కు ఘన విజయం అందించారు.

రోహిత్ విఫలం...

ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ శిఖర్ ధావన్ కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చాడు. ప్రారంభం నుంచే లంక బౌలర్లపై ఎదురు దాడికి దిగాడు. చూడచక్కని షాట్లతో అలరించాడు. అయితే మరో ఓపెనర్ రోహిత్ శర్మ మాత్రం లంక బౌలర్లను ఎదుర్కొవడంలో ఇబ్బంది పడ్డాడు. రోహిత్‌పై ఒత్తిడి పెంచడంలో లంక బౌలర్లు సఫలమయ్యారు. ఈ సమయంలో 13 బంతుల్లో 4 పరుగులు చేసిన రోహిత్ రనౌట్‌గా వెనుదిరిగాడు. అప్పటికీ టీమిండియా స్కోరు 23 పరుగులు మాత్రమే.

ధావన్, కోహ్లి జోరు...

ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లి అండతో శిఖర్ ధావన్ లంక బౌలర్లను హడలెత్తించాడు. కోహ్లి కూడా తన మార్క్ షాట్లతో చెలరేగి పోయాడు. ఇద్దరు పోటీ పడి షాట్లు కొట్టడంతో స్కోరు వేగంగా పరిగెత్తింది. వీరిని కట్టడి చేసేందుకు లంక బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ధావన్ టెస్టు సిరీస్‌లోని ఫాంను ఈసారి కూడా కొనసాగించాడు. లంక బౌలర్లను ముప్పుతిప్పలు పెడుతూ జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. ఈ క్రమంలో భారత్ స్కోరు 8.1 ఓవర్లలో 50 పరుగులకు చేరింది. తర్వాత ఇద్దరు దూకుడును మరింత పెంచారు. అంతేగాక 38 బంతుల్లోనే రెండో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. కాగా, ధావన్‌ను అదుపు చేయడం లంక బౌలర్లకు శక్తికి మించిన పనిగా మారింది. విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన ధావన్ 36 బంతుల్లో 8ఫోర్లు, ఒక సిక్సర్‌తో అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. అర్ధ సెంచరీ తర్వాత ధావన్‌కు అదుపే లేకుండా పోయింది. లంక బౌలర్లను ఊచకోత కోశాడనే చెప్పాలి. ధావన్ జోరుతో కెప్టెన్ కోహ్లి మైదానంలో ప్రేక్షక పాత్రకే పరిమితం అయ్యాడు. వరుస ఫోర్లతో ధావన్ మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. బంతి ఎలా వచ్చినా వాటిని ఫోర్లుగా మలచడంతో లంక బౌలర్లు డీలా పడ్డారు. ఇదే క్రమంలో 79 బంతుల్లోనే రెండో వికెట్‌కు వంద పరుగులను జోడించారు.

శిఖర్ శతకం...

అసాధారణ రీతిలో ధావన్ చెలరేగి పోవడంతో లంక బౌలర్లు బేజారెత్తి పోయారు. ప్రతి బౌలర్ ధావన్ ప్రతాపానికి కంగు తినాల్సి వచ్చింది. అతని ఎలా కట్టడి చేయాలో తెలియక ఇబ్బంది పడ్డారు. మరోవైపు ధావన్ మాత్రం తన మార్క్ షాట్లతో విధ్వంసం సృష్టించాడు. కోహ్లి అతనికి మంచి సహకారం అందించాడు. స్ట్రయిక్ రోటెట్ చేస్తూ ధావన్‌కే బ్యాటింగ్ చేసే అవకాశం కల్పించాడు. ఈ క్రమంలో ధావన్ 79 బంతుల్లో 16 ఫోర్లు, మరో రెండు



భారీ సిక్సర్లతో సెంచరీని పూర్తి చేశాడు. ధావన్‌కు ఇది వన్డేల్లో 11వ శతకం కావడం విశేషం. ఇదే క్రమంలో మూడో వికెట్‌కు 150 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. మరోవైపు కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన విరాట్ 50 బంతుల్లో ఆరు ఫోర్లతో అర్ధ సెంచరీని అందుకున్నాడు. చివరికి ధావన్ 90 బంతుల్లో 20 ఫోర్లు, మరో మూడు భారీ సిక్సర్లతో 132 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కోహ్లి 70 బంతుల్లోనే పది ఫోర్లు, ఒక సిక్సర్‌తో 82 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. దీంతో టీమిండియా మరో 127 బంతులు మిగిలివుండగానే విజయాన్ని అందుకుంది. ఈ క్రమంలో కోహ్లి, ధావన్‌లు రెండో వికెట్‌కు 197 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. విధ్వంసక సెంచరీతో భారత్‌ను గెలిపించిన ధావన్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.

శుభారంభం...

అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంకకు ఓపెనర్లు నిరోషన్ డిక్వెలా, గుణతిలకకు అద్భుత ఆరంభాన్ని ఇచ్చారు. ఇద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరును పరిగెత్తించారు. వీరిని ఔట్ చేసేందుకు భారత బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇద్దరు అడపాదడపా బౌండరీలతో చెలరేగి పోయారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన గుణతిలక 4 ఫోర్లతో 35 పరుగులు చేసి చాహల్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. దీంతో 74 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. గుణతిలక ఔటైన డిక్వెలా జోరు కొనసాగించాడు. అతనికి కుశాల్ మెండిస్ అండగా నిలిచాడు. వీరోచిత ఇన్నింగ్స్ ఆడిన డిక్వెలా 74 బంతుల్లో 8 ఫోర్లతో 64 పరుగులు చేసి కేదార్ జాదవ్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికి పోయాడు.

టపా..టపా...

డిక్వెలా ఔటైనా వెంటనే మ్యాచ్ స్వరూపం ఒక్కసారిగా మారి పోయింది. అనూహ్యంగా భారత బౌలర్లు పైచేయి సాధించారు. లంక బ్యాట్స్‌మెన్‌ను హడలెత్తిస్తూ వరుస క్రమంలో వికెట్లు పడగొట్టారు. ముఖ్యంగా అక్షర్ పటేల్ చెలరేగి పోయాడు. చూడ చక్కని బంతులతో లంక బ్యాట్స్‌మెన్‌ను వణికించాడు. అతని ధాటికి కుశాల్ మెండిస్ (36), హసరంగా (2), సందకాన్ (5) పెవిలియన్ చేరారు. కేదార్ జాదవ్ కూడా కెప్టెన్ ఉపుల్ తరంగ (13) వెనక్కి పంపాడు. కపుగెదెరను కోహ్లి అద్భుతంగా రనౌట్ చేశాడు. ఒక దశలో వికెట్ నష్టానికి 139 పరుగులతో పటిష్టంగా ఉన్న శ్రీలంక తర్వాత వరుసగా వికెట్లను కోల్పోయి 216 పరుగులకే కుప్పకూలింది. లంక చివరి 9 వికెట్లను 66 లోపు కోల్పోవడం విశేషం. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ మూడు వికెట్లు పడగొట్టాడు. కేదార్ జాదవ్, యజువేంద్ర చాహల్, జస్‌ప్రిత్ బుమ్రాలు తలో రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేయడంలో తమవంతు పాత్ర పోషించారు.

స్కోరు బోర్డు

శ్రీలంక ఇన్నింగ్స్: డిక్వెలా ఎల్బీ–బి కేదార్ జాదవ్ 64, దనుష్క గుణతిలక (సి) రాహుల్ (బి) చాహల్ 35, కుశాల్ మెండిస్ (బి) అక్షర్ పటేల్ 36, ఉపుల్ తరం (సి) ధావన్ (బి) కేదార్ జాదవ్ 13, మాథ్యూస్ నాటౌట్ 36, కపుగెదెర రనౌట్ 1, హసరంగా (సి) కేదార్ జాదవ్ (బి) అక్షర్ పటేల్ 2, తిసారా పెరీరా (బి) జస్‌ప్రిత్ బుమ్రా 0, లక్షణ్ సందకాన్ ఎల్బీ–బి అక్షర్ పటేల్ 5, లసిత్ మలింగ (స్టంప్డ్) ధోనీ (బి) చాహల్ 8, విశ్వ ఫెర్నాండో నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 16, మొత్తం 43.2 ఓవర్లలో 216 ఆలౌట్.
బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 6–0–33–0, హార్దిక్ పాండ్యా 6–0–35–0, జస్‌ప్రిత్ బుమ్రా 6.2–0–22–2, యజువేంద్ర చాహల్ 10–0–60–2, కేదార్ జాదవ్ 10–0–34–3.
భారత ఇన్నింగ్స్: రోహిత్ శర్మ రనౌట్ 4, శిఖర్ ధావన్ నాటౌట్ 132, విరాట్ కోహ్లి నాటౌట్ 82, ఎక్స్‌ట్రాలు 2, మొత్తం 28.5 ఓవర్లలో 220/1.
బౌలింగ్: లసిత్ మలింగ 6.3–0–40–0, విశ్వ ఫెర్నాండో 6–0–43–0, మాథ్యూస్ 2–0–9–0, తిసారా పెరీరా 2–0–18–0, సందకాన్ 5–0–46–0, హసరంగా 4–0–29–0.



నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది: సచిన్

ముంబయి: టీమిండియాకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని భారత మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ స్పష్టం చేశాడు. క్రికెటర్లను ప్రోత్సహించడంలో తాను ఎల్లప్పుడూ ముందు వరుసలో నిలబడుతానని తెలిపాడు. క్రికెట్ అభివృద్ధికి తనవంతు సహకారం అందించేందుకు తాను సదా సిద్ధమేనని వివరించాడు. ఆదివారం ముంబయిలో జరిగిన హాఫ్ మారథాన్ కార్యక్రమంలో సచిన్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా జెండా ఊపి రేసును ప్రారంభించాడు. అనంతరం మీడియాతో ముచ్చటించాడు. శ్రీలంక పర్యటనలో కోహ్లి సేన చాలా బాగా ఆడుతుందని ప్రశంసించాడు. జట్టులో ప్రతిభావంతులైన క్రికెటర్లు ఉన్నారన్నాడు. టెస్టులు, వన్డేల్లో టీమిండియా చాలా బలంగా మారిందన్నాడు. కోహ్లి నాయకత్వ ప్రతిభతో ఆటగాళ్లు మరింత రాటుదేలుతున్నారని సచిన్ అభిప్రాయపడ్డాడు. కాగా, తనకు పురుషులు, మహిళా జట్లు సమానమేనని స్పష్టం చేశారు. రెండు జట్ల క్రికెటర్లకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చాడు. ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో టీమిండియా బలమైన జట్టుగా ఎదుగుతుందన్నాడు. రానున్న రోజుల్లో భారత్‌ను ఓడించడం ఇతర జట్లకు చాలా కష్టంగా మారవచ్చని తెలిపాడు.

మంచి స్పందన: కాగా, ఆదివారం ఎల్ఐసి ఆధ్వర్యంలో నిర్వహించిన మారథాన్‌లో వేలాది మంది ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొన్నారు. గతంతో పోల్చితే ఈసారి మారథాన్ మరింత మెరుగైన స్పందన లభించింది. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ రేసుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ముంబయి నగరంలోని ప్రధాన వీధుల గుండా ఈ రేసు కొనసాగింది. మహిళలు, పురుషుల విభాగంలో పోటీలు నిర్వహించారు. దేశంలోని వివిధ నగరాల నుంచే కాకుండా విదేశాల నుంచి క్రీడాకారులు ఈ మారథాన్‌లో పాలు పంచుకున్నారు. కాగా, పోటీలను పురస్కరించుకుని నిర్వాహకులు కట్టుదిట్టమైన భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. రేసులో పాల్గొన్న క్రీడాకారులకు ఎటువంటి లోటు రాకుండా నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు.



ముగిసిన ఖో ఖో పోటీలు



మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ ఖో ఖో పోటీలు ఆదివారం ముగిశాయి. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణకు చెందిన మహిళలు, పురుషుల జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో రంగారెడ్డి విజేతగా నిలిచింది. ఫైనల్లో రంగారెడ్డి అద్భుత ఆటతో వరంగల్‌ను మట్టి కరిపించింది. మరోవైపు మూడో స్థానం కోసం జరిగిన పోరులో కరీంనగర్ జట్టు విజయం సాధించింది. మహిళల విభాగంలో కరీంనగర్ విజేతగా నిలిచింది. ఆదివారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో కరీంనగర్ అద్భుత ఆటతో ఆతిథ్య హైదరాబాద్ జట్టును ఓడించింది. హైదరాబాద్ చివరి వరకు గట్టి పోటీ ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. కాగా, రంగారెడ్డి జట్టుకు కాంస్యం దక్కింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖో ఖో అతి ప్రాచిన క్రీడల్లో ఒకటని, దీన్ని అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇదిలావుండగా తెలంగాణ ఖో ఖో సంఘం కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి మహేందర్ రావు, రంగారెడ్డి జిల్లా డివైఎస్ఓ వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పట్నాకు పల్టాన్ షాక్

లక్నో: ప్రొ కబడ్డీ ఐదో సీజన్‌లో ఆదివారం పెను సంచలనం నమోదైంది. హోరాహోరీగా సాగిన తొలి మ్యాచ్‌లో పుణేరి పల్టాన్ 47–42 తేడాతో రెండు సార్లు చాంపియన్ పట్నా పైరేట్స్‌ను చిత్తు చేసింది. ప్రారంభం నుంచే రెండు జట్లు నువ్వానేనా అన్నట్టు తలపడ్డాయి. దీంతో ఆధిపత్యం తరచు చేతులు మారుతూ వచ్చింది. పట్నా జట్టులో పర్దీప్ నర్వల్ ఆకాశమే హద్దుగా చెలరేగి పోయాడు. పుణేరి పల్టాన్ ఆటగాళ్లను హడలెత్తిస్తూ ఏకంగా 19 పాయింట్లను సాధించాడు. వినోద్ కుమార్ కూడా ఏడు పాయింట్ల సాధించాడు. అయితే మిగతావారు విఫలం కావడంతో పైరేట్స్‌కు ఓటమి తప్పలేదు. మరోవైపు పుణేరి జట్టులో రాజేష్ పది, దీపక్ హుడా తొమ్మిది పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఉత్కంఠ భరితంగా సాగిన మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పంథార్ 24–22 పాయింట్ల తేడాతో యూపి యోధాను ఓడించింది. తుశార్, నితిన్ ఐదేసి పాయింట్లు సాధించి జైపూర్‌ను గెలిపించారు.





డేర్ డెవిల్స్ కొత్త కోచ్‌గా గిలెస్పీ!

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) ఫ్రాంచైజీ ఢిల్లీ డేర్ డెవిల్స్ కొత్త కోచ్‌గా ఆస్ట్రేలియా మాజీ దిగ్గజం జాసన్ గిలెస్పీని నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు రాహుల్ ద్రవిడ్ ఢిల్లీ జట్టుకు ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తు వచ్చాడు. అయితే బిసిసిఐ ప్రవేశ పెట్టిన కొత్త నిబంధనల ప్రకారం ద్రవిడ్ తన పదవిని వదులు కోవాల్సి వచ్చింది. భారత అండర్–19, భారత–ఎ జట్టు ప్రధాన కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవి కాలాన్ని భారత క్రికెట్ బోర్డు మరో రెండేళ్లపాటు పొడిగించింది. దీంతో ద్రవిడ్ కొత్త నిబంధనల ప్రకారం ఢిల్లీ జట్టు కోచ్ పదవి బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. దీంతో ద్రవిడ్ స్థానాన్ని గిలెస్పీతో భర్తీ చేయాలనే ఆలోచనలో ఢిల్లీ ఫ్రాంచైజీ ఉన్నట్టు సమాచారం. గిలెస్పీ అంతర్జాతీయ క్రికెట్‌లో మంచి బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. అంతేగాక, పలు జట్లకు కోచ్‌గా కూడా పనిచేసిన అనుభవం ఉంది. ద్రవిడ్ స్థానంలో అతన్ని ప్రధాన కోచ్‌గా నియమిస్తే బాగుంటుందని జట్టు యాజమాన్యం భావిస్తోంది. ఇందులో భాగంగానే వారు గిలెస్పీతో చర్చలు కూడా జరిపినట్టు సమాచారం. త్వరలోనే దీనిపై జట్టు యాజమాన్యం అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. కాగా, గిలెస్పీ 71 టెస్టులు, 97 వన్డేల్లో ఆస్ట్రేలియాకు ప్రాతినిథ్యం వహించాడు. ఈ సందర్భంగా టెస్టుల్లో 259, వన్డేల్లో 142 వికెట్లను పడగొట్టాడు.

ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ విజయం

చిత్తుగా ఓడిన వెస్టిండీస్



బర్మింగ్‌హామ్: ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్టులో వెస్టిండీస్ జట్టు ఇన్నింగ్స్ 209 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 514 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. తర్వాత తొలి ఇన్నింగ్స్ చేపట్టిన వెస్టిండీస్ జట్టు ఇంగ్లాండ్ బౌలర్ల ధాటికి నిలువలేక కేవలం 168 పరుగులకే కుప్పకూలింది. తర్వాత ఫాలో ఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లో 137 పరుగులకే ఆలౌటై ఘోర పరాజయాన్ని మూట గట్టుకుంది. ఇంగ్లాండ్ బౌలర్లలో స్టువర్ట్ బ్రాడ్ మూడు వికెట్లు తీయగా, అండర్సన్, రోలాండ్ జోన్స్, మొయిన్ అలీ రెండేసి వికెట్లను పడగొట్టారు. వెస్టిండీస్ జట్టులో ఓపెనర్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ అత్యధికంగా 40 పరుగులు చేశాడు. మిగతావారు ఘోరంగా విఫలమయ్యారు. కాగా, ఇంగ్లాండ్ బౌలర్లు మూడో రోజు ఆకాశమే హద్దుగా చెలరేగి పోయారు. ఏకంగా 19 వికెట్లు పడగొట్టి విండీస్ ఇన్నింగ్స్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు.

బోథమ్‌ను దాటిన బ్రాడ్

ఇంగ్లాండ్ స్టార్ ఫాస్ట్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ తన కెరీర్‌లో అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఇంగ్లాండ్ తరపున టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా బ్రాడ్ నిలిచాడు. వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టు సందర్భంగా బ్రాడ్ తన ఖాతాలో 384వ వికెట్‌ను జమ చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఇంగ్లాండ్ దిగ్గజ ఆల్‌రౌండర్ ఇయాన్ బోథమ్ పేరిట ఉన్న 383 టెస్టు వికెట్ల రికార్డును బ్రాడ్ బద్దలు కొట్టాడు. అంతేగాక, టెస్టుల్లో ఇంగ్లాండ్ తరపున అత్యధిక వికెట్లను పడగొట్టిన బౌలర్‌గా నిలిచాడు. జేమ్స్ అండర్సన్ 492 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. మరో 8 వికెట్లు తీస్తే ఇంగ్లాండ్ తరపున ఐదు వందల వికెట్లను పడగొట్టిన తొలి బౌలర్‌గా అండర్సన్ చరిత్ర సృష్టిస్తాడు. కాగా, మొదటి టెస్టులో బ్రాడ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ముఖ్యంగా రెండో ఇన్నింగ్స్‌లో విండీస్‌కు చెందిన మూడు కీలక వికెట్లను పడగొట్టి ఇంగ్లాండ్ విజయంలో ముఖ్య భూమిక పోషించాడు.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.